SAPTHAGIRI (TELUGU)
ILLUSTRATED MONTHLY
Volume: 53, Issue: 2
JULY - 2022, Price Rs.5/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

జూలై 2022 వెల రూ. 5/-
పుటలు-56



తిరుమల శ్రీవారి
ఆణివర ఆస్థానము
17-07-2022



ఆంధ్రప్రదేశ్ అమరావతిలోని వేంకటపాలెం వద్ద తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జూన్ 5 నుండి 9వ తేదీ వరకు విగ్రహప్రతిష్ఠ, ఆలయమహాసంప్రోక్షణ, శాంతి కల్యాణ ఉత్సవం తదితర కార్యక్రమాలు జరిగాయి.

ఈ కార్యక్రమంలో శారదాపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగవర్నర్ శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్, దేవదాయశాఖ మంత్రివర్యులు శ్రీకొట్టు సత్యనారాయణ, తి.తి.దే. అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారి (తిరుపతి) శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్. తదితరులు పాల్గొన్నారు.
















## గీతాశ్లోకార్థసారం

శ్లో : తస్మాన్నార్హా వయం హన్తుం ధార్తరాష్ట్రాన్ స్వబాన్ధవాన్ ।
స్వజనం హి కథం హత్వా సుఖినస్స్యామ మాధవ ॥

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం- 37వ శ్లోకం)

ప్రతిపదార్థం: మాధవ= ఓ కృష్ణా!; తస్మాన్= అందువలన; స్వబాన్ధవాన్= మన బంధువులగు; ధార్తరాష్ట్రాన్= దుర్యోధనాదులను; హన్తుం= చంపుటకు; వయం= మనం; నార్హాః= తగినవారముకాము, స్వజనం= మనవారిని; హత్వా= చంపి, సుఖినః= సుఖవంతులం; కథం= ఎట్లు; స్యామ హి= కాగలము?

భావం: ఓ కృష్ణా! కాబట్టి మన బంధువులైన దుర్యోధనాదులను చంపడానికి మనం తగినవారముకాము. మనవాళ్లను చంపి మనమెలా సుఖపడగలం?

## నగరాజధరుఁడ శ్రీనారాయణా!

నిగమనిగమాంతవర్ణిత మనోహరరూప
నగరాజధరుఁడ శ్రీనారాయణా

దీపించు వైరాగ్యదివ్యసౌఖ్యం బియ్య
నోపకకదా నన్ను నొడఁబరపుచు
పైపైనె సంసారబంధములఁ గట్టేవు
నా పలుకు చెల్లునా నారాయణా

చీకాకుపడిన నాచిత్తశాంతము సేయ
లేకకా నీవు బహులీల నన్ను
కాకునేసెదవు బహుకర్మములఁ బడువారు
నాకొలఁదివారలా నారాయణా

వివిధనిర్బంధముల వెడలఁద్రోయక నన్ను
భవసాగరములఁ దడఁ బడఁ జేతురా
దివిజేంద్రవంద్య శ్రీతిరువేంకటాద్రీశ
నవనీతచోర శ్రీనారాయణా


(సంపుటం-01, సంకీర్తన-243)





*తొలి పలుకులనబడే వేదాలు, వేదాలసారమైన ఉపనిషత్తులు మాత్రమే ఆ పురుషోత్తముణ్ణి వర్ణించగలవు. మహర్షులు తప, జప, ధ్యానాదులను ఆచరించి యోగశక్తితో, దివ్యదృష్టితో ఆ దేవదేవుణ్ణి దర్శించి వేదవేదాంతాలలో తమ స్వానుభవాన్ని వ్యక్తీకరించారు.*

*భగవంతుని రూపం మనోహరం. భగవంతుడు సాక్షాత్కరించగానే, ఆ దృగ్విషయాన్ని దర్శించగానే మనస్సు హరించబడుతుంది. మనస్సు చంచలమైంది. చంచలత్వమే దాని ఉనికి. చపలత్వం ఆగిపోతే మనస్సు నీరులేని కాసారంలా అస్తిత్వం కోల్పోతుంది. భగవంతుని రూపం కడు రమణీయమైంది, అత్యంతశోభాయమానమైంది. దాన్ని చూడగానే మనస్సు నివ్వెరపోయి, నిశ్చలమౌతుంది. భగవత్ తత్త్వాన్ని సంపూర్ణంగా వర్ణించ సాధ్యం కాదు. ఆయన మహిమాన్వితకు ఒక్క ఉదాహరణ ఇస్తే చాలు, ఆయనేంటో ఇట్టే తెలుస్తుంది. నగరాజమైన గోవర్ధనగిరిని తన చూపుడు వేలిమీద ధరించిన వాడు ఆయన. అలాంటి శక్తిసంపన్నుని దగ్గర లేనిదేముంటుంది. ఆయన ఏది కావాలనుకొంటే దాన్ని మనకివ్వగలడు అని అన్నమయ్య పై కీర్తనలో తిరుమలగిరివాసుణ్ణి స్తుతించాడు.*



## గోమాత స్తుతి

మంగళం దర్శనం ప్రాతః
పూజనం పరమం పదమ్।
స్పర్శనం పరమం తీర్థం
నాస్తి ధేను సమం క్వచిత్॥

**ప్రాతఃకాలంలో లేచి గోమాతను చూస్తే మంగళప్రదమవుతుంది. గోవును స్పృశిస్తే సర్వతీర్థాలను సేవించినట్లే, గోవుతో సమానమైనది, పరమపవిత్రమైనది మరొకటి లేదు. అటువంటి గోవుకు నమస్కారము.**




తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# పంచగవ్య ఉత్పత్తుల విక్రయ కేంద్రము

## "నమామి గోవింద"

### ధరల పట్టిక

| క్రమ సంఖ్య | ఉత్పత్తి పేరు | పరిమాణం / ఒక్కొక్కటి | వెల (ఒక్కొక్కటి) |
|---|---|---|---|
| 01 | అవని-ధూపచూర్ణము | 50 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.70/-<br>రూ.115/- |
| 02 | ధరణి-ధూప అగరబత్తి | 12 స్టిక్స్<br>24 స్టిక్స్ | రూ.60/-<br>రూ.110/- |
| 03 | ధాత్రి-ధూపపు కప్పులు | 6 కప్పులు<br>12 కప్పులు | రూ.70/-<br>రూ.110/- |
| 04 | వైష్ణవి-ధూపపు | 20 స్టిక్స్ | రూ.30/- |
| 05 | వరాహి-ధూపపు కోన్స్ | 12 కోన్స్<br>24 కోన్స్ | రూ.30/-<br>రూ.50/- |
| 06 | పృథ్వి-విభూది | 10 గ్రా॥<br>30 గ్రా॥<br>50 గ్రా॥ | రూ.30/-<br>రూ.40/-<br>రూ.60/- |
| 07 | ధన్విక-టూత్‌పౌడర్ | 50 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.40/-<br>రూ.60/- |
| 08 | హిరణ్మయి-ఫేస్ ప్యాక్ | 50 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.110/-<br>రూ.200/- |
| 09 | మహి-సబ్బు | 25 గ్రా॥<br>75 గ్రా॥<br>100 గ్రా॥ | రూ.40/-<br>రూ.80/-<br>రూ.110/- |
| 10 | కశ్యపి-షాంపూ | 5 మి.లీ.<br>100 మి.లీ. | రూ.10/-<br>రూ.210/- |
| 11 | ఉర్వి-నాజల్ డ్రాప్స్ | 10 మి.లీ. | రూ.100/- |
| 12 | నందిని-గో అర్కము | 200 మి.లీ.<br>500 మి.లీ.<br>1 లీటరు | రూ.50/-<br>రూ.110/-<br>రూ.200/- |
| 13 | భూమి- ఫ్లోర్ క్లీనర్ | 1 లీటరు<br>5 లీటర్లు | రూ.250/-<br>రూ.1050/- |
| 14 | క్షమ-గోవు పేడ పిడకలు | 10 పిడకలు<br>12 పిడకలు | రూ.140/-<br>రూ.170/- |
| 15 | భూపతి-గోవు పేడ దుంగలు | 6 దుంగలు<br>12 దుంగలు | రూ.90/-<br>రూ.180/- |

- కార్యనిర్వహణాధికారి, తి.తి.దే. తిరుపతి.




# 52 వసంతాల

1970-2022

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 53 జూలై, 2022 సంచిక : 02


వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన ।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఏ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ప్రతిక్షణం భక్తులసేవలో.. తి.తి.దే. | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 07 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 12 |
| 'పురి' జగన్నాథా! మా పురాలని రక్షించు!! | బ్రహ్మశ్రీ డా॥మైలవరపు శ్రీనివాసరావు | 13 |
| శివుడూ, నందీశ్వరుడూ.. ఇద్దరూ గర్భాలయంలోనే..! | డా॥ చింతకుంట శివారెడ్డి | 17 |
| జీవితాన్ని క్రమబద్ధం చేయడానికే... | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 19 |
| సాక్షాత్కార వైభవోత్సవం | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 21 |
| ఈయన శక్తి అమోఘం! | బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ | 24 |
| రారండోయ్... చూచొద్దాం!! | శ్రీ రామోజు హరగోపాల్ | 31 |
| ఆచార్యదేవో భవ | డా॥ కప్పగంతు రామకృష్ణ | 36 |
| అన్నమయ్య అర్చించిన దేవుడు! | డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు | 38 |
| ఈ రోజుతోనే పండుగలన్నీ మొదలు... | శ్రీమతి డి.వరలక్ష్మి | 39 |
| శుభాల మాసానికి స్వాగతం! | శ్రీమతి తంగిరాల మానస | 40 |
| భక్తుల ఆకలి తీర్చేందుకే...! | శ్రీమతి జానపాటి మనస్విని | 42 |
| మురిపాలా అరచేతా మొగ్గతొడిగింది! | కళారత్న డా॥ జి.వి.పూర్ణచందు | 44 |
| స్వామిపాదాలు విడువను... | శ్రీమతి జె.అపర్ణ | 46 |
| జీవితచక్రంలో.. చక్రం | శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు | 47 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 48 |
| నాన్న పులి (చిత్రకథ) | కథ: డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు: శ్రీ తుంబలి శివాజీ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 52 |
| ఇంతకు ఇంతే! | శ్రీ ఎస్.కె.సైదా | 53 |
| బాలవినోదం | | 54 |


ముఖచిత్రం : శ్రీవారి ఆణివర ఆస్థానం, తిరుమల
వెనుక చిత్రం : శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి సాక్షాత్కారవైభవం, శ్రీనివాసమంగాపురం


ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333





వెబ్‌సైట్- www.tirumala.org; 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# ప్లాస్టిక్ బతుకులు మానేద్దాం!

ప్లాస్టిక్‌బ్యాగ్‌లు లేని ప్రపంచాన్ని ఒక్కసారి ఊహించుకోండి.. ఊహకి అందట్లేదా...? దుకాణాలకు వెళ్లి కావాల్సినవన్నీ కొనుక్కుని వాటిని ప్లాస్టిక్‌సంచులలో తెచ్చుకునే మనం అవి లేకుండా ఒక్కరోజైనా బతగ్గలమా? కూరగాయలనుంచి భోజనం పార్శిల్ దాకా, టీ నుంచి టిఫిన్ దాకా... వస్తువు ఏదైనా సరే ప్లాస్టిక్‌సంచిలో ఇట్టే ఇమిడిపోయి దుకాణం నుంచి మన చేతిలోకి వచ్చేస్తుంది. మనతో పాటు ఇంటికొస్తుంది. అక్కణ్ణుంచి మొదలవుతుంది ప్లాస్టిక్‌సంచుల వీరవిహారం. రోడ్డుపక్క చూసినా, చెత్త కుప్పట్లో చూసినా, డ్రైనేజీల్లో చూసినా, కాలువల్లో చూసినా, నదుల్లో చూసినా.. సముద్రతీరంలో చూసినా ప్లాస్టిక్ సంచులే! అవన్నీ కరిగిపోయేవి; మట్టిలో కలసిపోయేవి అయితే ప్లాస్టిక్‌బ్యాగులు బాగానే ఉంటాయి. కానీ, కాదే!! ఒకసారి ప్లాస్టిక్‌సంచి తయారైతే అది వేలఏళ్లదాకా అలాగే ఉంటుంది. మరేదీ చేయలేనంతగా పర్యావరణాన్ని కలుషితం చేస్తుంది.

గడిచిన ముప్పయి ఏళ్లలో భూగోళాన్ని అత్యంత కలుషితం చేసిన వస్తువు ప్లాస్టిక్‌కవరేనని పర్యావరణ కార్యకర్తలు అంటున్నారు. ప్లాస్టిక్‌సంచుల వాడకంవల్ల ప్రకృతివనరులు తరిగిపోతున్నాయి. భూమి, నీరు కలుషితమై జలచరాలకు ప్రాణహాని కలుగుతోంది. నగరాల్లో ఆవులు, గేదెలు చెత్తకుప్పలవద్ద ప్లాస్టిక్‌సంచులలో పారేసిన కూరగాయలు తినబోయి ఆ సంచులను కూడా తిని మృత్యువాతపడుతున్నాయి. పాలిథీన్ సంచులకు, నగరాల్లో వరదలకుకూడా సంబంధం ఉంది. కవర్లను వాడేసి ఎక్కడపడితే అక్కడ వదిలేయడం వల్ల అవి డ్రైనేజీలలోకి చేరి నీటిప్రవాహానికి అడ్డుపడుతున్నాయి. వర్షం కురిసినప్పుడు నీరు సరిగా పారకుండా వరదలొస్తున్నాయి. అందుకే ప్లాస్టిక్‌సంచులు మనకు ఎంత సౌకర్యంగా ఉంటాయో, అంతకంటే ఎక్కువగా కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.

ఈ అంశాలన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న మనరాష్ట్ర దేవదాయశాఖ, ఇకనుంచి దేవాలయాల్లో ప్లాస్టిక్‌వస్తువులకు స్వస్తిపలకనుంది. ప్లాస్టిక్ నీటిసీసాలతో పాటు ప్లాస్టిక్‌సంచులలో పూజాసామగ్రిని ఆలయాల్లోకి అనుమతించరు. అలాగే ఆలయానికి అనుబంధంగా ఉండే దుకాణాల్లో ప్లాస్టిక్‌సంచులు, నీటి సీసాల అమ్మకాలను నిషేధించనున్నారు. తొలిదశలో ప్రధాన ఆలయాలన్నిటిలో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిస్థాయిలో నిషేధించనున్నారు.

తిరుమలక్షేత్రంలో ప్లాస్టిక్‌వస్తువులవినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో అమలు జరుగుతున్న తరహాలోనే ప్రధానదేవాలయాల్లో శుభ్రమైన మంచినీటి సరఫరాకు చర్యలు చేపడతారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీవై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, దేవదాయశాఖ కార్యక్రమాలపై ఈ సంవత్సరం 'మే' నెలలో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా తి.తి.దే.లో అమలులో ఉన్న మంచివిధానాలను అన్ని ఆలయాల్లో అమలు చేయాలంటూ స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి ఇంత మంచిపేరు తెచ్చుకున్న తి.తి.దే. ప్రతిష్ఠను మరింత పెంపుచేయడం ఒక్క తి.తి.దే. అధికారులచేతుల్లోనే కాదు, భక్తులచేతుల్లో కూడా ఉంది.

ఒకసారిగా మన అలవాట్లు మార్చుకోవడం కొంత కష్టమే! అందుకే మనం క్రమక్రమంగా ప్లాస్టిక్ సంచులవాడకాన్ని తగ్గించుకోవాలి. చేతిలో సంచితో యాత్రలకు వెళ్లడం మొదలుపెట్టాలి. ప్లాస్టిక్ వాడకాలవల్ల పర్యావరణానికి తీవ్రహాని జరుగుతుంది కాబట్టి మన తాత్కాలిక సౌకర్యాలను వదులుకుని మన చుట్టూ ఉన్న పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా అడుగులువేద్దాం!







## ప్రతిక్షణం భక్తుల సేవలో..
## తిరుమల తిరుపతి దేవస్థానం

# 24 x 7

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478

కలియుగప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరునికి అనంతనామాలున్నాయి. కాస్త చదువుకున్నవారు శ్రీవేంకటేశ్వరస్వామి అష్టోత్తర శతనామావళిని పఠిస్తారు. ఓపికున్నవారు శ్రీవేంకటేశ్వరసహస్రనామావళిని మననం చేస్తారు. ఇవేవీ చేయలేనివారు అచ్చమైన తెలుగుపదాలున్న 'ఏడుకొండలవాడా!' అని ఎలుగెత్తి స్వామిని ఆరాధిస్తారు.

భారతీయులు ప్రత్యేకించి హైందవులు స్వామి అంతటా ఉన్నాడనే భావన సామాన్యులకు కూడా కలగడానికి వీలుగా కొండల్లో, కోనల్లో, నదీ, సముద్రతీరాల్లో అరణ్యసీమల్లో, చివరకు జలప్రవాహాల మధ్య కూడా ఆలయాలను నిర్మించుకున్నారు. అంతేకాదు స్వామి స్వయంభువుగా ఆయా ప్రదేశాలలో ఆవిర్భవించాడని విశ్వసిస్తారు. విభిన్నప్రదేశాలలోని ఆలయాలను దర్శించ డానికి కష్ట, నష్టప్రయాసాలకు ఓర్చి సన్నిహితులతో, కుటుంబాలతో ఆబాలగోపాలం కదలి వెళుతుంటారు. అలా వెళ్లే యాత్రికు లకు మార్గమధ్యంలో సేదదీరడానికి పుణ్యాత్ములు సత్రాలు, మఠాలను స్థాపించారు. కొన్నిచోట్ల యాత్రికులకు ఉచితభోజన సదుపాయాలు కల్పిస్తూ పరమానందం పొందుతుంటారు. మరికొందరు తాము వెళ్లకపోయినా యాత్రికులు తమచేత పట్టుకు పోయే పసుపు వస్త్రం కట్టిన చెంబుల్లో కానుకలు సమర్పించి ధన్యులవుతుంటారు. ఆలయప్రదేశాలలో దానధర్మచింతనాపరులు భోజనాదులు కల్పించి ఆనందానుభూతిని పొందుతున్నారు.

ఇవన్నీ బాగున్నాయి కానీ అనునిత్యం వేల, లక్షల సంఖ్యల్లో విచ్చేసే యాత్రికులకు ఆయా ఆలయాల యాజమాన్యాలు ఏమి చేస్తున్నాయనేది కుతూహలం కలిగించే అంశం.

ఈ కోణంలో పరిశీలిస్తే ప్రపంచస్థాయిలోనే అగ్రగామిగా నిలిచిన అతి పెద్ద ధార్మికసంస్థ అయిన తిరుమల తిరుపతి దేవస్థానం తండోపతండాలుగా వస్తున్న భక్తకోటికి ఎన్నో సౌకర్యాలు కల్పిస్తూ వారికెలాంటి చిన్న ఇబ్బంది కూడా కలుగకుండా కంటికి రెప్పలాచూస్తోంది.

తి.తి.దే. భక్తులకు చేసిన, చేస్తున్న సౌకర్యాలపై విహంగవీక్షణం ఈ వ్యాసం!!



## వేసవి నుంచి ఉపశమనం

భారతీయుల 'కాలగమనం' చాలా ప్రాచీనమైంది. ఘడియలు, విఘడియలు, ఉదయాస్తమానకాలాలు, అహో రాత్రాలు, అలాగే వారాలు, నెలలు, ఋతువులు, సంవత్స రాలు, యుగాల గణన చూసి పాశ్చాత్యులు ఆశ్చర్యపడ్డారు. తెలుగువారిది చాంద్రమానం. ఉగాదితో కొత్త సంవత్సరం మొదలౌతుంది. మొదటి ఋతువు వసంతం. రెండవది గ్రీష్మం. మనుషులలో 'ప్రకృతిరక్షణ' కొరవడడంతో నేటికాలంలో ఋతువుల సహజధర్మాలు మారిపోతున్నాయి. వసంతంతో పచ్చ చీరను కట్టిన ప్రకృతిలక్ష్మి కొన్నిచోట్లనే దర్శనమిస్తుంది. వసంతం లోనే గ్రీష్మం ఒక చిన్నరాజ్యాన్ని ఆక్రమించుకోవాలనే పెద్ద రాజ్యంలా తన ఆధిక్యతను ప్రదర్శిస్తుంది.

వేసవిలోనే వివాహాలు, దూరప్రయాణాలు, గృహనిర్మా ణాదులు పుంజుకుంటాయి. ప్రస్తుతం ప్రయాణసాధనాలు అధికం కావడంతో, పిల్లలచదువులకు కాసంత ఊపిరి పీల్చుకునే కాలం కావడంతో చాలామంది యాత్రలకు తరలి వెళుతుంటారు. ప్రత్యేకించి సుమారు రెండుసంవత్సరాలు భయభ్రాంతుల్ని చేసిన 'కరోనా' తగ్గుముఖం పట్టడంతో తీర్థయాత్రలు పుంజుకొన్నాయి. తమతమ విశ్వాసాల కనుగుణంగా వాయిదా వేసుకున్న మొక్కు బడులు చెల్లించుకోవడంకోసం వేలాదిమంది తిరుపతియాత్రకు వస్తున్నారు. ఇలాంటి సందర్భాలలో తిరుమలతిరుపతిదేవస్థానం ఎండాకాలంలో వచ్చిన భక్తులకు కల్పించిన సేవలను ప్రశంసిం చక తప్పదు.

నడకదారిలో యాత్రికులు ఎదుర్కొనే సమస్య లనేకం. మొదటిది 'లగేజ్' సమస్య. ఈ సమస్య తీర్చడంకోసం తి.తి.దే. ఉచితంగా భక్తుల లగేజీ తిరుమల చేర్చడానికి అలిపిరి దగ్గర చక్కటి వ్యవస్థ ఏర్పాటుచేసింది. రెండవది ఎండ, వానల నుండి తగిన రక్షణ. నడకమార్గంలోని 'పై కప్పు'ను ఇటీవల మార్చి ఎండ, వానల బెడదలను తగ్గించారు. మూడవది దారిమధ్యలో తాగునీటిసౌకర్యం. నాల్గవది అక్కడక్కడ విశ్రాంతిస్థలాలు. ఆహ్లాదంతో బాటు ఆధ్యాత్మికచింతన వర్ధిల్లేలాగా ఆళ్వారుల విగ్రహాలు, హరిదాసుల విగ్రహాలు. హనుమదాదిదేవతల విగ్రహాలు. ఇంతటి సౌకర్యాలు భారతదేశంలో ఎక్కడా లేవు. మరి తిరుమలలో యాత్రికులకు లభించే సౌకర్యాలు అనంతం. ఉచితగదులు, ఉచితభోజనం, తిరుమలలో దర్శనీయస్థలాల దర్శనానికి ఉచిత బస్సు సౌకర్యంలాంటివి ఎన్నో!



తిరుమల సాలగ్రామస్వరూపం. అందుకే చెప్పులతో నడవరాదని నియమం. శ్రీరామానుజులు, శ్రీవ్యాసరాయల లాంటివారు మోకాళ్లు ఆనించి తిరుమల కొండ ఎక్కారని జనశ్రుతి. అన్నమయ్య చెప్పులకాళ్లతో ఎక్కుతుంటే అమ్మ అలమేలుమంగ మందలించిందని చరిత్ర. సాధారణంగా భక్తులు కూడా తిరువీథులలో పాదరక్షలు వినియోగించరు. ఒట్టి కాళ్లతోనే సంచరిస్తుంటారు. భక్తులకు ఎండతాకిడితో కాళ్లు



బొబ్బలెక్కకుండా, దినకరుని ప్రతాపంనుంచి భక్తులకు ఉపశమనం కలిగించేందుకు తి.తి.దే. అధికారులు సిమెంటు రోడ్లపై తెల్లరంగు పెయింట్ వేశారు. మ్యాట్‌లు ఏర్పాటు చేసి నీరు పడుతుంటారు. దీనివల్ల శ్రీవారిదర్శనానంతరం బయటకు వచ్చిన భక్తులు ఉపశమనం పొందుతున్నారు.

## జలప్రసాదకేంద్రాలు

'నీరే ప్రాణాధారం'. నీటికి ప్రత్యామ్నాయం నేయికాదు, పాలుకాదు, ఫలసారం కాదు– నీటివల్లనే దప్పిక తీరుతుంది. నీటివల్ల ఎండతీవ్రత తగ్గుతుంది. ఆరోగ్యసూత్రాలలో మొదటిది




దండిగా నీటిని తీసుకోవడం. ఆకలినైనా అణచుకోవచ్చు గాని దప్పికను అణచలేం. అందుకే తిరుమల కొండ మీద తి.తి.దే. 'జలప్రసాద' కేంద్రాలు విరివిగా ఏర్పాటు చేసి స్వచ్ఛజలం 24 గంటలు అందిస్తున్నది.

## రెండేళ్ల తర్వాత...

దాదాపు రెండేళ్లతర్వాత వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలికవ్యాధిగ్రస్తుల దర్శనాలను తి.తి.దే. పునరుద్ధరించింది. కరోనా తగ్గుముఖం పట్టడంతో 08–04–2022న తి.తి.దే. ఆన్‌లైన్‌లో ప్రత్యేకదర్శనటిక్కెట్ల కోటా విడుదల చేసింది. 09–04–2022 నుంచి శ్రీవారి దర్శనానికి అనుమతించింది. స్వామివారి దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా శ్రీవారి ఆలయం పక్కనున్న తిరుమలనంబి ఆలయం వద్ద ప్రత్యేక క్యూ ఏర్పాటు చేసింది.







గతంలో మాదిరిగానే దివ్యాంగులు, వృద్ధుల ఆకలి దప్పికలు తీర్చేందుకు తి.తి.దే. సంకల్పించింది. ఉప్మాతో కూడిన మహాప్రసాదాన్ని పంపిణీ చేస్తోంది. జలప్రసాదాన్ని సైతం అందిస్తోంది.

దివ్యాంగులు, వృద్ధులకోసం తి.తి.దే. నాలుగుబ్యాటరీ వాహనాలతో పాటు పదివరకు చక్రాలకుర్చీలను ఏర్పాటు చేసింది. రాంభగీచానుంచి శ్రీవారి ఆలయంవద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూ వరకు భక్తులను తరలిస్తోంది. దివ్యాంగులు, వృద్ధులకు తి.తి.దే. ప్రత్యేకంగా శ్రీవారిసేవకులను ఏర్పాటు చేసింది. రాంభగీచానుంచి ఆలయంవరకు భక్తులసేవలో తరించేలా చర్యలు చేపట్టింది. రెండేళ్లతర్వాత శ్రీవారిని దర్శించుకున్న భక్తులు పులకించిపోతున్నారు.

## ఆకట్టుకుంటున్న ఉద్యానవనాలు


వేసవి నేపథ్యంలో ఇటీవల తిరుమలకు వచ్చే భక్తుల తాకిడి పెరిగింది. వీరందరూ సేదతీరడానికి, విశ్రాంతి తీసుకోవడానికి అనుగుణంగా తి.తి.దే. ఉద్యానవనాలను పెంచింది. స్వామివారి పూజలకోసం పండించే పూలఉద్యానవనాలు యాత్రికుల్ని మైమరపిస్తాయి. అసలు తిరుమలకు పూలమండపమని పేరు. అందుకే తిరుమలలో పూలు ముడువరాదని వినతి. తిరుమలలో జరిగే ఇతరత్రా ఉత్సవాలకన్న 'పుష్పయాగం' కమనీయం! రమణీయం!!

తిరుమల పుణ్యక్షేత్రాన్ని పుష్పవనంలా తీర్చిదిద్దేందుకు తి.తి.దే. శ్రీకారం చుట్టింది. జీఎన్సీ టోల్‌గేట్ మొదలుకుని తిరుమలలోని అన్ని ఉద్యానవనాలను సౌందర్యవంతంగా మార్చడానికి తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి విశేషంగా కృషి చేస్తున్నారు. సువాసన వెదజల్లే రంగురంగుల సంప్రదాయ పుష్పాల మొక్కలతో ఇప్పటికి కొన్ని ఉద్యానవనాలు భక్తులను ఆకర్షిస్తున్నాయి. తిరుమలలో పెద్ద ఉద్యానవనాలతో పాటు డివైడర్లుప్రధాన కూడళ్లు కాటేజీలు, అతిథిగృహాల పక్కన దాదాపు నలభైమూడు ఉద్యానవనాలు ఉన్నాయి. వీటిలో దాదాపు ఇరవైఎనిమిది ఉద్యానవనాలను తి.తి.దే. ఉద్యానవన విభాగమే అభివృద్ధి చేస్తోంది. ఈ ఉద్యానవనాలలో ప్రధానంగా



బంతిపూలు, సాల్వియా, పెటునియా, జీనియా అనే జాతి పూలమొక్కలను ఏర్పాటు చేస్తున్నారు. తిరుమలలోని బాట గంగమ్మ ఆలయానికి సమీపంలో ఓ పెద్ద ఉద్యానవనాన్ని కూడా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే! ఇందులో చామంతి, వృక్షి, గన్నేరు, రోజాలు, సంపెంగ, మల్లెలు, తులసి, పన్నీరాకు, కనకాంబరాలు, మానుసంపంగిమొక్కలను పెంచుతున్నారు. ప్రత్యేకించి ఈ ఉద్యానవనంద్వారా వచ్చిన పుష్పాలను, ఆకులను స్వామిసేవకు వినియోగించడం గమనార్హం. ప్రధానంగా శ్రీవారి శంఖచక్రాలు, ఓంకారం, స్వస్తిక్‌తో పాటు వివిధ ఆకృతులతో ఏర్పాటు చేసిన పూలమొక్కలు భక్తులను ఆకట్టుకుంటుంటాయి.

'సేవ' కేవలం రెండుక్షరాల మాట. కానీ, మనిషిని మనీషిని చేస్తుంది. మహనీయమూర్తిగా తరతరాల పాటు తన జ్ఞాపకాలను భావితరాలకు వారసత్వసంపదగా అందిస్తుంది. తాము నమ్ముకున్న దైవాలకు, గురువులకు సేవచేసి, చరిత్రలో నిలిచిపోయిన వారెందరో ఉన్నారు.





రామపాదాలను సేవించిన హనుమభక్తికి పరాకాష్ఠగా నిలిచాడు. పద్నాలుగేళ్లు కంటిమీద రెప్ప వెయ్యకుండా అన్నను వెన్నంటి నిలిచిన లక్ష్మణుడు తమ్ముడంటే ఇలా ఉండాలన్నంత ఘనత పొందాడు. వేలకొద్దీ పదాలవరదతో తిరుమల సార్వభౌముడైన శ్రీవేంకటేశ్వరుణ్ణి సేవించిన అన్నమయ్య పదకవితా పితామహుడిగా చిరకీర్తి పొందాడు. ఇంకా ఎందరో మహనీయులు పరిపూర్ణమైన సేవాభావంతో పరమపదాన్ని చేరుకున్నారు. వీరందరిస్ఫూర్తితో అనుక్షణం భాగవతులసేవలో తరిస్తోంది– తిరుమల తిరుపతి దేవస్థానం. భక్తుల హృదయాలే భగవంతుడికి నిజమైన నివాసస్థానాలు. వేదాలు మొదలు ఉపనిషత్తులు, శాస్త్రాలు సైతం ఈ విషయాన్ని ముక్తకంఠంతో అంగీకరిస్తున్నాయి. ఈ ప్రమాణాలన్నిటినీ మార్గదర్శకాలుగా చేసుకుని భక్తులసేవకోసం నిరంతరం పరితపిస్తోంది– తి.తి.దే.

సేవ చెయ్యటం అంటే మొక్కుబడి వ్యవహారం కాదు. త్రికరణశుద్ధిగా పరిపూర్ణమైన సమర్పణభావాన్ని ప్రకటించడం. లౌకికమైన భావనలను దూరం చేసుకుని, నిర్మలమైన మనస్సుతో తనను తానుగా అవతలివ్యక్తికి సమర్పించుకోవడమే నిజమైన సేవ అవుతుంది. ఇటువంటి పరిపూర్ణమైన సేవాభావానికి ఆచరణాత్మకమైన అర్థాన్ని చెబుతోంది తి.తి.దేవస్థానం.

**1) మమ మద్భక్త భక్తేషు, ప్రీతిరభ్యధికా భవేత్।**
**తస్మాత్ మద్భక్త భక్తాశ్చ, పూజనీయాః విశేషతః॥**
**2) సిద్ధిర్భవతి వానేతి। సంశయోఽచ్యుత సేవినామ్।**
**న సంశయోఽస్తి తద్భక్త పరిచర్య రతాత్మనామ్॥**

పై ప్రమాణాలకు తు.చ. తప్పకుండా అనుసరిస్తూ, భాగవతులసేవే భగవంతుడిసేవగా భావించి, వారి సేవే పరమార్థంగా ఎంచుకుంది తి.తి.దే. స్వామి తమను చల్లని చూపు చూస్తాడనే నమ్మకంతో, ఎన్నికష్టాలకైనా ఓర్చుకుని కొండకు వచ్చే భక్తులను మించిన భాగవతులు మరొకరు ఉండరు. ఈ సత్యాన్ని తి.తి.దే. ఏనాడో గ్రహించింది. శ్రీవేంకటేశుని భక్తులు తిరుపతిలో కాలుమోపింది మొదలు కొండకు వచ్చి, స్వామిదర్శనం చేసుకుని, ఇతరతీర్థక్షేత్రాలు దర్శించుకుని, తిరిగి స్వస్థానాలకు ప్రయాణం అయ్యేవరకు వారికి అనుక్షణం సేవ చేసేందుకు పరిపూర్ణమైన ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేస్తోంది!

ధారావాహిక



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*(గత సంచిక తరువాయి భాగం....)*

పరావరతత్త్వజ్ఞులలో ప్రధానులైన శుకాదిమహర్షులు, ప్రహ్లాదప్రముఖులైన పరమభాగవతులు, అంబరీషాదులవంటి రాజర్షులు ఈ దివ్యమైన తిరుమలకొండే అన్నింటికీ అతీతుడైన శ్రీమన్నారాయణుని దివ్యమంగళవిగ్రహమని తలచి ప్రాకృత (తుచ్ఛ) శరీరంతో, పాదాలతో, త్రొక్కుటకు జంకి ప్రాంతాలందే ఉండి ఆ కొండవాగుల్లోనే స్నానం, తర్పణాలు చేసుకుంటూ భగవత్సాక్షాత్కారం కోసం ప్రార్థించేవారని స్కాంద, వామన, వరాహాది పురాణాలు చెబుతున్నాయి. అజ్ఞానం తొలగి భక్తిజ్ఞానాలు పొందిన ఆళ్వారులు కూడ అట్లే పాకృతశరీరంతో తిరుమల త్రొక్కకుండ కొండక్రిందే నిలచి మంగళాశాసనం చేసి ఉండడాన్ని తలచి, సర్వజ్ఞులైన తాముకూడ మునుపు ఒక యాత్రా సందర్భంలో ఆళ్వారులవలే తిరుమల ఎక్కకుండ కొండ దిగువనే కొన్నాళ్లుండి, శ్రీశైలపూర్ణుల సన్నిధిలో ఇతిహాసశ్రేష్ఠమైన శ్రీరామాయణాన్ని ప్రవచనం చేయగా విని శ్రీవేంకటాచలపతికి మంగళాశాసనం చేసి. తమ ఐతిహాసికాచార్యులైన తిరుమలనంబి, తమ ప్రియశిష్యుడైన అనంతార్యుడు శ్రీవేంకటేశ్వరుడికి ప్రీతి కలిగేటట్లు కైంకర్యాలు చేస్తూ తాము కూడా మనసులో ఆనందించేవారు.

అప్పుడు తిరుమలపై నిత్యనివాసముండే మనుష్యుల ప్రవృత్తులు, దివ్యతిరుమల క్షేత్రవైభవాన్ని, పూర్వకాలంలో క్షేత్రవాసులైయుండిన మహర్షుల అనుష్ఠానవిశేషాలను, శ్రీవేంకటేశ్వరుని హృదయమైన శాస్త్రార్థాన్ని తెలీక స్వేచ్ఛతో వర్తించుట చూచి, వీరు తెలిసీతెలీక చేసే శాస్త్రమర్యాదలలోని అంశాలను నివర్తింపజేయదలచి ఒక శాస్త్రార్థమర్యాదను అందరికీ తెలిసే విధంగా చేయాలని దివ్యచిత్తంతో సంకల్పించారు.

కొందరు మునిశ్రేష్ఠులు కైంకర్యాసక్తులై, కొందరు బ్రహ్మనిష్ఠులై, కొందరు ధ్యాననిష్ఠులు, తపోనిష్ఠులై, కొందరు ఉద్యానపాలకులై మరికొందరు దివ్యమంగళవిగ్రహసందర్శనపరులై అక్కడ ఉన్నారని స్కాందపురాణంలోని సువర్ణముఖరీ మాహాత్మ్యఘట్టాన్ని తలపోసి తిరుమలలో కైంకర్యపరులైనవారు మాత్రమే నిత్యనివాసం చేయాలని, తిరుమలకొండక్రింది భాగంలో ఉండే భగవద్గుణానుభవపరులు, ఇతర సంసారులు, ఉత్సవకాలాల్లో తిరుమలపైకి పోయి స్వామి దర్శనం చేసికొని దిగిరావలెనని, ఆ కొండ అప్రాకృతమైంది కాబట్టి అక్కడ పండే కందమూలఫలాదులను స్వేచ్ఛగా భుజింపరాదని స్కాంద పురాణంలో సువర్ణముఖరీమాహాత్మ్యంలో తిరుమల అప్రాకృత స్థలంకావడంచేత అక్కడ పుట్టినట్టివి కోవెలకు ఉపయోగపడేవిగా వైష్ణవ ఆగమసిద్ధాలైన కందమూలఫలాదులను, భోజ్యపదార్థాలను, హవిస్సును ముందుగ విష్ణుమూర్తికి నివేదన చేసి తరువాత ఆ ప్రసాదంతో జీవించేవారని ఆ ప్రకరణములోనే మరల చెప్పి ఉన్నారు. *(ఇంకా ఉంది)*

**ఈ నెల 23వ తేదీ శ్రీఆండాళ్ తిరువాడిప్పూరం**

**ప్రతి సంవత్సరం కటకమాసం శుక్లచవితి పూర్వఫల్గునీనక్షత్రంనాడు తిరువాడిపూరం ఉత్సవం జరుగుతుంది. శ్రీఆండాళ్ పుట్టినరోజు ఇది.**



# 'పురి' జగన్నాథా! మా పురాలని రక్షించు!!

– బ్రహ్మశ్రీ డా॥ మైలవరపు శ్రీనివాసరావు

జూలై 1న **పూరిజగన్నాథ రథయాత్ర** సందర్భంగా...

ఎంతో అదృష్టవంతులం కాబట్టే భారతీయ హైందవ ధర్మంలో కన్పించే ఒక్కోదైవం వెనుకా తెలుసుకోదగ్గ రహస్యాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఇలా రహస్యాలని ఏర్పాటుచేసిన ఆ ఋషుల దూరదృష్టి ఎంతో గొప్పది! ఇలా సంవత్సరానికోమారు ఆ విశేషాలను గుర్తుచేసుకుంటూ ఉండని పక్షంలో– మానవులం కదా!– మర్చిపోతూ ఉంటాం! ఆ కారణంగా ఎప్పటికప్పుడు స్మరించుకుంటూ ఉండడమనేది మన అవశ్య కర్తవ్యం. ఆ దృష్టితో జగన్నాథరథోత్సవంలోని విశేషాలని ఒకమారు గుర్తుచేసు కుంటూ కదులుదాం!

## 'పూరీ' జగన్నాథుడు కాదు! 'పురి' జగన్నాథుడీయన.

లోకమంతా ఈయన్ని 'పూరీ' జగన్నాథుడని పిలుస్తూ ఉంటుంది. సంస్కృతంలోనూ అలాగే హిందీలోనూ ఆ దేవా లయం మీద కూడ (పురి) జగన్నాథుడనే కన్పిస్తుంది. అయితే ఆంగ్లేయుడు పురి అనే ఈ పదాన్ని **PURI** అని రాయడంతో, ఈ 'పురి' పదం కాస్తా 'పూరి, పూరీ...'గా మారిపోయి మన చరిత్ర తలకిందులయ్యేలా చేసింది. ఇంత వివరంగా అర్థాన్ని తెలుసుకున్నాక కూడ 'పూరీ జగన్నాథస్వామి' అనడం సరికాదు కదా. కాబట్టి 'పురి జగన్నాథు'డంటే 'మనపురాల్లో అంటే శరీరాల్లో నిత్యం ఉంటూ మనల్ని రక్షించేవా'డని అర్థమన్నమాట!

## ఈ ఆలోచన సరైందే!

ఇలా వ్యాఖ్యానించుకోవడం కచ్చితంగా సరైంది కాబట్టే, ఇక్కడి స్వామికి విశేషంగా చేసేది రథోత్సవమే!

ప్రతివ్యక్తికీ ఉండే తన శరీరమే ఓ రథం. ఆ శరీరాన్ని తనదిగా చేసుకుని జీవించే ప్రతిజీవీ– రథి. ఈ రథానికున్న గుఱ్ఱాలు– శరీరం కళ్లు, చెవులు, నాలుక, ముక్కు అనే జ్ఞానేంద్రియాలు ఐదు. అలాగే వాక్కు, చేతులు పాదాలు విసర్జకావయాలు (5) కలిపి కన్పించే కర్మేంద్రియాలు 5 – మొత్తం పదిమాత్రమే. ఈ పది గుఱ్ఱాలతోనూ నడిచే రథమే 'దశ–రథం'. ఇలాంటి పదిరథాల గుఱ్ఱాలున్న ఆ రాజే దశ–రథుడంటే.

మరి గుఱ్ఱాలుంటే వాటిని అదుపు చేయగల కళ్లాలు 'మనసు' అనేది కదా! ఆ మనసనే కళ్లెంతో, పది విధాలైన గుఱ్ఱాలతో, శరీరమనే రథాన్ని నడిపించేవాడు పరమాత్మ. ఆ పరమాత్మే జగన్నాథుడు. లోకంలో ఏ సారథి అయినా ఒక రథాన్ని మాత్రమే నడపగలడు. అయితే 'జగత్+ నాథుడు' అయిన ఈయన సకల ప్రపంచంలో ఉన్న పద్నాలుగు భువనాల్లోనూ ఉన్న అన్ని రథాలనీ ఏకకాలంలో నడపగలడు. అందుకే మన ఈ పురాన్ని (శరీరాన్ని) ఆ రథం నడిపే సారథి అయిన జగన్నాథుని దగ్గరికి తీసుకెళ్లి ఎవరి పురాన్ని వారు



ఆయనకు చూపించుకుని "సారథీ! సరిగా ఈ నా పురాన్ని నడిపించవలసిం"దని ప్రార్థించడమే 'రథోత్సవ'మంటే.

### ఇక్కడి దైవం మనిషికి దర్పణం

అందరి పురాలనీ రక్షించే దైవం జగన్నాథు దనుకున్నాం కదా! అందుకే ఇక్కడి దైవం కూడ మనుష్యులకు ప్రతిరూపంగా ఓ అద్దంలా కన్పిస్తాడు.

ఇక్కడి మూలవిరాట్టులు చెక్కతో చేయబడి కన్పిస్తాయి. ఎక్కడి దైవాలైనా ఏ మాత్రమూ చెక్కు చెదరని శిలలతో చేయబడి కన్పిస్తాయి కదా! ఏమిటీ తేడా? అనుకోకూడదు.

ప్రతిమనిషికీ ఎలా కష్టాలూ, నష్టాలూ, మనోవ్యథలూ జీవితంలో కన్పిస్తూ ఉంటాయో, ఆ తీరుకి సాక్ష్యంగా ఇక్కడి దైవం చెక్కతో చెక్కబడి కన్పిస్తూ (చెక్కకి చెదలుపట్టడం, బుగిలిపోవడం, పుచ్చడం వంటివి ఉంటాయని చెప్తూ) ఉంటాడు.

వ్యక్తి ఎలా కొంతకాలానికి బాల్యం, కౌమారం యౌవనం, వార్ధక్యం అతివృద్ధాప్యం, మరణమనే అవస్థలకి గురవుతూ కన్పిస్తాడో, అదే తీరుగా ఇక్కడి చెక్క దైవాలకి కూడ కొన్ని కొన్ని ఏళ్లకోసారి 'నవకలేబరఉత్సవ'మనే పేరిట ఆ విగ్రహాలను తొలగించడం, భూమిలో పాతిపెట్టడం, ఆ పాతిపెట్టే వేళ జనమందరూ తీవ్రరోదనలు చేయడం... వంటివి ఉంటాయి. కలేబరమంటే మరణించిన శరీరమని కదా అర్థం.

ఒకరు పోతే అదే ఇంటిలో మరొకరు (సంతానం) వచ్చి ఆ దుఃఖాన్ని తొలగించే విధానంలాగా ఇక్కడి విగ్రహాలను తొలిగించాక మళ్లీకొత్త విగ్రహాలను అదే స్థానంలో ప్రతిష్ఠిస్తారు కూడ!

ఇక్కడి చెక్కదైవాలకి కాళ్లూచేతులూ ఉండవు. ఏ వ్యక్తీ కూడ తానను కున్న తీరులో చేయలేడనీ, తాననుకున్న పద్ధతిలో తన జీవితగమనాన్ని చేసుకోలేడనీ చెప్పడానికి సంకేతమే పై తీరు కాళ్లూచేతులూ లేకపోవడమంటే.

దేశంలోని ఏ దేవుడికీ లేని తీరులో ఈ చెక్కదేవుళ్లకి ప్రతిరోజూ 65 పిండివంటల భోజనాలు నైవేద్యంగా పెట్టబడతాయి. ప్రతివ్యక్తీ ఎలా భోజనప్రియుడుగా ఉంటాడో కొత్త కొత్త రుచులకోసం ఎదురుచూస్తూ ఉంటాడో ఆ విధానానికి సంకేతమే ఈ బహుప్రసాదవినియోగవిధానం.

ఏ వ్యక్తి అయినా మరింత ఉన్నతుడూ, సంపన్నుడూ అయినట్లయితే ఉదయకాలఫలహారాన్ని ఒక దేశంలో, మధ్యాహ్నభోజనాన్ని మరో దేశంలో, రాత్రి బసని ఇంకొక చోటా ఎలా చేస్తాడో, అలా చేస్తూండే తీరుకి ప్రతిరూపంగా ఈ దైవం కూడ తన ఉదయకాలఫలాహారాన్ని బదరీనాథ్‌లోనూ, మధ్యాహ్నభోజనాన్ని ఇక్కడి పురిక్షేత్రంలోనూ, రాత్రి బసని ద్వారకలోనూ చేస్తాడని భక్తులు చెప్తారు.

సంవత్సరంలో ఒక రోజైన జ్యేష్ఠమాసంలో వచ్చే పూర్ణిమనాడు మాత్రమే చెక్కవిగ్రహాలకు స్నానాన్ని చేయిస్తారు. అందుకే ఈ పూర్ణిమను 'స్నానపూర్ణిమ'గా పిలుస్తారు. స్నానం ముగించిన వెంటనే దేవతలకు జ్వరం వచ్చిందంటూ నలభై ఐదు రోజులపాటు ఆ విగ్రహాలను చీకటిగదిలో ఉంచేస్తారు. దేవతాదర్శనాన్ని చేయాలంటే ఆ విగ్రహాల నమూనాలు కన్పించే ఓ వస్త్రం మీది చిత్రాలని చూసి నమస్కరించుకోవాల్సిందే!

ఈపద్ధతిలో ఓ రహస్యం దాగుంది. స్నానం చేయించడమంటే 'నీళ్లాడడం' (స్త్రీ గర్భవతి కావడాన్ని ఈ మాటతో చెప్తారు) అన్నమాట. నీళ్లాడిన తర్వాత సంతానాన్ని కనడానికి తొమ్మిదినెలలపాటు పడుతుంది. కాబట్టి ఆ సమయాన్ని సూచిస్తూ (4+5=9) 45 రోజుల పాటు చీకటిగదిలో ఆ విగ్రహాలని ఉంచేస్తారు. ఈ కాలంలో నమూనావిగ్రహాలని ఓ వస్త్రం మీద చూపిస్తారు. పుట్టబోయే సంతానాన్ని గురించిన ఊహలను మనసులో, కళ్లలో దర్శించుకోవడానికిది సంకేతం.


కరుణానిధిరామ కౌసల్యానందనరామ!

దేవాలయాన్ని ఆనుకుని ప్రతిరోజూ పదివేలమందికి సరిపడా ఆహారపదార్థాలను వండేందుకు గిన్నెలూ, కూర గాయలూ, కట్టెలూ వంట చేసే ప్రదేశం సిద్ధంగా ఉంటుంది. తగినంత మంది చుట్టాలొస్తే వాళ్లను ఆదరించేందుకు ఎలా ఇంట్లోవాళ్లు ముందుకు ముందే ఎలా ఏర్పాట్లను చేసుకుని సిద్ధంగా ఉంటారో దానికి ఈ ఆనందబజారు (భోజనాలను సిద్ధం చేసిన ప్రదేశం) సాక్ష్యం.

ఇంట్లో అమ్మ వండి వార్చగానే ఎలా పిల్లలంతా ఆ తినుబండారం మీద పడిపోతారో, తినెయ్యాలనే ఉత్సాహంతో ఎదురుచూస్తూ ఉంటారో, ఆ పద్ధతికి సాక్ష్యంగా ఇక్కడి దైవాలకు మహానివేదన పెట్టీ పెట్టడం తరువాయి- అక్కడి వారంతా ఆ మహానివేదనపాత్రలో చేయిపెట్టి ఎవరికి వారు ప్రసాదాన్ని తీసుకుపోతూ ఉంటారు.

తన పిల్లలకు సరిపడామాత్రమే వండకుండా ఏ తల్లైనా మరికొంత పిల్లలకోసం ఎలా నిలువ ఉంచుతుందో అలా ఆనంద బజార్‌లో ఒక కుండమీద మరోకుండ చొప్పున ఏడు కుండలని ఏర్పాటుచేసి అన్నిటికీ కింద మాత్రమే కట్టెలను వెలిగించి వంట చేస్తారిక్కడ. కింది గిన్నెలో అన్నం మాడడం గాని, అన్నిటికీ పైనున్న గిన్నెల్లో సరిగా ఉడక్కపోవడంగాని కన్పించనే కన్పించదిక్కడ. తన పిల్లల కోసం తల్లి ఎలా శ్రద్ధతో వంట చేస్తుందో అదే తీరుగా ఇక్కడ వంటలు సాగుతూ ఉంటాయి- రాత్రింబవళ్ల భేదం లేకుండా.

ఇక్కడ భోజనం నిమిత్తం వచ్చిన భక్తులెవరి దగ్గరా ఏమీ తీసుకోరు. ఏ తల్లైనా తనపిల్లలకి భోజనం పెడితే దానికి సొమ్ము నాశిస్తుందా? ఇక్కడికి వచ్చే భక్తులందర్నీ జగ న్నాథుడు తన సంతానంగా భావిస్తాడు కాబట్టే ఇరవైనాలుగు గంటలపాటూ భోజనం, ఎవరెవరికి ఏయే పదార్థాలిష్టమో అలాంటి అరవైఐదుతీరులపదార్థాల ఏర్పాట్లు కూడా ఉంటాయి.

సృష్టికర్త అయిన బ్రహ్మను సృష్టించిన జగన్నాథునికే ప్రాణాన్ని పోస్తూ ఓ వైదికకర్మ జ్యేష్ఠమాసకృష్ణచతుర్దశి నాడు జరుగుతుంది. ఆనాటి అర్ధరాత్రివేళ బ్రహ్మపదార్థాన్ని ఈ ముగ్గురు దేవతల నాభి ప్రదేశంలోనూ ప్రవేశపెడతారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేవారిని 'దైతాపతు'లని పిలుస్తారు. వీళ్లు సరిగా అర్ధరాత్రికాలంలో ప్రధానమందిరంలో- ఏడు పొరలున్న పట్టువస్త్రాలను కళ్లకు కట్టుకుని, దీపాలన్నింటినీ ఆర్పేసి కళ్లకు గంతలతో, చిమ్మచీకటిలో, ఏ దేవతామూర్తుల్ని తీసేసి భూమిలో పాతిపెట్టబోతున్నారో ఆ విగ్రహాల నాభిప్రదేశం నుండి బ్రహ్మ పదార్థాన్ని (ఏదో సంకేతరూపంగా ఉండే ఓ ద్రవ్యం అనుకోవచ్చు) తొలగించి, కొత్తగా ప్రతిష్ఠించబోయే విగ్రహాల నాభిప్రదేశంలో ఆ బ్రహ్మపదార్థాన్ని నిక్షేపిస్తారు. నిక్షేపించాక ఆ బొడ్డు భాగాన్ని కప్పేస్తారు- ఓ ద్రవ్యంతో. తల్లి గర్భంనుండి జీవుడు ఎలా బొడ్డుతాడుద్వారా ఆహారాన్ని స్వీకరిస్తాడో, పుట్టిన తర్వాత ఆ తాడుని ఎలా తెంపుతారో ఆ నాభిభాగాన్ని మామూలుగా (అయిపోతుంది సహజంగా) చేస్తారో ఆ విధానానికి సంకేతం ఈ వైదికకర్మ అన్నమాట. తల్లి గర్భమనేది ఆ లోనున్న ప్రాణికి చీకటిగదివంటిదే కదా!

అలా తొలగించిన విగ్రహాలను భూ స్థాపనం చేసే చోటును "కైవల్యధామం" లేదా "కైవల్యవైకుంఠ" మంటారు. ఈ బ్రహ్మ పదార్థాన్ని పాతవిగ్రహాలనుండి తొలగిస్తూ కొత్త విగ్రహాలకు అమర్చేకాలంలో పురిపట్టణం మొత్తం విద్యుత్తు లేకుండా అంధకారంలో ఉండేలా చేస్తారు. భగవంతుడు చీకటికి ఆవల ఉంటాడని కదా పురుషసూక్తమంత్రం చెప్తుంది!

తొలగించిన విగ్రహాలకు చనిపోయిన వ్యక్తికి చేసిన తీరులోనే ఏడుపులు సంస్కారాలు, భూస్థాపనం, శుద్ధక్రియ, కర్మకాండ, ఉదకశాంతి... ఇలా అన్నీ కూడ పదిరోజులపాటు చేసి, పదకొండవరోజున శ్రాద్ధభోజనాలుకూడ పెడతారు.


ఇక రథోత్సవం రోజున ఆ మూడు రథాల్లో కృష్ణుడూ, సుభద్రా, బలభద్రుడూ అనే ముగ్గురుదైవాలూ ఊరేగడా నికి సన్నద్ధమై ఉన్నవేళ, ఆ దేశపురాజు బంగారుచీపురుతో ఆ రథంలోని అంతర్భాగాన్ని తుడుస్తాడు. పరిపాలకుడైన రాజు కూడ జగత్తును పరిపాలించే దైవంముందు తక్కువవాడేనని ఆ పరిపాలకుడే అంగీకరిస్తూ మౌనంగా ఆ కర్తవ్యాన్ని అందరి ముందు నిర్వహిస్తూండడం- అందునా ప్రతిసంవత్సరమూ తాను మాత్రమే చేయాల్సిన తీరులో ఆ దేవాలయఆగమవిధానం ఉండడం కూడ చెప్పుకోదగ్గ అంశమే!!

కదిలిన రథాలు రెండుమైళ్లదూరంపాటు ప్రయాణిం చాక ఆ రాత్రంతా విగ్రహాలు అక్కడే ఆలయం బయటే ఉండి పోతాయి. జగన్నాథుడు తనకు మాట మాత్రంగానైనా చెప్ప

కుండా తన సోదరునితో, సోదరితో ఉత్సవంగా వెళ్లాడనే ఉడుకు మోతుతనంతో లక్ష్మీదేవి ఆ జగన్నాథునిరథాన్ని ధ్వంసం చేస్తుంది. ఈ దృశ్యాన్ని 'హీరా' అంటారు.

ఇక తన పిన్నిగారింట్లో వారంరోజులపాటు ఉన్న స్వామి తిరుగుప్రయాణాన్ని (బాహుదాయాత్ర) ప్రారంభిస్తాడు. తన ఆలయానికి రాగానే లక్ష్మీదేవి, తనకు బావగారైన బలభద్రుణ్ణీ తనకు ఆడపడుచైన సుభద్రనీ మాత్రమేలోనికి రానిస్తూ 'ఉత్సవానికి వెళ్తున్నట్లు తనకెందుకు చెప్పలే'దని స్వామిని నిగ్గదిస్తుంది. ఇది ఒక తీరుగా కొందరు భక్తులకు హెచ్చరిక కూడ!

ఈ ఆలయానికున్న ఇరవైఒక్క మెట్లవరుస మీదుగా ఆలయానికి వెళ్తూంటే మెట్టుకొక్క పితృదేవతను ప్రార్థించుకోవలసిందని చెప్తారు– పెద్దలు. మన శ్రేయస్సును ఆకాంక్షించి, మనల్ని పెంచి పెద్దచేసి, పైలోకానికి వెళ్లిన వాళ్లని పితృదేవతలు అంటారు. ఒక వేళవారిసంఖ్య 21గాని కాకుండా తక్కువే ఉన్నట్లయితే, తలుచుకున్నవారినే తిరిగి తలుచుకోవడం తప్పు కాదు. కేవలం తలిదండ్రులే కాదు మన శ్రేయస్సును ఆకాంక్షించిన ఆప్తులు, బంధువులు, మిత్రులు... వీరుకూడ పితృదేవతలే అవుతారు.



ఈ ఆలయానికున్న మెట్ల వరుసమీదుగా ఆలయానికి వెళ్తూంటే మెట్టుకొక్కరు చొప్పున ఉండే పితృదేవతలంతా ఆలయానికి వచ్చేవాళ్లను గమనిస్తూ 'వీళ్లలో మా వాడేమైనా ఉన్నాడా? వస్తున్నాడా? నన్ను స్మరిస్తున్నాడా? నా కోసం ఏవైనా తిలల్నీ, నీటినీ తెచ్చాడా?" అని నిరంతరం కళ్లు పెద్దవి చేసుకుని పరిశీలిస్తూ ఉంటారట.

లలితాసహస్రనామాల్లో ఒకటి 'మృత్యుదారు కుఠారికా!' అనేది. మృత్యులక్షణం కల మనుష్యులు అనే చెక్క బొమ్మలకు అపరాధకాలంలో శిక్షించే గొడ్డలి వంటిది అమ్మ అనేది" ఒకర్థం కాగా, 'మృత్యువనే చెక్కలకు గొడ్డలి వంటిది అమ్మ' అనేది మరో అర్థం. మృత్యువుకూ, ఆ లక్షణం కల మనుష్యులకూ చెక్కతో పోలిక అనేది అనేక స్థలాల్లో ప్రసిద్ధంగా కన్పిస్తుంది. అందుకే ఇక్కడి రథాలే కాదు ఇక్కడి దేవాలయాల రథాలకూ కూడ వాడే ముడి వస్తువు చెక్క మాత్రమే. రథం నిండుగా చెక్క అనేది (కొయ్య) ఎలా ఉంటుందో అదే తీరుగా వ్యక్తుల అవయవాల నిండుగా మృత్యువనేది ఉంటుందనేది దీని సంకేతార్థం. ఏ అవయవం ద్వారానైనా మృత్యువు ఈ మొత్తం శరీరానికి సంప్రాప్తించవచ్చు నన్నమాట.

అందుకే "ఓ జగన్నాథా! ఈ మృత్యుశకటాన్ని (పురాన్ని) నీ వద్దకు తెస్తున్నాం కాబట్టి నన్ను సరైనతోవలో నడిపించి నాకు దీర్ఘాయుష్యాన్నీ, మనశ్శాంతినీ కల్గించు!" అని కోరుకోవడం, ప్రార్థించడమే ఈ మనుష్యవిధానంతో ఉన్న దైవం వద్దకి వెళ్లడంలో భావం!

# శివుడూ, నందీశ్వరుడూ.. ఇద్దరూ గర్భాలయంలోనే..!

– డా॥ చింతకుంట శివారెడ్డి, 9440859872

పదకవితా పితామహుడు అన్నమయ్య జన్మించిన పుణ్యభూమి తాళ్లపాక. ఈ గ్రామంలో శ్రీరామచంద్ర మూర్తిస్వయంగా ప్రతిష్ఠించిన శివుడే **'శ్రీసిద్ధేశ్వరస్వామి'**.

## స్థలపురాణం

పూర్వం శ్రీరామచంద్రమూర్తి అరణ్యవాసం చేస్తూ, ఈ ప్రాంతానికి చేరుకున్నాడు. ప్రకృతిసౌందర్యంతో అలరారుతున్న ఈ ప్రదేశాన్ని సీతమ్మ చూచి, ఇక్కడే కొన్నాళ్లు ఉందామని రాములవారిని కోరింది. అందుకు అంగీకరించిన స్వామి అక్కడే ఉండి శివుణ్ణి ప్రతిష్ఠించి, పూజలు చేశారట! అలా త్రేతాయుగంలో శ్రీరాముల వారు ప్రతిష్ఠించిన శివుణ్ణి ఈయుగంలో కొందరు సిద్ధులు ఆ అడవుల్లో గుర్తించి, స్థానికుల సహాయంతో ఆలయాన్ని నిర్మించి పూజలుచేస్తూ ఉన్నారు. సిద్ధులు పూజించిన శివుడు కనుక ఈ స్వామి 'సిద్ధేశ్వర స్వామి'గా పిలవబడుతున్నాడు. తర్వాతి కాలంలో ఈ స్వామివారి ఆలయంలో తాళ్లపాక అన్నమయ్య పూర్వీకులుపూజారులుగా ఉన్నట్లు స్థానికచరిత్ర చెబుతోంది.


దక్షిణాభిముఖంగా ఉన్న ద్వారం నుండి ఆలయంలోకి ప్రవేశించవచ్చు. స్వామివారు తూర్పుముఖంగా ఉన్నప్పటికీ, అమ్మవారి గుడికి ఎదురుగా ప్రధానద్వారం ఉండడంతో దక్షిణం వైపున్న ద్వారంనుండి వెళ్తాం. గర్భాలయంలోని స్వామివారికి ఎదురుగా నందీశ్వరుడు కొలువైయున్నాడు. సాధారణంగా శివాలయాల్లో నందీశ్వరుణ్ణి ముఖమండపంలోగానీ లేక కొంచెం ముందుండే ఆవరణంలోగానీ చూస్తాం. కానీ ఇక్కడ నందిగర్భాలయంలోనే ఉండడం విశేషం. అంతరాలయమండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులు కొలువై ఉన్నారు. ముఖమండపంలో ఉత్తరంవైపు దక్షిణాభి ముఖంగా ఉండే మరొక ఆలయంలో స్వామివారి అర్ధాంగి శ్రీకామాక్షిఅమ్మవారు కొలువై ఉన్నారు. ముఖమండపంలో మహాగణపతి, సిద్ధిగణపతి, శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి, దక్షిణామూర్తి, చండికేశులను దర్శించుకోవచ్చు.

**ఈ నెల 09వ తేదీ నుండి 17వ తేదీ వరకు**
**తాళ్లపాక శ్రీకామాక్షీసమేత శ్రీసిద్ధేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు**

కడప నుండి సుమారు 53 కి.మీ. దూరంలో రాజంపేట ఉంది. కడప నుండి రాజంపేట చేరుకోక మునుపే బోయిన పల్లె అనే గ్రామం వస్తుంది. అక్కడ అన్నమాచార్యులవారి 108 అడుగుల ఎత్తు ఉన్న విగ్రహం కనబడుతుంది. అక్కడ నుండి 3 కి.మీ. దూరంలో తాళ్లపాక ఉంది. బోయినపల్లె నుండి ఆటోల సౌకర్యం కలదు.







సాధారణంగా శివాలయాల్లో నందీశ్వరుణ్ణి ముఖమండపంలోగానీ లేక కొంచెం ముందుండే ఆవరణంలోగానీ చూస్తాం.

కానీ ఇక్కడ స్వామివారికి ఎదురుగా నందీశ్వరుడు గర్భాలయంలోనే ఉండడం విశేషం.

ఆలయప్రాంగణంలో వాయవ్యదిశలో శ్రీవీరభద్రస్వామి కొలువై ఉన్నాడు.

స్వామివారికి ఎదురుగా ముఖమండపంలో గోడను ఆనుకొని ఏకా తాతయ్య (అత్తిరాల 112వ పేజీలో ఏకా తాతయ్య, ఇక్కడ రెండుచోట్లా ఈయన విగ్రహం ఉంది, అందుకే రెండు చోట్ల ఈయన గురించి ప్రస్తావించాను) విగ్రహం కనబడుతుంది. పూర్వం ఈయన తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ ఉండేవాడు. తలనొప్పిని భరించలేక ఒకనాడు స్వామివారిదగ్గరకు వెళ్లి, తన తలను బద్దలు కొట్టుకొని మరణించేందుకు సిద్ధపడ్డాడు. సిద్దేశ్వరస్వామివారి విగ్రహానికి తలను కొట్టుకోసాగాడు. అప్పుడు స్వామివారు ప్రత్యక్షమై ఏకాతాతయ్య తలనొప్పిని తగ్గించి, మోక్షాన్ని ప్రసాదించినట్లు స్థలపురాణం చెబుతోంది. స్వామీ! నా తలనొప్పిని తగ్గించారు. అందుకు కృతజ్ఞతగా ఈ జీవితాన్ని మీసేవకై అర్పించుకుంటాను, అలాగే తలనొప్పితో బాధపడుతూ నీ ఆలయానికి వచ్చిన భక్తులు వారితలను నా తలకు ఆనిస్తే వారితలనొప్పి తగ్గేట్లుగా వరమివ్వమని వేడుకుంటారు. అందుకు స్వామి అంగీకరించడంతో స్వామివారి చెంతనే విగ్రహంలా మారాడు. ఈనాటికీ తలనొప్పితో బాధపడుతూ ఆలయానికి వచ్చిన భక్తులు ఈ ఏకాతాతయ్యతలను ఢీకొట్టి నట్లైతే తలనొప్పి తగ్గుతుందనే విశ్వాసం ప్రజల్లో ఉంది.

సిద్ధులు రసవిద్యలు నేర్చినవారు. తాతయ్య ఒక సిద్ధుడు. ఈ ప్రాంతంలో ప్రజలకు వైద్యం చేస్తూ చదువు చెప్పేవారు. ఆయన శరీరం విడిచిన తర్వాత విగ్రహం నిలిపారు. రససిద్ధుడైన తాతయ్య తలను తమతలతో తాకితే తలనొప్పులు పోతాయి అనే విశ్వాసం!

నిత్యంపూజలు జరిగే ఈ ఆలయంలో ప్రతిఏటా ఆషాఢశుద్ధ ఏకాదశిమొదలు బహుళచవితివరకు తొమ్మిది రోజులపాటు కల్యాణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. వాహనసేవలతో పాటు, శిఖరదీపారాధనం వంటి కార్యక్రమాలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఆ తొమ్మిదిరోజుల పాటు జరిగే కల్యాణోత్సవాల సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానంవారి ఆధ్వర్యంలో నిర్వహించే సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో భక్తులకు కనువిందుచేస్తాయి.

## ఈ నెల 17వ తేదీన శ్రీవారి ఆణివర ఆస్థానం

(ముఖచిత్రకథనం)

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి కటకసంక్రమణదినాన ఆణివరఆస్థానం అతివైభవంగా జరుగుతుంది. పూర్వం మహంతులు తి.తి.దేవస్థానం పరిపాలనను స్వీకరించినరోజు అయిన ఈ ఆణివరఆస్థానం రోజునుండి తిరుమలతిరుపతిదేవస్థానం వారి ఆదాయవ్యయాలు, నిల్వలు మొదలైన సంవత్సర లెక్కలు ఈ ఆణివారోత్సవం నాటి నుండే ప్రారంభమయ్యేవి. ఆణివరఆస్థానం రోజు సాయంత్రం తిరుమల పురవీథులగుండా 'పుష్పపల్లకి'లో అత్యంత వైభవంగా శ్రీభూసమేత మలయప్పస్వామి వారు ఊరేగుతారు. ఈ పుష్పపల్లకి శోభ కనులారా చూచి ఆనందించాల్సిందే గానీ మరొకరు వర్ణించ వీలుకాదు! ఈ ఆణివర ఆస్థానం తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో కూడా జరుగుతుంది. అయితే తిరుమలలో ఉదయం జరిగితే, అదేరోజు సాయంత్రం శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో జరుగుతుంది. తిరుపతి శ్రీకోదండరామాలయంలో ఉదయం ఆణివరఆస్థానం జరుగుతుంది.



కాలంలో వచ్చే మార్పుల్ని అత్యంత స్పష్టంగా ప్రకటించే సందర్భాల్లో ఒకటి 'దక్షిణాయనం'. సూర్యుడు ఒక రాశి నుంచి మరొకరాశిలోకి మారే సమయాన్ని సంక్రమణం అంటారు. ఈ క్రమంలో పన్నెండునెలల్లో పన్నెండుసంక్రమణాలు ఏర్పడ తాయి. వీటిలో సూర్యుడు కర్కాటకరాశిలోకి ప్రవేశించింది మొదలు మకరరాశిలోకి ప్రవేశించేవరకు గల సమయాన్ని దక్షిణాయనం అంటారు.

ఖగోళశాస్త్రపరంగా చూస్తే సూర్యగమనంలో వచ్చే ప్రధానమార్పులకు సంకేతాలు ఉత్తరాయణం, దక్షిణాయనం. 'అయనం' అంటే ప్రయాణం. దక్షిణాయనం అంటే దక్షిణదిశగా ప్రయాణం చేయడమనే అర్థం. సూర్యుడు ఈశాన్యానికి దగ్గరగా ఉదయించే కాలం 'ఉత్తరాయణం'. ఆగ్నేయానికి దగ్గరగా ఉదయించే కాలం 'దక్షిణాయనం'. దక్షిణాయనంలో సూర్యుడు భూమధ్యరేఖకు దక్షిణదిశలో పయనిస్తాడు.

సూర్యుడు మకరరాశి కన్నా కర్కాటకరాశిలోకి ముందుగా ప్రవేశించటంవల్ల ఉత్తరాయణంకన్నా దక్షిణాయనమే ముందుగా వస్తుంది. కానీ, శాస్త్రకారులు ఉత్తరాయణానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. దైవ, మానవశుభకార్యాలకు ఉత్తరాయణం ప్రశస్తమైంది కావటమే ఇందుకు కారణం.

మన కాలమానం ప్రకారం మేషరాశి ఉదయపు వేళ అవుతుంది. మధ్యాహ్నవేళ కర్కాటకరాశి. సాయంత్రపు సమయం తులారాశి. అర్ధరాత్రి మకరరాశి. ఇదంతా సూర్యుడు మేషరాశిలో ఉన్నప్పుడు జరుగుతుంది. సూర్యుడు కర్కాటక రాశిలోకి వచ్చినప్పుడు (దక్షిణాయన ప్రారంభం) సూర్యోదయం కూడా కర్కాటకరాశిలోనే జరుగుతుంది. పితృకార్యాలన్నీ మధ్యాహ్నవేళ చెయ్యటం ఆచారం కాబట్టి మధ్యాహ్నకాలానికి ప్రతీక అయిన కర్కాటకరాశిలో సూర్యోదయమైన దక్షిణాయన కాలంలో పితృదేవతలకు సంబంధించిన కార్యాలు చెయ్యటం ప్రాధాన్యత సంతరించుకుంది.

***ఈ నెల 17వ తేదీ నుండి దక్షిణాయనం ప్రారంభం...***



# జీవితాన్ని క్రమబద్ధం చేయడానికే!

– శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి

దక్షిణాయనాన్ని దేవతలకు రాత్రికాలంగా చెప్పటంతో శుభకార్యాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వరు. గతించిన పితృ దేవతలను సంస్మరించుకుంటూ వారికి సంబంధించిన కార్యాలు చెయ్యటానికి దక్షిణాయనకాలాన్ని శ్రేష్ఠమైందిగా చెబుతారు. యోగసాధనకు ఈ కాలం అత్యంత అనుకూలమైంది.


దక్షిణాయనాన్నే 'కర్కాటకసంక్రమణం' అంటారు. సంక్రమణం ప్రారంభమైన మొదటి 6 గంటల 49 నిమిషాలు పుణ్యకాలంగా, మొదటి 2 గంటల 16 నిమిషాల కాలాన్ని అత్యంత పుణ్యకాలంగా శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ సంక్రమణ పుణ్యకాలంలో చేసే పితృకార్యాలు విశేషమైన ఫలితాలనిస్తాయి.

దక్షిణాయనకాలంలో శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. ఆషాఢశుద్ధఏకాదశి (శయనఏకాదశి) రోజున యోగనిద్రకు ఉపక్రమించి, కార్తికశుద్ధఏకాదశి (ఉత్థానఏకాదశి) రోజున మేల్కొంటాడు. ఈ నాలుగునెలలకాలం యోగవిద్యా సాధనకు అత్యంత అనుకూలమైన సమయం. సన్యాసులు, యోగులు ఈ నాలుగు నెలల సమయంలో దీక్ష చేపట్టి మంత్రో పాసన చేస్తారు. దీన్నే చాతుర్మాస్యవ్రతం అంటారు. ఈ వ్రతం చేసే యతీశ్వరులను దర్శించుకోవటం, వారికి భిక్షావందనం చెయ్యటం విశేషమైన ఫలితాలను ఇస్తాయి.

దక్షిణాయనంలో అత్యంత ప్రముఖమైన సమయం 'మహాలయ పక్షం'. భాద్రపద కృష్ణ పాడ్యమినుంచి అమావాస్య వరకు ఉన్న 15 రోజుల సమయాన్ని మహాలయపక్షం అంటారు. మన అస్తిత్వానికి కారకులు మన తల్లితండ్రులు, వారి పూర్వులు. వారిని స్మరించుకోవడం, వారిపట్ల గౌరవాన్ని చూపించడం మన కర్తవ్యం. ప్రతి మానవుడూ దైవ, ఋషి, పితృఋణాలనే మూడు ఋణాలను తప్పనిసరిగా తీర్చుకోవాలి. వీటిలో పితృఋణాన్ని తీర్చడానికి ఉద్దేశించిన కాలం పితృ పక్షం. దీనినే 'మహాలయ పక్షం' అని కూడా ఉంటారు. ఈ సమయంలో పితృదేవతలకు సంబంధించిన కార్యాలు విరివిగా చెయ్యాలని, గతించిన తల్లిదండ్రులను స్మరించు కుంటూ శ్రాద్ధాదికార్యాలు తప్పనిసరిగా చెయ్యాలని శాస్త్ర గ్రంథాలు స్పష్టంగా చెబుతున్నాయి. శ్రాద్ధకర్మలు నిర్వ హించటంద్వారా తల్లిదండ్రులు చేసిన త్యాగాలు గుర్తు చేసుకుని, వారు చూపించిన మార్గానికి పునరంకితం కావటం సాధ్యపడుతుంది.

ఖగోళశాస్త్రపరంగా చూస్తే దక్షిణాయనం ప్రారంభం నుంచి పగటి సమయం తగ్గి, రాత్రి సమయం పెరుగుతుంది. అంటే, భూమ్మీద సూర్యరశ్మి ప్రసరించే సమయం తగ్గుతుంది. దీనివల్ల మనుషుల్లో రోగనిరోధకశక్తి తగ్గి, వ్యాధులకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంది. ఎండలు తగ్గి, వానలు కురవటం ప్రారంభంకావటంతో వాతావరణంలో తేమశాతం పెరుగు తుంది. నీరు బురదగా మారుతుంది. దీనివల్ల సూక్ష్మక్రిముల ప్రభావం ఎక్కువై, జ్వరాదివ్యాధులు ప్రబలే అవకాశం చాలా ఎక్కువగా ఉంటుంది. వీటన్నిటి నుంచి రక్షించుకునేలా మనిషి సన్నద్ధుడు కావాల్సి ఉంటుంది.

ఇందుకోసమే దక్షిణాయనంలో పితృకార్యాలపేరుతో అనేక నిబంధనలు విధించాయి శాస్త్రాలు. యోగసాధన చెయ్యటం, చాతుర్మాస్యం పేరుతో వానాకాలంలో ప్రయాణాలు చెయ్యకపోవటం, ఫలితంగా ప్రమాదాలకు దూరంగా ఉండటం, పితృకార్యాలపేరుతో సాత్త్వికాహారం తీసుకోవటం, శరన్నవ రాత్రుల పేరుతో ప్రకృతిసంబంధమైన చైతన్యాన్ని పెంచు కోవటం, కార్తికమాసంలో చన్నీటిస్నానాల పేరుతో శరీర ఉష్ణోగ్రతను సమతుల్యస్థితిలో ఉంచటం, ధనుర్మాసం పేరుతో పుష్టికరమైన ఆహారం తీసుకోవటం... ఇవన్నీ మనిషి జీవితాన్ని క్రమబద్ధం చెయ్యటానికి ఉద్దేశించినవే!



# సాక్షాత్కార వైభవోత్సవం

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

శ్రీనివాసుడు తిరుమలకొండ మీదే కాక, కొండ కింద కూడా సాక్షాత్కరించాడంట! వందేండ్ల కిందటి నుంచి వినపడుతున్న మాట ఇది!

నాకు తెలిసిన ఆసక్తికరమైన, యథార్థమైన ఈ వింత గాథను మీ ముందు ఉంచుతున్నా. మీరూ చదివి ఆనందించండి.

తిరుపతికి సరిగ్గా పశ్చిమాన పట్టుమని పదిమైళ్ల దూరంలో ఉన్న ఒక పల్లెటూరు. ఆ ఊరు బయట, మొండి గోపురంతో, గోడలతో ఉసూరుమంటున్న శిథిలమైన ఆలయం.

ఆ గుడిచుట్టూ ఉన్న గోడలరాళ్లు కాళ్లు వచ్చి కదలి పోయినా, గోపురశిఖరం, బలిపీఠం ధ్వజస్తంభం వానలకు నానుతూ, ఎండలకు ఎండుతూ శిథిలమై నిస్త్రాణంగా ఉంటూ మనసును మెలి పెట్టి పిండుతాయి. అయినా ఆ ప్రాంగణం నడుమభాగంలో శిలావేదికపై నిర్మింపబడ్డ ప్రధానమైన గుడి, గోడల శిలలు బీటలు వారినా, కొంచం ఎగుడుదిగుళ్లైనా వింత వెలుగు లీనుతూ అందంగానే కనపడుతుంది.

వాకిళ్లే లేని ఆ గుడిమండపంలోనికి వెళ్లాలనీ, లోన గర్భగుళ్లో ఏముందో చూడాలన్న తపన ఆసక్తి ఉన్నా, ఎవరికీ గుండెధైర్యం చాలేది కాదు.

చిత్రాతి చిత్రం! 1900 ప్రాంతాన ఒక వెర్రిబాగుల లాంటి అమాయక స్త్రీ, ఆకాశం నుంచి ఊడిపడ్డట్టుగా ఆ గుడి ఆవరణలో ప్రత్యక్షమైంది. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో తెలియదు. ఏ ఊరో తెలియదు. ఏం పేరో ఎవరికీ తెలియదు.

చెరగని చిరునవ్వుతో ఏభైఏండ్లు దాటిన యోగిని లాంటి స్త్రీ ఆమె. పేరే చెప్పని ఆ తల్లికి "తాయారమ్మ" అని ఆ ఊరివాండ్లే పేరు పెట్టుకొని పిలిచేవారు.

ఆ రోజునుండి ఆ గుడి ప్రాంగణంలోని ఆకులు, అలములు చెత్త చెదారం తీసి వేసి శుభ్రం చేసేది. ఊళ్లోకి వెళ్లి ఇల్లిల్లు తిరిగి బిచ్చం అడిగేది.

గుళ్లో "శ్రీనివాసుడు" ఉన్నాడు. నన్ను పూజ చెయ్యమన్నాడు. ఏదైనా ఇవ్వండి" అంటూ నవ్వుతూ అడిగేది- తాయారమ్మ.

కాసులిస్తే వద్దనేది. కొంచెం చమురో, కాసిన్ని బియ్యమో, పప్పో, ఉప్పో పెట్టమని అడిగేది. ఇచ్చిన వాటిని ఆనందంగా తీసుకొని ఆ గుడి ముంగిట్లో మూడురాళ్ల పొయ్యిమీద కుండల్లో ఉడకేసేది.

ఆమె ఒక్కతే ఒంటరిగా గుళ్లో అడ్డదిడ్డంగా పెరిగిన చెట్లను తీసివేసి, చెత్తను ఊడ్చుకుంటూ కారుచీకటిగా ఉన్న గర్భాలయంలోనికి వెళ్లేది. తాటిమట్టల్ని ముట్టించి ఆ వెలుతుర్లో లోపలికి పరికించి చూచింది.

లోపల గర్భగుళ్లో నిలువెత్తు శ్రీవేంకటేశ్వరుని విగ్రహం! చూచింది. పరమానందంతో పరవశించి రెండుచేతులెత్తి దండంపెట్టి సంబరపడింది. "శ్రీనివాసా! గోవిందా!" అంటూ ఆ నిలువెత్తు స్వామిని చేతికి అందినంతవరకు నీళ్లతో అభిషేకించేది. చమురు దీపం వెలిగించి, తాను ఉడకేసింది నివేదించేది. దానిలో కొంత అక్కడున్న పసులకాపర్లకు పెడుతూ, మిగిలింది ప్రసాదంగా తాను ఆరగించేది.

ఇదీ ఆనాటి నుంచి తాయారమ్మ నిత్యకృత్యం. సుమారు నలభైఏండ్లపాటు ఆయమ్మకు ఆ గుడితో, ఆ ఊరితో విడదీయ లేని అనుబంధం ఏర్పడింది.

**జూలై 03 నుండి 05 వరకు**
**శ్రీనివాసమంగాపురం,**
**శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి**
**సాక్షాత్కారవైభవోత్సవం**



ఉన్నట్టుండి ఒకరోజు తాయారమ్మ ఇంటింటికి వెళ్లింది!! “రేపట్నుంచి నేను రాను, ఒక స్వామి ఎక్కణ్ణుంచో వస్తాడంట! ఆయన శ్రీనివాసుణ్ణి మంత్రాలతో పూజిస్తాడంట! ఇప్పటి నుంచి ఈ గుడి వైభవంగా వెలిగిపోతుందంట! ఇవన్నీ వేంకటేశ్వరుడే నాకు చెప్పి, నన్ను తుంబురుతీర్థం వెళ్లి తపస్సు చేసుకొమ్మన్నాడు. అందుకే రేపట్నుంచి నేను రాను” – అంటూ కనపడినవాళ్లకందరికీ చెప్పింది.

“ఇది రోజూ ఉండే సణుగుడేలే!” అని అందరూ పెద్దగా పట్టించుకోలేదు. కానీ, నిజంగా ఆ మరునాడు తాయారమ్మ కనపడ లేదు. ఆమెకోసం ఆ ఊరూ, గుడీ, గోపురం మూగగా రోదించాయి.

విచిత్రంగా ఆ మరునాటి సాయంత్రమే కంచి క్షేత్రం నుండి ఒక అర్చకస్వామి వచ్చాడు. ఆ గుళ్లోని “శ్రీనివాసస్వామి” తనను అర్చించడానికి రమ్మన్నాడని ఆ ఊళ్లో అందరికీ చెప్పాడు.

ఆ ఊరివాండ్లు ఆశ్చర్యపోతూ, వివరంగా చెప్పండని అడిగారు.

“కంచిలో ఉంటాను. నా పేరు సుందరరాజస్వామి. మా తండ్రి రాఘవేంద్రాచార్యులు. ప్రతిరోజు రాత్రనక, పగలనక స్వప్నంలో శ్రీనివాసుడు కనపడి, “రా నన్నుద్ధరించు, చీకట్లో ఉన్నాను. పుట్టల్లో, చెట్లల్లో ఉన్నాను. వెంటనే వచ్చి పూజించు” అన్నాడు. “స్వామీ! ఏ ఊళ్లో ఉన్నావు చెప్పు”. అంటే పలకడు. అందువల్లే నేను తిరుపతియాత్రకు బయలు దేరి కనపడిన ఊరూ, పేటా, కోటా వెదుక్కుంటూ, ఎక్కడైనా శిథిలమైన శ్రీవేంకటేశ్వరునిఆలయం కనపడుతుందేమోనని చూస్తూ వస్తున్నాను.

ఈనాటినిద్రలో “ఇదేనయ్యా! నేనుండే ఊరు. ఇదే ఈ గుళ్లోనే వందలఏండ్లనుంచి ఉన్నాను. నన్ను ఉద్ధరించి, శాస్త్రోక్తంగా పూజించు” అని గోవిందుడు ఆదేశించాడు” అని ఈ విషయాన్ని అర్చకులు సుందరరాజస్వామి, ఆ గ్రామంలోని వాళ్లకు చెప్పాడు.

ఆ పల్లెజనం తాయారమ్మ చెప్పినమాట గుర్తు చేసు కొని పరమానందపడ్డారు. సరే నంటూ ఊరు ఊరంతా కదలి వచ్చారు. గుడి ఆవరణలోని చెట్లను, పుట్టలను తీసేశారు. ఆలయాన్ని వందలకొద్దీ బిందెల నీళ్లతో మండపాన్ని, గర్భా లయాన్ని కడిగి శుభ్రం చేశారు గుడిప్రాంగణంలో ఆవుపేడతో కల్లాపుచల్లి చక్కగా ముగ్గులు తీర్చారు. పచ్చని అరటిస్తంభాలు, మామిడాకుతోరణాలు అలంకరించారు.



ఒక్కగుడిలోమాత్రవే కాదు. ఆ ఊళ్లోని ప్రతి ఇల్లూ మామిడాకులతో అలంకరించుకొన్నారు. ఊరు ఊరంతా వైభవంగా ఉత్సవవాతావరణం నెలకొంది.

సరిగ్గా అది 1940వ సంవత్సరం. విక్రమనామ సంవత్సరం ఆషాఢమాసం శుద్ధ సప్తమీ గురువారం ఉత్తర ఫల్గునీ నక్షత్రం కూడిన మంచిరోజు.

అర్చకులు శ్రీసుందరరాజస్వామికి కలలో సాక్షాత్కరించి,



భువనేశ! సాకేతపురవాస! రామ!


నిర్ణయించి చెప్పినట్లుగా ఆనాడు **"శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి సాక్షాత్కార వైభవోత్సవం"** పేరుతో ఘనంగా వేడుక జరుపుకున్నారు.

మళ్లీ వందల సంవత్సరాల తర్వాత శాస్త్రోక్తంగా అర్చకులైన శ్రీసుందరరాజస్వామివారి చేతులమీదుగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారికి తొలిపూజ జరిగిన రోజున, ఆలయంలో లఘువుగా సంప్రోక్షణ చేశారు. పిదప శ్రీవారిగర్భాలయంముంగిట సుప్రభాతం పఠిస్తూ వందల సంవత్సరాల పాటు యోగసమాధిలో ఉన్న శ్రీస్వామివారిని మేల్కొలిపారు. ఆ తర్వాత పురుషసూక్త శ్రీసూక్త భూనీళాసూక్తాల పఠనంతో శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారిమూలమూర్తికి అభిషేకద్రవ్యాలతో మంగళప్రదంగా అభిషేకం నిర్వహించారు. పిదప సన్ననిబంగారు జరీఅంచు ఉన్న తెల్లనిపంచె, ఉత్తరీయాన్ని అలంకరించారు. నుదుట తెల్లని పచ్చకర్పూరనామాలు తీర్చిదిద్దారు. వివిధరకాల పూలమాలలతో శ్రీస్వామివారి నిలువెత్తు మూర్తిని అందంగా, మనోహరంగా అలంకరించారు. ఆ తర్వాత సహస్రనామార్చన, ధూపదీపనైవేద్య, కర్పూరహారతులు ఘనంగా జరిగాయి.

తొలిసారిగా, 1940 జూలై 11వ తేదీ విక్రమనామ సంవత్సరం ఆషాఢశుద్ధసప్తమీ గురువారంనాడు జరిగిన శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారిసాక్షాత్కార వైభవోత్సవవేడుకల్లో ఆ గ్రామప్రజలే కాక, తిరుపతి, పెరుమాళ్లపల్లె, పేరూరు, తొండవాడ, చంద్రగిరి, నరసింగాపురం, మిట్టపాళెం మున్నగు చుట్టుపక్కల గ్రామాలప్రజలు భక్తిప్రపత్తులతో పాల్గొన్నారు. అందరిఇండ్లలోను పండుగలు చేసుకొన్నారు.

ఆనాటినుండి ఈ ఆలయం దినదిన ప్రవర్ధమానమౌతూ 1967 ఏప్రిల్ 26వ తేదీన తిరుమల తిరుపతి ఆలయాల ఆధ్వర్యంలోనికి వచ్చింది. ఈ ఆలయంలో 1980 జూలై నుండి మూడురోజులపాటు శ్రీకల్యాణవేంకటేశ్వరునిసాక్షాత్కారవైభవోత్సవాలు జరుగుతున్నాయి.

ఆనాటినుండి నిత్యోత్సవ, వారోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాలతో అలరారుతూ ఉంది. వివాహం కావలసినవారు, ఇక్కడ జరిగే నిత్యకల్యాణంలో పాల్గొని శ్రీస్వామివారి



కల్యాణకంకణాన్ని ధరిస్తే, తప్పక త్వరలో వివాహం అవుతుందని ప్రసిద్ధి ఉంది.

ఆకాశరాజు పుత్రిక పద్మావతిని వివాహమాడిన శ్రీనివాసుడు ఈ ప్రాంతంలో ఉన్న అగస్త్యమహర్షిని దర్శించాడట! ఆ కల్యాణదంపతులు తొలినాళ్లలో అగస్త్యునికోరిక పై ఆరు నెలలు ఇక్కడవున్నందువల్ల శ్రీస్వామివారు ఇక్కడ "శ్రీకల్యాణ వేంకటేశ్వరుడు"గా పేరుపొందాడు.

1540 సం॥లో అచ్యుతరాయలు ఈ గ్రామాన్ని తాళ్లపాక వారికి మాన్యంగా ఇచ్చాడు. అప్పట్లో తాళ్లపాక అన్నమయ్య మనుమడు చిన్నన్న శ్రీకల్యాణవేంకటేశ్వరునిఆలయాన్ని ఉద్ధరించాడు. అందువల్లే ఆలయప్రవేశద్వారంలో ఇరువైపులా అన్నమయ్య, పెదతిరుమలయ్యల శిల్పాలు దర్శనమిస్తాయి.

అగస్త్యాది ఎందరో మహర్షుల తపోభూమిగా, జగత్కల్యాణదంపతులు శ్రీపద్మావతీశ్రీనివాసులు నడయాడిన దివ్యస్థలంగా, కల్యాణపరంపరలను గుప్పించే ఆధ్యాత్మికక్షేత్రంగా అలరారుతూ ఉన్న శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం తిరుమలకు నడిచివెళ్లే "శ్రీవారిమెట్టు" మార్గంలో నెలవై ఉంది. ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుందాం! సర్వశుభాలను పొందుదాం!!



# ఈయన శక్తి అమోఘం!

- బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు శర్మ

**కు**మారస్వామివారిచరిత్రగా ఈ కథనొక్కసారి విన్నా చాలు. వరరుచి అనే పేరు గల ఆయన కింకరుడు, కైలాసంలో పార్వతీదేవిశాపంచేత భూమండలంలో కౌశాంబి అనే నగరంలో సోమదత్తుడు, ఆయనభార్య వసుదత్త అనే దంపతులకు కుమారుడుగా జన్మించాడు. కతునివంశంలో పుట్టినవాడు కనుక కాత్యాయనుడు అని పేరుంచారు. అపారమైన తేజస్సుతో పుట్టాడు కనుక వరరుచి అని ఇంకో పేరు వచ్చింది. ఆ పిల్లవానికి ఉపనయనం చేసే వయస్సు రాకముందే తండ్రి శరీరాన్ని విడిచి పెట్టేశాడు. తల్లి బాధపడుతుంటే అశరీరవాణి పలికింది "అమ్మా, బెంగపెట్టుకోకు. ఇతను కారణజన్ముడు. పార్వతీదేవి శాపంతో పుట్టాడు. ఇతను వ్యాకరణమంతటికీ వార్తికం రాస్తాడు. భారత దేశమంతా రెండు చేతులెత్తి ఇతనికి నమస్కరిస్తారు. ఇతనివల్ల దేశానికి ఎనలేని ఖ్యాతి కలుగుతుంది. ఇతనికి వరుడనే ఒక మహానుభావుడు పాఠం చెప్తాడు. ఆయనకి శ్రుతధరు డని బిరుదు. శ్రుతధరుడు అంటే ఏదైనా విన్నాడంటే చాలు, ఆయనకు వచ్చేస్తుంది. మృదంగం వాయించడం చూచాడనుకోండి, అలాగే వాయించేస్తాడు. నృత్యం చూచాడనుకోండి, ఆ ధ్వనిని బట్టి అలా నృత్యం చేస్తాడు. అంత శక్తి కాత్యాయనుడిది. వరరుచి పెరుగుతున్నాడు. ఇంకా ఉపనయనం కాలేదు.

*ఈ నెల 23వ తేదీ ఆడికృత్తిక సందర్భంగా..*

అదే సమయంలో వేతసన మని ఇంకొక నగరం ఉండేది. ఆ నగరంలో దేవస్వామి అనే ఒక వ్యక్తి ఉండేవాడు. ఆయనకొక తమ్ముడుండేవాడు. ఆయన పేరు ఇంద్రస్వామి. ఆ రోజులలో తమ్ముడు మరణిస్తే తమ్ముణ్ణి విడిచి ఉండలేక అన్నగారు కూడా తమ్ముడితో సహగమనం చేశాడు. అన్నదమ్ములిద్దరూ సహగమనం చేశారు కాబట్టి వాళ్లిద్దరి భార్యలు కూడా సహగమనం చేశారు. అప్పుడు పెద్దాయన కొడుకు, చిన్నాయన కొడుకు ఇద్దరూ ఉండిపోయారు. పెద్దాయన కొడుకు పేరు ఇంద్రదత్తుడు. రెండవవాని కొడుకు పేరు కరంభుడు. ఇంద్రదత్తుడు, కరంభుడు చిన్న పిల్లలు. వాళ్లకు తమతండ్రుల్లా గొప్ప విద్వాంసులు కావాలని కోరిక. గురువు ఎక్కడ దొరుకుతాడు? అని వెతుక్కుంటూ బయలుదేరారు. ఒకఊరు వెళ్లాక వారికి తెలిసింది. ఇక్కడెవరో మహానుభావుడు ఉన్నాడట. ఆయన పేరు వర్షుడట. ఆయన దగ్గర పాఠం నేర్చుకోవాలని అడిగారు. ఆయనకేం రాదు, అజ్ఞాని అన్నారు. అయినా సరే, ఎక్కడుంటారు అంటే, అదిగో ఆ పాకలో ఉంటాడు, వెళ్లమన్నారు. పాకలోకి వెళ్లారు. మాటా, పలుకూ లేకుండా కూర్చుని ఉన్నాడు- ఒకాయన. భార్య కనపడింది. ఆవిడకు నమస్కరించి "అమ్మా వర్షులవారిఇల్లిదేనా?" అని అడిగారు. అవునంది. "అమ్మా, వర్షులవారి వద్ద పాఠం నేర్చుకోవడానికి వచ్చామమ్మా. ఈయనెందుకిలా ఉన్నారమ్మా?"

ఆమె అంది – ఆయన మహావిద్వాంసుడే. కానీ జడుడైన ఈ వర్షునికి ఒక తమ్ముడున్నాడు. అతని పేరు ఉపవర్షుడు. ఆయనకు అన్న అంటే మహాప్రీతి. కానీ అతనిభార్య గయ్యాళి. నన్ను, ఈయనను సాధిస్తుండేది. అవమానం తట్టుకోలేక నీలాంటి జడుణ్ణి కట్టుకున్నానని భర్తను నిందించాను. మళ్లీ భర్త కాళ్లమీద పడి క్షమాపణ అడిగాను. నా భర్త బాధపడి మహా విద్వాంసుణ్ణి అవుతానని, ఎవరికీ చెప్పకుండా ఉత్తరభారత దేశంలో హిమాలయాలకి వెళ్లిపోయాడు.

అక్కడ కుమారస్వామికై తపస్సుచేశాడు. ఆయనే సరస్వతీ కటాక్షాన్ని ప్రసాదిస్తాడు. అతి తక్కువకాలంలో సరస్వతీ కటాక్షమివ్వగలిగినవాడు సుబ్రహ్మణ్యుడే. సుబ్రహ్మణ్యుడు ప్రత్యక్షమై ఏం కావాలన్నాడు. "అపారమైన కవిత్వం కావాలి, విద్వాంసుణ్ణి కావాలి, వేదవేదాంగాలు నాకు నీ అనుగ్రహంతో ఇప్పుడే వచ్చేయాలి" అన్నాడు. "వస్తాయి కానీ, ఎవరికీ చెప్పలేవు. ఎప్పుడు చెప్పగలుగుతావంటే కాత్యాయనుడు నిన్ను వెతుక్కుంటూ శిష్యుడుగా వస్తాడు. అప్పుడు నీలోని విద్వత్తు అంతా బయటికొస్తుంది" అన్నాడు. అందుకని ఆ కాత్యాయనుడు వస్తేనే పాఠం చెప్తారు అని ఆమె చెప్పింది.

## గమనిక!

***పర్వదినాలు ఎక్కువగా ఉండడం వలన జూలై, 2022 సంచికలో ఆయా పర్వదినాల సంబంధమైన వ్యాసాలు ఎక్కువగా ప్రచురించడం జరిగింది.***

***ఈ క్రమంలో ప్రతినెలా వెలువరిస్తున్న ధారావాహికలలో కొన్నిటిని ఈ సంచికలో స్థలాభావంవల్ల ప్రచురించలేకపోతున్నాం. వచ్చే నెల నుండి ధారావాహికలు యథావిధిగా వస్తాయి.***

***పాఠకులు ఈ అసౌకర్యాన్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాం!!***

– ప్రధానసంపాదకుడు

అప్పుడీ ఇంద్రదత్త, కరంభులు కాత్యాయనుణ్ణి వెతుక్కుంటూ బయలుదేరారు. అన్ని ఊళ్లు తిరిగి కాత్యాయనుడున్న ఊరొచ్చి, ఆయన తల్లిని "అమ్మా! కాసిన్ని మంచి నీళ్లయ్యమ్మా! ఎండలో వచ్చా"మన్నారు. మంచి నీళ్లిచ్చింది. అరుగుమీద సేదదీరుతూ కూర్చున్నారు.

ఆ తల్లి పిల్లాడితో "ఒరేయ్, మన ఊళ్లోకి నందుడొచ్చాడు. అతను మంచి నాటకం వేస్తాడు. ఆయన మీ నాన్నగారికి మంచిమిత్రుడు. ఆయన లేరని మనింటికి రావడం మానేశారు. ఎంత గొప్పగా నృత్యంచేసేవాడో! మీ నాన్నగారి ముందు నృత్యం చేసి చూపించేవాడు" అంది. "అమ్మా, బెంగపెట్టుకోకు. నేను ఒక్కసారి కార్యక్రమం చూచి రేప్పొద్దున్న నీ ముందు చేస్తాను" అన్నాడు. వీరిద్దరికీ అనుమానం వచ్చింది. అతడే కాత్యాయనుడై ఉంటా డని. ఆ పిల్లవానివెంట బయలుదేరారు. ఆ బాలుడు కూర్చుని నృత్యాన్ని తదేకంగా చూచి ఇంటికొచ్చాడు.

మర్నాడు మృదంగవాద్యం దగ్గరనుంచి అన్నిటినీ నోటితో పలికాడు. తల్లి సంతోషించింది. "అమ్మా! ఈ పిల్లవాని పేరు కాత్యాయనుడా? వరరుచా?" అని అడిగారు. రెండూనూ అంది ఆ తల్లి. "అమ్మా! మీకు నమస్కారం. ఈయనొస్తే కానీ వర్షులవారు నోరు విప్పరమ్మా! ఈ పిల్లవాణ్ణి తీసుకొని ఆయన దగ్గరికి వెళతా"మన్నారు. తల్లి అతనికి ఉపనయనం అవలేదంది. వారు "మేం చేస్తా"మన్నారు. మొత్తం మీద కాత్యాయనునికి ఉపనయనం చేసి వర్షులవారి దగ్గరికి తీసుకెళ్లారు. కాత్యాయనుణ్ణి చూడగానే వర్షులవారినోటినుంచి 'అగ్నిమీళే పురోహితం' అని ఋగ్వేదం దగ్గరినుంచి వేదమంత్రాలన్నీ బయటికొచ్చాయి. కూర్చోపెట్టి ముగ్గురికీ పాఠం చెప్పాడు. ఎంతో గొప్పగా వారు మహావిద్వాంసులయ్యారు.

ఇంతలో గాంధారనగరంలో పాణిని అని ఒక శివాంశ సంభూతుడు జన్మించి, పరమశివునిగురించి తపస్సుచేసి అనుగ్రహం పొంది, ఎవలేని వ్యాకరణసిద్ధాంతాలను పొందాడు. ఆ పాణినిదగ్గర పరమశివుడు తన డమరుకాన్ని మోగిస్తే, పద్నాలుగు మాహేశ్వరసూత్రాలు బయటికొచ్చాయి. అవి విని వ్యాకరణాన్నంతటినీ రచించి, వర్షుల దగ్గరికు వచ్చాడు. వర్షుల దగ్గర వ్యాకరణం చెప్తుంటే కాత్యాయనునికి కోపం వచ్చింది. "నాకన్నా విద్వాంసుడా? ఇతను" అని అతనితో వాదించి

ఓడించాడు. ఓడించినప్పుడు పాణినికి బాధ కలిగింది. కుమారస్వామిభక్తులు, శివానుగ్రహం పొందిన నన్ను ఓడించారని పరమశివుణ్ణి ధ్యానించాడు. వెంటనే శివుడు ప్రత్యక్షమై ఒక్క హుంకారం చేశాడు. ఇంద్రశబ్దమంతా లోకంలోంచి అంతరించింది. వీళ్లదంతా ఇంద్రశబ్దవంతమైన పాండిత్యం. అంతరించగానే ఎవ్వరికీ ఒక్క అక్షరంముక్కలేకుండాపోయింది. కుమారస్వామి ఆనాడు వర్షులవారికి కలలో వచ్చి "చేసిన దోషం ఎలాగూ చేశారు. మళ్లీ పాణినిని కూర్చోబెట్టి వ్యాకరణం ఆయన నోటివెంట వినండి. మీ విద్య మీకొచ్చేస్తుంది" అన్నాడు. పాణినిని కూర్చోబెట్టి వినగానే వ్యాకరణం వచ్చింది. కానీ ఒక్క కాత్యాయనుడుమాత్రం ఆగ్రహించి, ఉత్తరదిక్కుగా వెళ్లి కుమారస్వామి గురించి తపస్సు చేశాడు. స్వామి ప్రత్యక్షమయ్యాడు. ఏం కావాలని అడిగాడు. నాకు పాణిని రచించిన వ్యాకరణానికి వార్తికాన్ని రాసే శక్తినిమ్మన్నాడు. అనుగ్రహించాడు కుమారస్వామి.

వార్తికం అంటే విపులవ్యాఖ్య. వచ్చి కాత్యాయనమహర్షి వార్తికం రచించాడు. భారతదేశంలో ఎక్కడెక్కడి నుంచో శిష్యులు వచ్చి ఆయనదగ్గర వార్తికం చదువుకునేవారు. వ్యాకరణం చెప్పాలంటే మడికట్టుకుని శివాలయంలో చెప్పాలి. అలా కాత్యాయనమహర్షి కీర్తిప్రతిష్ఠలు దేశమంతా వ్యాపించాయి.

ఒక రోజు "నేను చేసిన వ్యాకరణానికి వార్తికం రాశాడే" అని పాణిని, కాత్యాయనుని దగ్గరికి వచ్చాడు. స్వాగతం పలికాడు. "ధూర్తుడా, నా వ్యాకరణానికి వార్తికం రాసి పేరు సంపాదించావు, నేటిరాత్రి నీ శిరస్సు నూరు వక్కలగు గాక" అని శపించాడు. కాత్యాయనుడు "అతిథి వని ఆహ్వానించాను. ఆహ్వానిస్తే నిష్కారణంగా శపించావు కనుక, నీ శాపం నా యందు నిజమైతే, నీ యందూ నిజమై నేటి రాత్రి నీ తలకూడా వందముక్కలు అగుగాక!" అన్నాడు. ఇద్దరి శిరస్సులూ నూరువక్కలైపోయాయి.

అంత విద్వాంసులై ఎందుకా తప్పు చేశారు? పార్వతి శాపంతో ప్రమథగణాల్లోంచి వచ్చిన కాత్యాయనమహర్షి, కుమారస్వామి అనుగ్రహంతో అంత గొప్పవాడైతే, మళ్లీ పరమశివానుగ్రహంతో వచ్చిన ఇంకొక రూపంవల్ల ఆయన అవతార సమాప్తి చేసి కైలాసానికి వెళ్లాలి. అందుకే శివతేజస్సు నుంచి వచ్చిన పాణినివల్ల ఇద్దరికీ వైరుధ్యం వచ్చి, ఒకరినొకరు శపించుకొని కైలాసానికి చేరుకున్నారు.



సుబ్రహ్మణ్యస్వామి అనుగ్రహంచేతనే ఇప్పటికీ వ్యాకరణానికి వార్తికం అంత ప్రసిద్ధి చెందింది. తరువాతి కాలంలో పతంజలి వచ్చి వ్యాకరణానికి మహాభాష్యం రాశాడు. కాబట్టి ఇన్నివిధాలుగా, ఇంతమందికి దివ్యమైన అనుగ్రహాన్ని ప్రసాదించిన మహానుభావుడు మన సుబ్రహ్మణ్యుడే!

శ్రీవేదాంతదేశికుల వారి

# శ్రీసుదర్శనాష్టకమ్



ప్రతిభటశ్రేణిభీషణ - వరగుణస్తోమభూషణ
జనిభయస్థానతారణ - జగదవస్థానకారణ,
నిఖిలదుష్కర్మకర్శన - నిగమసద్ధర్మదర్శన
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 1

సుదర్శనచక్రమా! నీవు ప్రతికూలవర్గానికి భయంకరుడివి. శ్రేష్ఠమైన గుణాలే నీకు ఆభరణాలు. జన్మజరా మరణాదులతో కూడిన సంసారభయాన్ని దాటిస్తావు. లోకస్థితికి కారణమైన వాడివి, సకలపాపాలను నిర్మూలించే వాడివి, వేదధర్మాలను దర్శింపజేసేవాడివి నీవే. ఇట్టి నీవు సర్వోత్కర్షతో విరాజిల్లుదువుగాక!!

శుభజగద్రూపమండన - సురజనత్రాసఖండన
శతమఖబ్రహ్మవందిత - శతపథబ్రహ్మనందిత,
ప్రథితవిద్వత్సపక్షిత - భజదహిర్బుధ్న్యలక్షిత
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 2

జగన్మంగళవిగ్రహుడైన శ్రీమన్నారాయణునకు అలంకారభూతుడు, దేవతలకు ఏర్పడ్డ భయాన్ని బాపేవాడూ, ఇంద్రుడిచే, బ్రహ్మచే నమస్కరింపబడేవాడూ, అథర్వవేదీయమైన శతపథబ్రాహ్మణంచేత కొనియాడబడేవాడూ, అహిర్బుధ్న్య సంహితలో ప్రతిపాద్యమైన వైభవం కలవాడూ అయిన శ్రీసుదర్శనా! నీకు జయమగుగాక! నీకు జయమగుగాక!!

నిజపదప్రీతసద్గణ - నిరుపధిస్ఫీతషడ్గుణ
నిగమనిర్వ్యూఢవైభవ - నిజపరవ్యూహవైభవ,
హరిహయద్వేషిదారణ - హరపురప్లోషకారణ
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 3

నీ చరణారవిందాలందు ప్రీతిమంతులైన సాధు సమూహం కలవాడా! స్వాభావికాలూ, పరిపూర్ణాలూ అయిన జ్ఞానబలైశ్వర్య వీర్యశక్తితేజస్సులనే ఆరుగుణాలు గలవాడా! వేదాలందు వినుతించబడ్డ మహిమగలవాడా! ఆత్మీయాలైన పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చలనే అయిదురూపాలు గలవాడా! ఇంద్ర విరోధులైన రక్కసులను చీల్చి చెండాడువాడా! కాశీపట్టణాన్ని కాల్చడానికి హేతువైన వాడా! సుదర్శనా! జయవిజయీభవ! జయవిజయీభవ!!

స్ఫుటతటిజ్జాలపింజర - పృథుతరజ్వాల పంజర
పరిగతప్రత్నవిగ్రహ - పటుతర ప్రజ్ఞదుర్గ్రహ,
ప్రహరణ గ్రామమండిత - పరిజన త్రాణపండిత
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 4

మెఱుపులమొత్తంవలె మెరిసే బంగారురంగుగల వాడా! మిక్కిలి పెద్దవైన అగ్నిజ్వాలల మధ్య మెలగేవాడా! సనాతనమైన రూపంగల వాడా! పటిష్ఠమైన బుద్ధి గల వారు సైతం గ్రహించడానికి శక్యంగాని వాడా! ఆయుధ సమూహం చేత అలంకరింపబడ్డవాడా! ఆశ్రితజనరక్షణలో సామర్థ్యం గలవాడా! శ్రీసుదర్శనా! నీకు జయం; నీకు జయం!!



శ్రీచక్రత్తాళ్వాన్
(తిరుమల)



శ్రీచక్రత్తాళ్వాన్
(తిరుచానూరు)

భువననేత్రత్రయీమయ–సవనతేజస్త్రయీమయ
నిరవధిస్వాదుచిన్మయ–నిఖిలశక్తే జగన్మయ,
అమితవిశ్వక్రియామయ–శమితవిష్వగ్భయామయ
జయజయశ్రీసుదర్శన–జయజయశ్రీసుదర్శన. 5

ముల్లోకాలకు నేత్రంవంటి వాడా! ఋక్సామయజుర్వేద స్వరూపుడా! యజ్ఞాలలో ఆరాధించబడే గార్హపత్య ఆహవనీయ దక్షిణాగ్నులనే త్రేతాగ్నుల యొక్క రూపమైనవాడా! అంతులేని భోగ్యమైన జ్ఞానాత్మకస్వరూపుడా! సర్వవిధసామర్థ్యంకలవాడా! జగద్రూపమైనవాడా! సంసారభయమనే రోగాన్ని ఉపశమింపజేసేవాడా! సుదర్శనా! నీకు జయం, జయం!!



**శ్రీచక్రత్తాళ్వాన్**
**(శ్రీనివాసమంగాపురం)**



**శ్రీచక్రత్తాళ్వాన్**
**(శ్రీకోదండరామాలయం-తిరుపతి)**

మహితసంపత్సదక్షర - విహితసంపత్షడక్షర
షడరచక్ర ప్రతిష్ఠిత - సకలతత్త్వప్రతిష్ఠిత,
వివిధసంకల్పకల్పక - విబుధసంకల్పకల్పక
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 6

ప్రశస్త జ్ఞానసంపత్తి గల్గిన ఆశ్రితులకు మోక్షరూపమైన వాడా! ఐశ్వర్యంకల్గించే ఆరక్షరాలు గల్గిన (సహస్రారహుంఫట్) మంత్రంచేత ఉపాసించబడేవాడా! ఆరుకోణాలుగల చక్రమందు ఉన్నవాడా! సమస్త భావంలోనూ అంతర్యామిరూపంలో నెలకొన్నవాడా! నానావిధాలైన కోరికలకు కల్పవృక్షంవంటివాడా! దేవతలయొక్క కాంక్షలను ఈడేర్చు వాడా! శ్రీ సుదర్శనా! నీకు జయం జయం, జయం జయం!!



**శ్రీచక్రత్తాళ్వాన్**
(ఒంటిమిట్ట)

ప్రతిముఖాలీఢబంధుర - పృథుమహాహేతిదంతుర
వికటమాయాబహిష్కృత - వివిధమాలాపరిష్కృత,
స్థిరమహాయంత్రతంత్రిత-దృఢదయాతంత్రయంత్రిత
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 7

కుడికాలిని ముందుకుసాచి ఎడమకాలిని వెనుకకు మెలేస్తే ప్రత్యాలీఢమనే బంధమౌతుంది. ఆ ప్రత్యాలీఢ బంధంచే మనోహరమైనవాడా! గొప్పవైన ఆయుధాలచే వ్యాప్తి చెందిన వాడా! వికటమైన మాయకు వెలియైనవాడా! అనేకాలైన మాలలచేత అలంకరించబడ్డవాడా! అవిచాల్యమైన గొప్ప యంత్రంలో ప్రతిష్ఠించబడ్డవాడా! దృఢమైన కృప అనే తంత్రంచే వశీకృతుడైన వాడా! శ్రీసుదర్శనా! నీకు జయమగుగాక!!

దనుజవిస్తారకర్తన - దనుజవిద్యావికర్తన
జనితమిస్రావికర్తన - భజదవిద్యానికర్తన,
అమరదృష్టస్వవిక్రమ - సమరజుష్టభ్రమిక్రమ
జయజయశ్రీసుదర్శన - జయజయశ్రీసుదర్శన. 8

రాక్షసుల ప్రాచుర్యాన్ని ఛేదించేవాడా! అసురుల మాయను నిశ్శేషంగా అంతరింపజేసే వాడా! సంసారమనే చీకటిరాత్రికి సూర్యునివంటి వాడా! భక్తుల అజ్ఞానాన్ని పూర్తిగ రూపుమాపువాడా! దేవతలచే దర్శించబడ్డ స్వకీయపరాక్రమం గలవాడా! రణరంగాలందు చిత్రవిచిత్రాలైన భ్రమణాలు గల వాడా! శ్రీ సుదర్శనా! నీకు జయమగుగాక!!

ద్విచతుష్కమిదంప్రభూతసారం
పఠతాం వేంకటనాయక ప్రణీతమ్,
విషమేఽపిమనోరథః ప్రధావ
న్న విహన్యేత రథాంగధుర్యగుప్తః.
ఇతి శ్రీ వేదాన్తాచార్యస్య
కృతిషు సుదర్శనాష్టకమ్.

శ్రీవేదాంతదేశికులచే అనుగ్రహించబడినట్టిదీ, గొప్ప సారం గల్గిందీ అయిన ఈ సుదర్శనాష్టకాన్ని పఠించే భక్తుల మనస్సు ఒక్కొకప్పుడు అప్రాప్యవిషయాలందు ప్రవర్తించినప్పటికీ శ్రీసుదర్శనునిచే రక్షించబడింద్దై ఉజ్జీవిస్తుంది.

శ్రీసుదర్శనుని అనుగ్రహంచేత సుదర్శనాష్టకాన్ని పఠించే వారందరూ సకలాభీష్టసిద్ధిని పొందుతారు.

ఇష్టప్రాప్తికీ, అనిష్ట పరిహారానికీ పూజ చక్కని ప్రక్రియ. పండుగలలో, ప్రత్యేకపర్వదినాలలో ఆయా దేవతలను విశేషంగా ఆరాధించడం మన సంప్రదాయం. అందుకే 'సప్తగిరి' సంప్రదాయబద్ధంగా ఉన్న పూజావిధానాలను, అష్టోత్తరాలను, అష్టకాలను ప్రత్యేకసందర్భాలలో భక్తుల సౌకర్యార్థం ప్రచురిస్తోంది.

శ్రీచక్రత్తాళ్వాన్ వర్షతిరునక్షత్రం సందర్భంగా శ్రీవేదాంత దేశికులవారి శ్రీసుదర్శనాష్టకాన్ని కానుకగా అందిస్తోంది. దీన్ని పఠించినవారు శ్రీచక్రత్తాళ్వాన్ కృపతో సర్వశుభాలు పొందగలరు!



# రారండోయ్.. చూచొద్దాం!!

- శ్రీ రామోజు హరగోపాల్, 99494 98698

ఒకనాడు తన భక్తుడిని రక్షించడానికి స్తంభంనుండి అవతరించిన శ్రీమహావిష్ణువు మరొకనాడు మరోభక్తుడి కోరిక తీర్చడానికి యాదగిరికొండపైన స్వయంభువుగా వెలిశాడు. ఐదు అవతారాలతో పంచనారసింహుడిగా భక్తులకు దర్శనం ఇస్తున్నాడు.

తెలంగాణారాష్ట్రరాజధాని హైదరాబాదుకు అరవై కిలోమీటర్లదూరంలో ఉన్న యాదగిరిగుట్ట (యాదాద్రి) మీద శ్రీనరసింహస్వామి స్వయంభువుగా వెలసి, కొలచినవారికి కోరిన వరాలిస్తున్నాడు.

## స్థలపురాణం

ఋష్యశృంగుని కొడుకు యాదముని నరసింహస్వామి భక్తుడు. స్వామిని గూర్చి తపస్సు చేయడానికి తగిన స్థలం వెతుకుతూ దేశాలెన్నో తిరిగాడు. అలిసి యాదగిరిపల్లె అడివిలో ఒక మర్రిచెట్టు కింద నిద్రపోయినపుడు కలలో హనుమంతుడు కన్పించి "ఇక్కడ కొండగుహలో నరసింహస్వామి వెలిశాడు. కొండమీద విష్ణుకుండం ఉంది. దాంట్లో స్నానం చేసి, తపస్సు చెయ్యి. స్వామి దర్శనం లభిస్తుంది" అన్నాడు. యాదముని తపస్సు చేశాడు. స్వామి కరుణించి వ్యాఘ్రరూపంలో ప్రత్యక్షమైనాడు.

యాదరుషికి ఉగ్రనరసింహ, జ్వాలానరసింహ, గండభేరుండ నరసింహ, యోగానందనరసింహ, లక్ష్మీనరసింహ అనే ఐదురూపాల్లో దర్శనమిచ్చాడు నారసింహుడు. తనకు దర్శనమిచ్చిన రూపాల్లోనే గుట్టమీద నిలిచి పొమ్మని స్వామిని వేడుకున్నాడు యాదరుషి. గుట్టమీది ప్రధానగుహలో ఆ రూపాల్లో వెలిశాడు స్వామి. ఈగుహ 12 అడుగుల ఎత్తు, 30అడుగుల పొడవుతో ఉంది. ఇదే గర్భగుడి. జ్వాలానరసింహుడు సర్పరూపంలో ఉన్నాడు. యోగానందనరసింహుని ఉల్బణశిల్పం గర్భగుడిలోని బండపగులు లోపలివైపున ఉంది. బయట (16వ శతాబ్దపు శైలిలో చెక్కిన) శ్రీలక్ష్మీనరసింహస్వామి శిల్పం, మరొకవైపు పెరియాళ్వార్, నమ్మాళ్వార్ల ఉల్బణశిల్పాలున్నాయి. గర్భగుడి బయట క్షేత్రపాలకుడైన ఆంజనేయుడున్నచోటనే గండభేరుండ నరసింహస్వామి వ్యక్తరూపంలో ఉన్నాడు. యాదముని తపస్సు చేయడం వల్ల ఈ కొండకు యాదగిరి అని పేరు వచ్చింది.

యాదగిరిపల్లెకు పక్కగ్రామమైన రాయగిరిలోని రామయ్య అనే వైదికబ్రాహ్మణునికి స్వప్నంలో మూడుసార్లు దర్శన







మిచ్చిన నరసింహస్వామి "తాను గుట్టమీద ఉన్నానని నమ్మి పూజించ"మని చెప్పాడుట. స్వామి కలలో చెప్పిన ఆనవాళ్ళు ప్రకారం ఆ బ్రాహ్మణుడు కొంతమంది స్థానికులతో కలిసి, వెదుకగా ఇప్పుడున్న కొండగుహలో స్వామి వ్యక్తరూపాలు కనిపించాయి. రామయ్య కూతురు రాధమ్మ. మగసంతానం లేకపోవడంతో రాధమ్మ తండ్రి మెదక్‌జిల్లా నర్సాపూర్ సమీపంలోని దొంతి గ్రామం నుండి తెచ్చుకున్న సీతారామయ్యను ఇల్లరిక పుటల్లుడిని చేసుకున్నాడు. వరంగల్లు నగర వాసి కెప్టెన్ లక్ష్మీకాంతారావుగారికి దగ్గరి బంధువైన రాయగిరి దేశముఖ్ బీరకాయల హన్మంతరావుగారికి సీతారామయ్య సన్నిహితుడు, స్నేహితుడు. సీతారామయ్యనే శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయపూజారిగా, అతనిభార్య రాధమ్మనుధర్మకర్తగా నియమించాడట హన్మంతరావు. రాధమ్మ ఆనువంశిక ధర్మకర్తగా, సీతారామశాస్త్రి పూజారిగా స్వామి కైంకర్యాలు నిర్వహించేవారు. వారి ఆహ్వానం మేరకు 1934 ప్రాంతంలో బెల్లంకొండ స్వాముల వారని పేరు పొందిన రామానందసరస్వతీ స్వాములు ఈ క్షేత్రంలో నారసింహ యంత్ర ప్రతిష్ఠ చేశాడు.

రాయగిరిదేశ్‌ముఖ్ హన్మంతారావు ప్రోద్బలంమేరకు సికింద్రాబాద్‌కు చెందిన రాందయాళ్‌సేఠ్, మందుముల నరసింగరావు, రాజాపన్నాలాల్ పిత్తి, రాధాబాయమ్మ యాదగిరిగుట్ట క్షేత్రానికి ధర్మకర్తలుగా శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయఉద్ధరణ చేశారు.

స్వామి కల్యాణానికి మధుపర్కాలు, పానకపుబిందెలు, ఫల, పుష్పాలు, పన్నీరు, అగరు, చందనాది కర్పూరాదులు, పందిరి మంచం, కుర్చీలు, తేనీటికి పాత్రలు, భోజన పాత్రలు ఇచ్చిన మొదటిభక్తుడు హైదరాబాద్ బండ్లగూడెంలో ఉండే ఫకీర్‌సాహెబ్. వారింట్లో గుహను చేసి, శ్రీలక్ష్మీనరసింహ మూర్తులను పెట్టుకుని అర్చిస్తుండేవాడు.

పూర్వపు భువనగిరి తాలూకాలోని యాదగిరిపల్లి గ్రామానికి చెందిన గుట్టమీద శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మొదట రూ. 25,000/-ల ఖర్చుతో నిర్మించారు. తర్వాత కాలంలో ఎందరో భక్తులు రూ. 1,55,000/-లను ఖర్చుచేసి భక్తుల సౌకర్యార్థం 55 గదులను నిర్మింపజేశారు. అప్పటికి దేవాలయానికి రూ. 24,000/-ల సాంవత్సరిక ఆదాయముండేది. అంతేగాక రూ. 22,000/-ల విలువైన భక్తులిచ్చిన వెండి, బంగారునగలు దేవాలయఖజానాలో ఉండేవి. దేవాలయ నిర్వహణ కమిటీవారు సంస్కృతం నేర్పే ఒక పాఠశాలను నెలకొల్పాలని తీర్మానం చేశారు. నిజాం ప్రభుత్వంలో ధార్మికశాఖ సంచాలకులుగా పనిచేసిన నవాబ్‌దీన్‌యార్‌జంగ్ బహదూర్ ఎన్నోసార్లు ఈ దేవాలయాన్ని దర్శించి, దేవాలయానికి విద్యుత్తు ఏర్పాటుకు, గుట్టపైకి వాహనాలు వచ్చేందుకు వీలుగా రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

చేయించాడు. సంస్కృతపాఠశాలలోని మెరిట్‌విద్యార్థులు బెనారస్ విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి పారితోషికాలు మంజూరు చేయించాడు.

## నూతన దేవాలయ నిర్మాణబాధ్యులు

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మాన్యశ్రీ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారి ప్రభుత్వం యాదగిరి నరసింహుడి ఆలయపునర్నిర్మాణ బాధ్యతలను తలకెత్తుకుంది. 2015 మార్చి 5వ తేదీన యాదగిరిగుట్టకు 'యాదాద్రి' అని నామకరణం చేశారు. అదే సంవత్సరం దసరానాడు తెలంగాణా ముఖ్యమంత్రి వర్యులు శ్రీకేసీఆర్ దేవాలయ పునర్నిర్మాణపనులకు అంకురార్పణ చేశారు.



గతంలో 1.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయక్షేత్రాన్ని గుట్టమీద రిటైనింగ్‌గోడలతో దక్షిణ, పశ్చిమ, ఉత్తరదిశల్లో 555 మీ.ల ప్రహరీని నిర్మించి, కొండ రాయిని చెక్కించి 4.30 ఎకరాలకు విస్తరింపజేశారు. ఈ క్షేత్రంలో 240 కోట్లధనం వెచ్చించి ప్రధానా లయం, ప్రాకారాలు, వివిధమంట పాలు నిర్మింపజేశారు. తొలి, మలి సంవత్సరాలలో పదిహేను వందల మంది నుంచి రెండువేలమంది శిల్పులు పనిచేశారు. యాదాద్రి దేవాలయ పునర్నిర్మాణానికి వాడిన కృష్ణ శిలబుుతువులకు అను గుణంగా ఉష్ణోగ్రతలను మార్చు కుంటుంది. శిలచాలా పటిష్టమైంది కూడా. యాదాద్రి నిర్మాణానికి అవసరమైన శిలలకోసం దేశవ్యాప్తంగా అన్వేషించి ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశంజిల్లా గురిజేపల్లిలోనూ, గుంటూరుజిల్లా కమ్మ వారిపాలెంలోనూ ఆలయ నిర్మాణానికి అనుకూలమైన కృష్ణశిల ఉన్నట్లు గుర్తించి తెప్పించారు. 2.5 లక్షల టన్నుల కృష్ణశిలను లక్ష్మీనరసింహుడి ఆలయానికి వాడారు. ఈ దేవాలయ నిర్మాణ శైలికోసం దేశంలోని సుప్రసిద్ధ క్షేత్రాలైన తిరుమల, మధురై, పళని, చిదంబరం, శ్రీరంగం, కుంభకోణంవంటి ఆలయాలను పరిశీలించారు. అవి వందలేండ్ల కిందటివి. ఏ దేవాలయమైనా ప్రస్తరంవరకు రాతితో కట్టి(రామప్ప, శ్రీకాళహస్తి), పైన ఇటుక లతో విమానగోపురం కట్టేవారు. రామప్ప కాకతీయ శిల్పానికి ప్రసిద్ధి. తమిళనాట చోళుల శిల్పం ప్రసిద్ధం. హంపి విజయనగర శైలి శిల్పాలకు పేరెన్నిక గన్నది. వీటన్నిటి శిల్పశైలుల మేళ వింపుతో యాదాద్రిలో ప్రస్తుత దేవాలయనిర్మాణం పూర్తయింది. ఆధునికకాలంలో అక్షరధామ్ దేవాలయం పూర్తిగా ఎరుపురంగు ఇసుకరాతితో కట్టిందే. కాని, యాదగిరిగుట్ట దేవాలయం పూర్తిగా నల్లరాతితో కట్టింది.

దేవాలయనిర్మాణానికి కాశ్యప శిల్పం, అనుసరించిన దేవాలయ ప్రాసాదప్రణాళికారచన, పాంచరాత్రాగమం నుంచి గ్రహించిన సూచనలను పాటిస్తూ డిజైన్ తయారుచేసుకున్న ప్రధానస్థపతి సుందరరాజన్, అదనపు స్థపతి వేలు ఆనందాచారి, తి.తి.దే. కళాశాలలో శిల్పశాస్త్రంలో డిప్లమో పొందిన సహాయ





స్థపతులు, ఉపస్థపతులు, మొత్తం దేవాలయనిర్మాణ రూపకల్పన చేసిన ఆనందసాయి, నిర్మాణ, నాణ్యత, సాంకేతికసలహాదారులుగా డా॥ఈమనిశివనాగిరెడ్డి, డా॥సుబ్రమణి ఉన్నారు. సుందర రాజన్ అనారోగ్యంతో 2019లో మరణించాక అతని స్థానంలో స్థాపత్యబాధ్యతలు చేపట్టిన వేలు ఆనందాచారి దేవాలయనిర్మాణం పూర్తిచేయించారు. తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడులనుంచి వచ్చిన అనుభవజ్ఞులైన 800మంది సంప్రదాయికశిల్పులు పనిచేశారు. దేవాలయపునర్నిర్మాణంలో రాళ్ల మధ్య బాండింగ్ కోసం సిమెంట్ వాడలేదు. అవసరమైన చోట గానుగ(డంగు)సున్నం, కరక్కాయ, బెల్లం, కలబంద, జనుం గుజ్జుల మిశ్రమాన్ని వాడారు. కొన్నిచోట్ల అతుకులకు సీసం కరిగించిపోశారు.

## నూతన నిర్మాణాలు

దేశమంతటా కనిపించే నాగర, వేసర, ద్రవిడశైలులలో ఈ గుడినిర్మాణం జరిగిందని చెప్పాలి. అయితే దేవాలయ గోపురాలు ద్రవిడశైలిలో అష్టభుజాలతో కాక నాగరశైలిలో కట్టారు.

## గర్భగుడి, మహామంటపాలు

గర్భగుడిలోని మూలవిరాట్టులను ముట్టుకోకుండా గర్భగుడి వైశాల్యాన్ని పెంచారు. గతంలో ఉన్న సిమెంటు, సున్నం నిర్మాణాలను తొలగించి రాతితో కట్టారు. పెరిగిన వైశాల్యానికి తగినట్లు దేవాలయవాస్తుప్రకారం గర్భగుడి మీద 48 అడుగుల ఎత్తుకు పెంచిన పంచతలవిమానం కట్టారు. దేవాలయవిమానానికి బంగారురేకుల తాపడం చేశారు. గర్భగుడి బయట దక్షిణ, పశ్చిమదిశల్లో రిటెయినింగ్‌వాల్ కట్టి, రథాన్ని తిప్పడానికి చాలినంత స్థలాన్ని సాధించారు. పశ్చిమాభిముఖంగా ఉన్న గర్భాలయ ప్రవేశద్వారం ఎత్తు, వెడల్పులను పెంచారు. ఈ దేవాలయానికి అంతరాళం లేదు. 38 అడుగుల ఎత్తైన మహామంటపముంది. ఏ శిల్పశాస్త్రంలోను కనిపించని కొత్తనిర్మాణం ఇది. దేవాలయ మంటపంలో ఆళ్వారుల గుడికాక పన్నిద్దరాళ్వార్లున్న పన్నెండు స్తంభాలు, ఉపరిమంటపంలో పన్నెండు కాకతీయశైలి స్తంభాలు, మరి నాలుగు సాదాస్తంభాలున్నాయి. మహామంటపంలోనే మనకు ఆండాళ్, శ్రీరామానుజుల గుడులు కన్పిస్తాయి. భక్తుల కోసం తిరుమల తరహాలో క్యూకాంప్లెక్స్ ఏర్పాటుచేశారు. నాలు గంతస్తుల భవన సముదాయంలో అంతస్తుకు రెండు పెద్దహాళ్లు, వాటిలో ఒకేసారి ఇరవైవేలమంది భక్తులుండేటట్లు ఏర్పాట్లు చేశారు. హాళ్లలో మంచినీరు, గాలి, వెలుతురు, స్నానపానాలవంటి వసతి సౌకర్యాలు ఏర్పరిచారు. భక్తులు దేవాలయప్రవేశానికి దక్షిణం నుంచి మొదలైన క్యూలైన్ చుట్టుతిరిగి తూర్పుప్రవేశద్వారం గుండా గుడిలోపలికి వస్తారు. శంఖు, చక్ర, తిరునామాలు, వైష్ణవదేవతా మూర్తులతో, బంగారు రంగు అల్యూమినియం వాడి క్యూలైన్లను అద్భుతంగా తీర్చిదిద్దారు. నిరీక్షణలో ఉండే భక్తులకు సకలసౌకర్యాలు కలుగజేస్తున్నారు. భక్తులు 55 అడుగుల ఎత్తున్న పంచతలగోపురం, 40 అడుగుల ఎత్తున్న త్రితల గోపురాలనుంచి గుడిలోపలికి ప్రవేశిస్తారు. గర్భగుడి ప్రవేశ ద్వారంపైన ఏ నారసింహాలయంలో లేనివిధంగా తొమ్మిది వెండి ఫలకాలలో ప్రహ్లాదచరిత్రను చెక్కించిపెట్టారు. అక్కడే రాతిలో చెక్కిన పంచనారసింహులు కూడా కనిపిస్తారు. దేవాలయ ద్వారానికి రెండుపక్కల ఎడున్నర అడుగుల ఎత్తున్న జయ, విజయులవిగ్రహాలు ద్వారపాలకులుగా దర్శనమిస్తున్నాయి. దైవదర్శనం తర్వాత క్షేత్రపాలకుడైన హనుమదర్శన మిస్తాడు. పిదప భక్తులు పడమటి రాజగోపురం గుండా బయటకుపోతారు.



## దేవాలయానికి మకుటాలు గోపురాలు



దేవాలయానికి నలువైపుల నాలుగు యాభైఐదుఅడుగుల ఎత్తున్న పంచతలగోపురాలు నలభై వైష్ణవమూర్తులతో కనిపిస్తున్నాయి. దేవాలయప్రవేశంలో త్రితలగోపురం ఉంది. దేవాలయానికి పడమటవున్న సప్తతలరాజగోపురం 83అడుగుల ఎత్తుంది. ఈ గోపురంమీద 54 మంది వైష్ణవమూర్తులున్నారు. రాజగోపురం ప్రత్యేకంగా చోళశైలి, కొంత విజయనగరశైలిలో కనిపిస్తుంది. ఈ ఒక్క సప్తతలరాజగోపురానికి వాడినంత రాయి ఎక్కడ కూడా వాడబడలేదు. ఇది ప్రపంచరికార్డు.

## యాదాద్రి దేవాలయప్రాకారాలు

ఇక్కడ రెండు అంతర, బాహిరప్రాకారాలు కట్టారు. ప్రథమప్రాకారంలో పాదవర్గం(దేవాలయపు గోడలు) మీద కుంభపంజరాలు, కుంభలతలు, దేవకోష్టాల స్థానంలో జాలకాలు (కిటికీలు), తీగెలు, పువ్వులతో అలంకరించారు, పైన సాలహారాలు నిర్మించారు. వీటిలో విష్ణువు దశావతారాలు, ప్రత్యేకంగా నరసింహావతారం, వివిధ వైష్ణవమూర్తులను అందంగా చెక్కారు శిల్పులు. ఈ ప్రాకారానికే నాలుగువైపుల నాలుగు ద్వారాలున్నాయి. ఈశాన్యద్వారం గుండానే భక్తులు దేవాలయప్రవేశం చేస్తుంటారు. అంతర ప్రాకారంలో ఈశాన్యంలోని కల్యాణమంటపంలో నిత్యకల్యాణాలు, ఆగ్నేయంలోని దీపాలంకరణ మంటపంలో నిత్యదీపాలంకరణ, నైరుతిలోని యాగశాలలో శ్రీసుదర్శననారసింహహోమం, వాయవ్యంలోని అద్దాలమంటపంలో అమ్మవారికి ఊంజల్‌సేవ నిర్వహిస్తారు. ద్వితీయ ప్రాకారం లోపలివైపు మండపాలను, సింహస్తంభాన్ని నిర్మించారు. ప్రాకారం వెలుపల బాలపాదస్తంభాలు, రెండువందల అష్టభుజమంటపాలను ఏర్పరిచారు. ఈ ప్రాకారానికే నాలుగువైపుల నాలుగు పంచతలగోపురాలు నిర్మించారు. అన్నిగోపురాలమీద వైష్ణవమూర్తులశిల్పాలు సుందరంగా కన్పిస్తాయి. స్తంభాలపై రామాయణేతిహాసదృశ్యాలను చెక్కారు. ప్రతి స్తంభంకూడా సుందర ప్రతిమాలంకృత శిల్పకళాశోభితమే. ద్వితీయప్రాకారం వెలుపలి మంటపాలకు చోళశైలిలో 14 అడుగుల ఎత్తున్న 58 సింహయాళీ స్తంభాలను సమకూర్చడం దేశంలోని దేవాలయాలలోనే ఇక్కడ ప్రత్యేకం. ఈ యాళీస్తంభాల కింద నోళ్లల్లో తిరుగాడే రాతిబంతులున్న సింహాలశిల్పాలను చెక్కిన శిల్పుల ప్రతిభ కొనియాడతగింది.

### వైకుంఠపాళి
### :: 78 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 దే | వి | 2 క | | 3 త్రి | | 4 రా | ము | డు |
| వ | | వి | | నే | | ధ | | |
| 5 శ్రు | తి | | 6 పు | త్రు | డు | | 7 హ | 8 రి |
| తు | | 9 త | | డు | | 10 జ | | పు |
| డు | | 11 మ | ణి | | 12 జ | యం | తి | |
| | | స | | 13 త్రి | | తి | | 14 భ |
| 15 త | టి | | 16 దే | వ | కి | | 17 ధ | ర |
| ప | | 18 అ | | క్ర | | 19 చి | | తు |
| 20 తి | లో | త్త | మ | | 21 దా | రు | కు | డు |

రెండు ప్రాకారాలలోని సాలహారాలమీద 243 దేవతామూర్తులను అలంకరించడం విశేషం. అష్టభుజమంటపాలలోని స్తంభాలమీద విష్ణువు 24మంది మూర్తులు, అష్టదిక్పాలురు, ఆళ్వారులతో పాటు తెలంగాణసంస్కృతిని ప్రతిబింబించే శిల్పాలు, పిల్లలాటలు, హంసలు, మకరాలు, లతలు, పుష్పాలు, మిశ్రమ మృగాలు, మిశ్రమపక్షులు, శృంగారం, ఈనాటి ధనరూపాలైన రూపాయలు, నాణాలు మొదలైనవాటిని అత్యద్భుతంగా కన్నులకు కట్టినట్లు చెక్కారు శిల్పులు.

శిల్పులు దేవాలయానికి తూర్పు ఆగ్నేయదిశలో బ్రహ్మోత్సవమంటపాన్ని, రాజగోపురం ముందు వేంచేపు మండపాన్ని తిరుమలలో గొల్లమంటపంలాగా నిర్మించారు. దేవాలయపు పడమటి రిటైనింగ్‌వాల్ మీద కాకతీయశైలి గజధారను చెక్కించారు.



ఈ నెల 13న గురుపూర్ణిమ సందర్భంగా...

# ఆచార్యదేవో భవ

- డా॥ కప్పగంతు రామకృష్ణ, 88975 47548

సమున్నతమైన వైజ్ఞానిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక వైభవంతో విశ్వవేదికలపై విజయం నర్తనం చేస్తున్న భారతీయ వైభవ ప్రాభవాలకు మూలకారణం ఇక్కడి గురుపరంపర. భారతదేశం మినహా సమస్తభూమండలంలోని మరే ఇతర ప్రాంతంలోనూ 'గురుపరంప' సంస్కృతి కనిపించదు. మాతృదేవోభవ, పితృ దేవోభవ అంటూ జన్మనిచ్చిన తల్లిదండ్రులకు తొలివందనాన్ని సమర్పిస్తూ, 'ఆచార్యదేవోభవ' అని తర్వాతి నమస్కారాన్ని గురువుకు చెల్లించాలని నిర్దేశిస్తున్నాయి ఉపనిషత్తులు.

నిజానికి గురువుకు, శిష్యునికి ఏ రక్తసంబంధం ఉందని అంతగా వారిద్దరి మధ్యా అంతటి ఆప్యాయత, శ్రద్ధ, భక్తివిశ్వాసాలు ఏర్పడతాయి? అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న తన బుద్ధిని జ్ఞానమార్గంలోకి మళ్లించిన గురువుకు శిష్యుడు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలడు? అని ప్రశ్నలు వేసుకుంటే, అందుకు సమాధానం... మాటల్లో వర్ణించలేని భక్తి, వాత్సల్యాలే గురుశిష్యుల అనుబంధానికి మూలకారణం. ఒకరిపట్ల మరొకరికి కలిగే అనన్యమైన విశ్వాసమే గురుపరంపరకు పునాది. "నా విజ్ఞానానికి శిష్యుడే వారసుడ"ని గురువు ఉప్పొంగిపోతే, "నా ఉన్నతికి కారణం మా గురువుగారే" అంటూ శిష్యుడు వినయంగా ఒదిగిపోతాడు. ఇదీ గురుశిష్యుల సంబంధం.

శివుడికి కోపం వస్తే గురువు రక్షిస్తాడు. కానీ, గురువుకే కోపం వస్తే రక్షించగలిగినవాడు ఏ లోకంలోనూ లేడని పెద్దలు చెబుతుంటారు. ఇదీ గురువైభవం.

## గురువు - లక్షణాలు

గురువు ఎలా ఉండాలి? గురువైభవం ఏమిటి? అనే విషయాల గురించి స్కందపురాణంలో విస్తారంగా వర్ణితమై ఉంది. ఇందులోని ఉమామహేశ్వర సంవాదం 'గురుగీత'గా ప్రసిద్ధి పొందింది. గురువు ఎవరు? ఎలా ఉండాలి? ఆయన లక్షణాలేమిటి? ఆయన ఆవశ్యకత ఏమిటి? గురుసాంగత్యంలో శిష్యుడు ఎలా ఉండాలి. ఎలా జీవించాలి? మొదలైన అనేక విషయాల్ని పరమేశ్వరుడు పార్వతీదేవికి స్వయంగా వివరిస్తాడు.

గురువుకు శాంతస్వభావం ఉండాలి. మంచివేషం ధరించాలి. సదాచారం పాటించాలి. మంచిబుద్ధి కలిగి ఉండాలి. శుచిత్వం, సమర్థత, ధ్యాననిష్ఠ కలిగి ఉండాలి. మంత్ర, తంత్రాల పట్ల చక్కని అభినివేశం ఉండాలి. నిగ్రహానుగ్రహశక్తి ఉండాలి. ఈ లక్షణాలన్నీ కలిగిఉన్న వ్యక్తిని మాత్రమే గురువుగా భావించాలని శాస్త్రాలు నిర్దేశిస్తున్నాయి.

మన ఉపనిషత్తులన్నీ అనేక సందర్భాల్లో గురువైభవం గురించి చెప్పాయి.

'గు' అంటే అంధకారం. 'రు' అంటే అజ్ఞాన నిరోధకం. అంటే– వ్యక్తిలోని అంధకారాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించేవాడు గురువు భావం. (అద్వయతారకోపనిషత్)

గురువే బ్రహ్మ. గురువే విష్ణువు. గురువే అచ్యుతుడైన దైవం. గురువును మించిన దైవం ముల్లోకాల్లోను ఎవరూ లేరు. (యోగశిఖోపనిషత్)

పరమశ్రేయస్సును పొందటానికి ఎల్లప్పుడూ గురుభక్తి కలిగి ఉండాలి. గురువు సాక్షాత్తు హరిస్వరూపం తప్ప మరొకటి కాదు. (బ్రహ్మవిద్యోపనిషత్) ఇంకా, మరెన్నో ఉపనిషత్తులు గురువైభవాన్ని అనేక విధాలుగా ప్రకటిస్తున్నాయి. వీటన్నిటి పరమార్థం ఒకటే... గురువును మించిన దైవం లేదు. గురు అనుగ్రహం ఉంటే సాధించలేంది లేదు.

## వ్యాసపూర్ణిమ ఎలా ఏర్పడిందంటే..?

భారతీయసంప్రదాయంలో జరిగే పండుగల్లో దేవతా రాధన ప్రధానంగా జరిగే పండుగలు ఎక్కువసంఖ్యలో ఉంటాయి. కాలసూచకంగా సాగే సంక్రాంతి వంటి పండుగలూ ఉంటాయి. వీటన్నిటికీ భిన్నంగా తనకు జ్ఞానాన్ని ప్రసాదించిన గురువుకు నమస్కరిస్తూ జరుపుకునే ఒకే ఒక పండుగ 'వ్యాసపూర్ణిమ' లేదా 'గురుపూర్ణిమ'. సత్యవతి, పరాశరుల కుమారుడైన వేదవ్యాసుడు జన్మించిన ఆషాఢశుద్ధపూర్ణిమను వ్యాసపూర్ణిమగా జరుపుకోవటం ఆచారంగా వస్తోంది.

వాస్తవానికి 'వ్యాసుడు' అనేది ఒక వ్యక్తి నామం (పేరు) కాదు. అదొక పదవి. ఆ పదవిలో ఉన్నవారందరూ వ్యాసులే. ప్రస్తుతం 27 మంది వ్యాసుల కాలం గడచిన తర్వాత, వైవస్వత మన్వంతరంలో సత్యవతీపరాశరులకుమారుడిగా జన్మించిన వేదవ్యాసుడి (ఈయనకే కృష్ణద్వైపాయనుడు, బాదరాయణుడనే పేర్లు కూడా వ్యాప్తిలో ఉన్నాయి) కాలం నడుస్తోంది. ఈయన జన్మించిన ఆషాఢశుద్ధపూర్ణిమను వ్యాసపూర్ణిమగా గురుపూజా మహోత్సవం చేసుకోవటం ఆచారంగా స్థిరపడింది.

వశిష్ఠుడు, వాల్మీకి వంటి తపశ్శక్తి సంపన్నులు, వేద వేదాంగవేత్తలు ఎంతమంది ఉన్నా, వేదవ్యాసుడికే మన శాస్త్రాలు అగ్రపీఠం వేశాయి. అనంతమైన తన సాహిత్యంద్వారా అపౌరు షేయాలైన వేదాలను విభజించిన వ్యాసుడు వేదవ్యాసుడయ్యాడు. ఈయనే బ్రహ్మసూత్రాలకు భాష్యం రాశాడు. భారత, భాగవతా లను లోకానికి అందించి, మహోపకారం చేశాడు. శ్రీకృష్ణుని ఉపదేశంగా లోకానికి భగవద్గీత నందించాడు. ఆ సాహిత్యం ద్వారా భారతీయ సంస్కృతీసంప్రదాయహర్మ్యాలకు పునాదిరాళ్లు కూర్చిన మహాశిల్పి వ్యాసభగవానుడు. భారతీయ సనాతనధర్మ వైశిష్ట్యాన్ని లోకానికి చాటిచెప్పిన తత్త్వవేత్త, సార్వజనీనమైన, సార్వకాలికమైన సాహిత్యానికి సృష్టికర్త కూడా ఆయనే. శక్తి, భక్తి, ఔన్నత్యం, సౌశీల్యం, సహజీవనం, సనాతనధర్మం, పవిత్రత, దానధర్మాలు మొదలైనవి ఈ దేశ సహజలక్షణాలుగా రూపొందటానికి మూలం వ్యాసుని రచనలే. ఇంతటి మహోన్నత మూర్తికి చేస్తున్న అర్చనే 'గురుపూర్ణిమ'.

ఇంతటి వైదుష్యం, వైవిధ్యత, ఔన్నత్యం ఉన్న వ్యక్తి కనుకనే దేవతలు సైతం గురువుకు శిరసువంచి నమస్కరించారు. శ్రీమహావిష్ణువు శ్రీరామావతారంలో వశిష్ఠ, విశ్వామిత్రులను; శ్రీకృష్ణావతారంలో సాందీపనిమహర్షిని గురువుగా స్వీకరించాడు. సాక్షాత్తు పరమేశ్వరఅవతారమైన ఆదిశంకరులు కూడా గౌడపాదాచార్యులను గురువుగా స్వీకరించారు. భగవద్గీతను బోధించటం ద్వారా శ్రీకృష్ణుడు జగద్గురువుగా అవతరించాడు.

ఆధునిక కాలంలోకి వస్తే చాణక్యుడు, పతంజలి, విద్యారణ్యుడు వంటి ఎందరెందరో తమ వైభవం ద్వారా యావజ్జాతికీ గురుస్థానంలో నిలుస్తున్నారు. ఇదీ భారతీయ గురుపరంపర.

మనదేశం సనాతనమైంది. ఇక్కడి సంస్కృతి, ధర్మం సనాతనమైనవి. 'సనాతనం' అంటే శాశ్వతం అని అర్థం. అంటే, ఈ జాతి, సంస్కృతి, ధర్మం... చావుపుట్టుకలు లేనివి. ఇవి ఎల్లప్పుడూ అలాగే ఉంటాయి. ఇటువంటి సనాతనతత్త్వాన్ని ఈ భూమికి అందించింది ఇక్కడి గురువులు. అసంఖ్యాకంగా ఉన్న ఈ గురుమూర్తులందరినీ పేరుపేరునా ప్రస్తావించటం సాధ్యం కాదు. అందుకే 'గురుపరంపర' అని సంబోధించటం జరుగు తుంది. ఇంతటి సమున్నతమైన, మహోత్కృష్టమైన గురు పరంపరకు శిరసువంచి పాదాభివందనం చేసుకుందాం!

### 41వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి'కి జవాబులు



**క్విజ్ సమాధానాలు**

1)సుభద్ర 2)ద్రౌపది 3)మాద్రి 4)రోహిణి 5)గాంధారి 6)ఉత్తర 7)సుధేష్ణ

# అన్నమయ్య అర్చించిన దేవుడు!

- డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు









పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకగ్రామంలో కొలువుదీరి అన్నమయ్య ఆరాధనలందుకున్న దేవుడు తాళ్లపాక శ్రీచెన్నకేశవస్వామి. కడపజిల్లాలో రాజంపేట పట్టణానికి సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో తాళ్లపాక ఉంది. ఇక్కడి ప్రాచీన ఆలయాల్లో శ్రీచెన్నకేశవస్వామివారిఆలయం ఒకటి. తాళ్లపాక శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయాన్ని జనమేజయ మహారాజు నిర్మించి అందులో శ్రీచెన్నకేశవస్వామివారిని ప్రతిష్ఠించినట్లు స్థలపురాణం.

శ్రీచెన్నకేశవస్వామివారిని తాళ్లపాక అన్నమాచార్యుల పూర్వీకులు అర్చించారు. అన్నమయ్య తాత గారైన నారాయణయ్యకు స్వామివారు విద్యను బోధించడంవల్ల జ్ఞానవంతుడయ్యాడు. అంతే కాకుండా ఈ స్వామివారు తాళ్లపాక అన్నమాచార్యుల నాలుకపైన బీజాక్షరాలను రాయడం వల్లనే ఆయన పదకవితాపితామహుడిగా రాణించగలిగాడని కూడా స్థలపురాణం వెల్లడిస్తోంది.

తాళ్లపాక గ్రామంలో అన్నమయ్య నివసించినట్లుగా చెప్పబడుతున్న ఇంటి పక్కనే శ్రీచెన్న కేశవస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లే మార్గంలో ముందువైపు శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్ ఆలయం ఉంది. ఈ ఆలయగర్భాలయంలో నల్లనిరాతిపలకపై సుదర్శనచక్రం మలచబడి ఉంది. సుదర్శన చక్రం కిందివైపున దోగాడుతూ, చేతవెన్న ముద్దను ధరించిన శ్రీకృష్ణుడు ఉన్నాడు. అంటే ఒక శిల్పంలో పైభాగంలో శ్రీసుదర్శనచక్రం క్రిందిభాగంలో దోగాడుతూ ఉన్న చిన్నికృష్ణుడు మూలవిరాట్టుగా కొలువుదీరి పూజలందుకుంటున్నారు. స్వామివారు శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్, శ్రీసంతానవేణుగోపాలస్వామి అనే పేర్లతో పూజలందుకుంటూ ఉన్నారు.

శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయం తూర్పుఅభిముఖంగా విశాలమైన ప్రాంగణంలో ఉంది. ప్రధానఆలయం ఎదురుగా ధ్వజస్తంభం, బలిపీఠం, గరుడమండపాలు ఉన్నాయి. ప్రధాన ఆలయం ముఖమండపం, అంతరాలయం, గర్భాలయాలను కలిగి ఉంది. ప్రధానగర్భాలయంలో శ్రీచెన్నకేశవ స్వామివారు కొలువుదీరి దివ్యఅలంకారాలతో భక్తులపై కరుణాకటాక్షాలు ప్రసరింపచేస్తూ దర్శన మిస్తారు. స్వామివారు చతుర్భుజుడు. శంఖు, చక్ర, గద, అభయముద్రలను చేతులలో ధరించి స్వామివారు కొలువుదీరి ఉన్నారు. అంతరాలయంలో శ్రీదేవిభూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామివారి ఉత్సవమూర్తులను శ్రీచక్రత్తాళ్వారులను దర్శించుకోవచ్చు. ఆలయప్రాంగణంలో ఈశాన్యంలో ఉన్న ఉపాలయంలో శ్రీఆంజనేయస్వామివారు కొలువుదీరి ఉన్నారు. ఈ స్వామివారిని పూజించడం వల్ల గ్రహబాధలు తొలగిపోతాయి అని అన్ని రకాలవిజయాలు లభిస్తాయి అని భక్తులవిశ్వాసం.

చారిత్రకంగా పరిశీలిస్తే 11వ శతాబ్దంప్రాంతంలో ఈ ఆలయం నిర్మింపబడినట్లు తెలు స్తోంది. తాళ్లపాక అన్నమాచార్యులు వారి తాతకాలంనాటికే ఆలయం ఉండటం అందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అప్పటినుంచి ఈ ప్రాంతాన్ని పరిపాలించిన పాలకులందరూ ఈ స్వామివారిని సేవించి తరించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆలయం తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో ఉంది. ప్రతిరోజూ పూజలు జరిగే తాళ్లపాక శ్రీచెన్నకేశవస్వామివారి ఆలయంలో ప్రతి సంవత్సరం ఆషాఢశుద్ధఏకాదశి మొదలు బహుళచవితి వరకు తొమ్మిదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. వివిధవాహనసేవలతో పాటు ఆరవరోజు సాయంత్రం కల్యాణోత్సవం, ఏడవరోజురాత్రి రథోత్సవం జరుగుతాయి. ధనుర్మాసం, ముక్కోటి ఏకాదశి, వివిధపండుగల సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. తాళ్లపాక అన్నమయ్య అర్చించిన దేవుడైన శ్రీచెన్నకేశవ స్వామివారిని దర్శించి భక్తులు ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందవచ్చు.

*జూలై 9వ తేదీ తాళ్లపాక శ్రీచెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవ ప్రారంభం*

# ఈ రోజుతోనే పండుగలన్నీ మొదలు...

– శ్రీమతి డి.వరలక్ష్మి

ఆషాఢమాసంలో వచ్చే శుద్ధఏకాదశికి తొలిఏకాదశి అని పేరు. తొలిఏకాదశి వచ్చిందంటే ఇక వరుసగా పండుగలొస్తాయి. అప్పటివరకూ ఎలాంటి పండుగలు లేక బోసిపోయిన ఇళ్లకు ఈ పర్వదినంతో కొత్తకళవస్తుంది. ఈ రోజున చాలామంది విష్ణువును పూజిస్తారు. చాలాప్రాంతాల్లో గోపద్మవ్రతం ఆచరిస్తారు. ఈనాలుగునెలలు వర్షాకాలం కనుక పశువుల కొట్టాలను చక్కగా శుభ్రం చేసుకుంటారు. పశువులకు ఎలాంటి ఇబ్బందులూ, అనారోగ్యం కలుగకుండా కాపాడుకునే ప్రయత్నంలో భాగంగా చేసే వ్రతమే 'గోపద్మ వ్రతం'. సాధకులు ఈనాడు మంత్రదీక్ష తీసుకుంటారు.

**ఈ నెల 10వ తేదీ *తొలి ఏకాదశి!***

## మురాసుర సంహారం

కృతయుగంలో మురాసురుడు అనే రాక్షసుడు సాధు పురుషులను హింసించేవాడు. విష్ణువు వెయ్యిసంవత్సరాలు మురాసురుడితో యుద్ధం చేసి అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకున్నాడు. అప్పుడు ఆయన దేహంనుంచి ఒక కన్య ఉద్భవించి మురాసురుడిని ఎదుర్కొని సంహరించిందని పురాణ కథనం. ఆమె చేసిన సహాయానికి సంతోషించిన విష్ణువు ఆ కన్యను ఏదైనా వరం కోరుకోమన్నాడు. అందుకు ఆ కన్య ఏకాదశి పేరుతో విష్ణుప్రియగా ఉండేలా వరమిమ్మని కోరింది. ఆరోజు నుంచి తొలి ఏకాదశి ఏర్పడిందని పురాణకథనం.

## భద్రశీలుని కథ

గాలవముని కుమారుడైన భద్రశీలుడు జితేంద్రియుడు. బాల్యం నుంచే గొప్ప విష్ణుభక్తుడు. అతని హరిభక్తికి ఆనందించిన గాలవుడు "నీకింత భక్తి ఎలా అబ్బింది నాయనా?" అని అడిగాడు భద్రశీలుడు. అప్పుడు భద్రశీలుడు "తండ్రీ, నేను గతజన్మలో ధర్మకీర్తి అనే రాజును. నా గురువు దత్తాత్రేయమహర్షి బోధనల వల్ల కొంతకాలం ధర్మబద్ధంగానే పాలించాను. అయితే ఐశ్వర్యమదోన్మత్తుడనై భోగవిలాసాలకు దాసుడనై ఎన్నో అకృత్యాలకు పాల్పడి నా ప్రజల సంగతే మర్చిపోయాను. నా ప్రజలు కూడా నాలాగే పాపాలు చేయడం మొదలుపెట్టారు. ఓసారి అడవికి వెళ్లాను. బాగా తిరగడం వల్ల ఆకలి వేసింది. తినడానికి ఎక్కడా ఏమీ దొరకలేదు. ఓ చెట్టు కింద కొందరు ఏకాదశివ్రతం చేస్తుంటే అక్కడ అలసిపోయి కూర్చున్నాను. వారితోపాటే జాగరణ చేశాను. ఆ తెల్లవారుజామున మరణించాను. యమదూతలు నన్ను తీసుకెళ్లి యముని ముందుంచారు. ఎంత పాపాత్ముడనైనా ఏకాదశిరోజున ఉపవాసం ఉండి ఏకాదశివ్రతాన్ని కళ్లారా చూసి జాగరణ చేయడం వల్ల నా పాపాలన్నీ పటాపంచలైపోయాయని" చిత్రగుప్తుడు చెప్పడంతో యమధర్మరాజు నన్ను సత్కరించాడు. విష్ణుభక్తులను, ఏకాదశివ్రతాన్ని తెలియక పాటించినవారిని సైతం యమలోకంలోకి తీసుకురావద్దని భటుల్ని హెచ్చరించాడు. నేను చేసిన అకృత్యాలకు ఎంతో పశ్చాత్తాపపడ్డాను. యముడు నన్ను స్వర్గానికి పంపాడు. తర్వాత నా భాగ్యవిశేషంవల్ల మీకు పుత్రుడిగా జన్మించాను. గత జన్మానుభవంవల్ల స్వయంగా నేను ఏకాదశి వ్రతం చేయడమే కాక ప్రజలందరి చేత ఆ వ్రతం చేయిస్తున్నాను అన్నాడు. అది విని గాలవుడు ఎంతో సంతోషించాడు.

## ఏకాదశివ్రతం

ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనసు.. ఈ పదకొండింటి పైన నియంత్రణ సాధించేందుకు ఏకాదశి వ్రతదీక్షను తీసుకోవాలి. ఈ రోజున విష్ణుసహస్రనామ పారాయణం చేసి ఉపవాసం ఉండాలి. దేవాలయదర్శనం చేసి దైవ చింతనతో గడిపితే విశేషపుణ్యఫలం లభిస్తుంది. ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి భూరిదానాలు చేసిన పుణ్యం, అశ్వమేధ యాగం చేసిన ఫలితం, అరవై సంవత్సరాల తపోఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి.



# శుభాల మాసానికి స్వాగతం!

- శ్రీమతి తంగిరాల మానస

గృహలక్ష్మి

సకలదేవతలకు ప్రీతికరమైంది శ్రావణమాసం. ప్రతి రోజూ పండుగలా ఆడపడుచులు సంతోషంగా ఉండే మాసం. కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుడు జన్మించిన శ్రవణానక్షత్రం సమీపంలో చంద్రుడు సంచరిస్తాడు కాబట్టి ఈ మాసానికి శ్రావణమాసమనే పేరు వచ్చింది. ఈ మాసంలో వచ్చే ముఖ్యమైన పండుగలు, వాటి వైశిష్ట్యం చాలా ఉంది. లక్ష్మీదేవికి ఇష్టమైన ఈ నెలలో రోజూ ఉదయం, సాయంత్రం మహిళలు దీపారాధన చేస్తే దీర్ఘసుమంగళీయోగం, అష్టైశ్వర్యాలు లభిస్తాయి. తిథులతో సంబంధం లేకుండా అష్టమి, నవమి, అమావాస్యరోజుల్లో కూడా పండుగలు, పూజలు చేసే అత్యంత శుభప్రదమైన మాసం కూడా ఇదే.

శ్రావణమాసాన్ని నభో మాసం అని కూడా అంటారు. నభో అంటే ఆకాశం అని అర్థం. ఈ నెలలో వచ్చే సోమవారాలు, మంగళవారాలు, శుక్రవారాలు, శనివారాలు ఎంతో పవిత్రమైనవి. ఈ మాసంలోని ముఖ్యమైన పర్వదినాలు జంధ్యాల పౌర్ణమి, కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, నాగచతుర్థి, గరుడపంచమి పుత్రాదాఏకాదశి, దామోదరద్వాదశి, వరాహజయంతి ఇలా అనేక పండుగలు వస్తాయి. ఈ మాసంలో ఇల్లు, ఆలయాలు భగవన్నామ స్మరణతో మారుమ్రోగుతాయి. శ్రావణంలో చేపట్టే ఏ కార్యానికైనా ఎంతో పవిత్రత ఉంటుంది. వివాహాలు, నోములు, వ్రతాలు, పూజలు, శుభకార్యాలతో సందడిగా ఉంటుంది. ఈ మాసంలోని ప్రతి శుక్రవారం మహిళలు మహాలక్ష్మిలా అలంకరించుకుని తమకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు ప్రసాదించాలని సముద్ర తనయకు ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

పాలసముద్రమథనంలో ఉద్భవించిన హాలాహలాన్ని పరమశివుడు శ్రావణమాసంలోనే సేవించి నీలకంఠుడిగా లోకాన్ని ఉద్ధరించాడు. ఈ మాసంలో ఒక్కోరోజు ఒక్కో దేవతను పూజిస్తారు. సోమవారాల్లో శివుడికి అభిషేకాలు, మంగళవారం గౌరీవ్రతం, బుధవారం విఠలుడికి పూజలు, గురువారం గురుదేవుని ఆరాధన, శుక్రవారం లక్ష్మీ, తులసిపూజలు, శనివారం హనుమంతుడు, శ్రీవేంకటేశ్వరుడు, శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేస్తారు. వీటితోపాటు గరుడపంచమి, పుత్రదైకాదశి, వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, రుషిపంచమి, గోవత్సబహుళ, శ్రీకృష్ణాష్టమి, పోలాల అమావాస్యలాంటి పండుగలు ఈ మాసంలోనే వస్తాయి.

**జూలై 29 శ్రావణమాసం ప్రారంభం!**



శివుడికి శ్రావణమాసం అత్యంత ప్రీతికరమైంది. ఈ మాసంలో వచ్చే సోమవారం నాడు ఆవుపాలు, పెరుగు, చక్కెర, నెయ్యి, తేనె లాంటి పంచామృతాలతో శివుడికి అభిషేకం చేస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. బిల్వపత్రాలు, ఉమ్మెత్తు, కలువ, తుమ్మిలాంటి ఇష్టమైన పుష్పాలతో ఈశ్వరారాధన చేస్తారు. శుభమంగళాలు పలికే మంగళవారానికి ప్రత్యేకత ఉంది. ఈ రోజున గౌరీదేవిని పూజిస్తారు. పసుపుముద్దను తయారు చేసి కుంకుమ, పూలు అక్షింతలతో పూజలు నిర్వహిస్తారు. కొత్తగా వివాహమైన మహిళలు ఈ వ్రతాన్ని ఆచరించడం ఆనవాయితీ. మంచి భర్త లభించాలని

అవివాహితులు, తమ వైవాహికబంధం సజావుగా సాగాలని వివాహితులు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరిస్తారు.

శ్రావణమాసం మొదలైన నాలుగోరోజునే వచ్చే పండుగ నాగపంచమి. శివుడి ఆభరణమైన నాగేంద్రుడిని పూజించడం హైందవ ఆచారం. పాలు, మిరియాలు, పూలతో నాగదేవతను పూజిస్తారు. వెండి, రాగి, రాతి, చెక్కలతో చేసిన నాగపడగలకు భక్తులు అభిషేకం చేస్తారు.


సంతానం లేని వారు భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్ల ఏకాదశి రోజున ప్రత్యేకపూజలు చేసి, ఉపవాసం ఉంటే మంచి సంతానం కలుగుతుంది. అందుకే దీన్ని పుత్రదాఏకాదశి అన్నారు.

శ్రావణమాసంలోని పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం నాడు వరలక్ష్మీవ్రతాన్ని చేస్తారు. నవవధువులతో తొలిశ్రావణంలో ఈ వ్రతాన్ని తప్పనిసరిగా చేయిస్తారు. వరాలిచ్చే దేవత వర లక్ష్మీవ్రతం వల్ల భర్తలకు ఆరోగ్యం, పరిపూర్ణ ఆయుష్షు కలుగు తాయని విశ్వాసం.

శ్రావణం చంద్రుడిమాసంకూడా. చంద్రుడు మనః కారకుడు. అంటే సంపూర్ణంగా మనస్సు మీద ప్రభావం చూపే మాసం. ఈ మాసంలో రవి సంచరించే నక్షత్రాల ప్రభావం చంద్రుని మూలంగా మన మీద ప్రభావం చూపుతాయి. చంద్రుని చార నుంచి జరగబోవు దుష్ఫలితాలను నివారించి, మంచి కలిగించడానికి, ధర్మాచరణాలను పండుగగా ఆచరించడం నియమం. మనస్సు మీద మంచి ప్రభావం ప్రసరించి పరమార్ధం వైపు మళ్లించి మానసిక శాంతి పొందడానికి, ప్రకృతి వల్ల కలిగే అస్తవ్యస్త అనారోగ్యాలనుంచి తప్పించుకోవడానికి, మంచి ఆరోగ్యాన్ని పొందడమే శ్రావణమాసంలో వచ్చే పండుగలలోని ఆచారాల ముఖ్యోద్దేశం.

**04-07-2022 మరీచిమహర్షి తిరునక్షత్రం**

**శ్రీవిఖనసాచార్యులవారి శిష్యులలో రెండో వారైన మరీచిమహర్షి ఆషాఢమాసం శుక్లపక్షం పూర్వఫల్గునీ నక్షత్రంలో జన్మించారు. తిరుమల శ్రీవారి ఆరాధనలన్నీ మరీచిమహర్షి అనుగ్రహించిన విధానంలోనే జరుగుతున్నాయి.**




## 2022, ఆగష్టు నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | నాగచతుర్థి |
| 02 | గరుడపంచమి |
| 05 | శ్రీవరలక్ష్మీవ్రతం |
| 06 | తరిగొండవెంగమాంబ వర్ధంతి |
| 07 - 10 | తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం |
| 11 | శ్రీవిఖనస మహాముని జయంతి, శ్రావణపూర్ణిమ |
| 12 | శ్రీహయగ్రీవజయంతి |
| 13 | గాయత్రీజపం |
| 15 | భారతస్వాతంత్ర్యదినోత్సవం |
| 19 | శ్రీకృష్ణాష్టమి, గోకులాష్టమి |
| 27 | పోలాల అమావాస్య |
| 29 | శ్రీబలరామ జయంతి |
| 30 | శ్రీవరాహజయంతి |
| 31 | వినాయకచవితి |



# భక్తుల ఆకలి తీర్చేందుకే...!

– శ్రీమతి జానపాటి మనస్విని

ప్రకృతిలోని ప్రతి అణువూ జగన్మాతస్వరూపమే. ఆమె ప్రకృతిస్వరూపిణి. గాలి, నీరు, చెట్టు, పుట్టా... ఒకటేమిటి చివరకు మన నిత్యభోజనంలో ప్రధానమైన కూరలతో సహా అన్నీ ఆ తల్లి దయవల్ల లభించేవే. తన బిడ్డలవంటి భక్తుల క్షుద్బాధను తీర్చటానికి ఆ తల్లి తానే స్వయంగా అన్నిరకాల కూరగాయలను ఆభరణాలుగా ధరించి, 'శతాక్షి'గా అవతరించింది. ప్రజలందరికీ సాంత్వన చేకూర్చింది. అందుకనే ఆ తల్లి శాకంబరిగా భక్తుల నీరాజనాలు అందుకుంటోంది.

జగన్మాత శాకంబరిగా ఆవిర్భవించిన నేపథ్యం దుర్గముడు అనే రాక్షసుడు బ్రహ్మ గురించి తీవ్రమైన తపస్సు చేస్తాడు. మునులు యజ్ఞయాగాదిక్రతువులు చేస్తున్నారు. వాటి ద్వారా అందిన హవిస్సుతో దేవతలకు అమోఘమైన శక్తి వస్తోంది. అందువల్లే వారు రాక్షసుల్ని నిర్జించగలుగుతున్నారు. కాబట్టి, దేవతల్ని ఓడించాలంటే వారి శక్తిని తగ్గించాలి. అలాజరగాలంటేవారికి యజ్ఞహవిర్భాగాలు అందకూడదు. ఇదంతా జరగాలంటే వేదవిజ్ఞానమంతా తమకు అధీనం కావాలి. అప్పుడు దేవతల శక్తి క్షీణిస్తుందని అతడి ఆలోచన. ఈ కోరికతోనే అతడు కేవలం గాలి మాత్రమే తీసుకుంటూ వెయ్యిసంవత్సరాలు ఘోరమైన తపస్సు చేశాడు. దుర్గముడి తపస్సుకు సంతోషించిన బ్రహ్మ దేవుడు అతడికి ప్రత్యక్షమవుతాడు. "స్వామీ! వేదాలన్నీ నా దగ్గరే ఉండాలి. మంత్రాలన్నీ నాకు అధీనం కావాలి. దేవతల్ని ఓడించే శక్తి కావాలి" అంటూ వరాల్ని అర్థించాడు రాక్షసుడు. బ్రహ్మదేవుడు తథాస్తు అంటూ వరాలిచ్చి, అంతర్ధానం చెందాడు.

**జూలై 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు శాకంబరీ ఉత్సవాలు**

వరప్రభావంతో ముల్లోకాల్లోని బ్రాహ్మణులు వేద మంత్రాల్ని మర్చిపోయారు. దీంతో వేదవిహితకర్మలన్నీ ఆగిపోయాయి. యజ్ఞయాగాదుల ఊసేలేదు. దేవతలకు యజ్ఞ హవిర్భాగాలు అందటంలేదు. ఫలితంగా దేవతలు నిర్వీర్యులయ్యారు. ఈ ప్రభావం దేవతలతో పాటు మానవులు కూడా అనుభవించాల్సి వచ్చింది. యజ్ఞాలు లేకపోవటంతో వానలు కురవలేదు. పంటలు పండలేదు. లోకమంతా దుర్భిక్షం తాండవించటం మొదలైంది. తినటానికి కనీసం తిండిలేని క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రపంచమంతా అల్లకల్లోల పరిస్థితులు ఏర్పడ్డాయి. లోకమంతా ఇలా ఆవేదన చెందుతుండటంతో దుర్గముడు ఇదే అదనుగా భావించి, దేవలోకాన్ని వశపరుచుకున్నాడు. దుర్గముడి ఆగడాలు మరింత పెరిగాయి. రాక్షసుడి బాధలు తట్టుకోలేని మునులు, దేవతలు సుమేరుపర్వతశిఖరాన్ని చేరుకుని జగన్మాతను ప్రార్థించారు. తమ దీనస్థితిని విన్నవించుకుంటూ, తమను ఉద్ధరించమని ప్రార్థించారు. మునులు, దేవతలు చేసిన స్తోత్రాలకు దేవి ప్రసన్నురాలైంది.

ఒక చేతిలో బాణం, మరొక చేతిలో కమలం, మూడో చేతిలో సారవంతమై, తినగానే పుష్టినిచ్చే కందమూలఫలాలు, ఆకుకూరలు, పండ్లు, నాల్గవచేతిలో మహాధనుస్సు ధరించి జగన్మాత ప్రత్యక్షమైంది. సర్వాతీతురాలైనప్పటికీ తన బిడ్డల వంటి భక్తుల దయనీయస్థితి చూసి ఆమె చలించింది. ఆమె కన్నులు మరుక్షణంలో చెమర్చాయి. ఈ కన్నీటిబిందువులు

అమ్మ చెక్కిళ్ల మీదుగా భూమిని చేరాయి. ఆ కన్నీటిబిందువుల పరంపర నదులు, సరస్సుల్లోకి చేరింది. ఫలితంగా నదులన్నీ తిరిగి పూర్వకళను సంతరించుకున్నాయి. ఆ నీటిని తాగిన ప్రజల్లో నూతనచైతన్యం కలిగింది.

"తల్లీ! నీకు మా నమస్కారాలు. అనంతమైన కన్నులు కలిగిన రూపంతో శతాక్షిగా అవతరించి మమ్మల్ని అనుగ్రహించావు. ఆమ్మా! మా మీద దయ కురిపించి వేదాల్ని మాకు తిరిగి ప్రసాదించు" అంటూ ప్రజలు, దేవతలు ఏక కంఠంతో మహేశ్వరిని వేడుకున్నారు. భక్తులప్రార్థనలతో సంతుష్టురాలైన జగదంబ తాను ధరించిన సకలశాకాలను (కూరలు) వారికి అనుగ్రహించింది. దీంతో ప్రజల ఆకలిదప్పులు తీరాయి. శాకాలను ధరించి, స్వయంగా సకలలోకాలకు శాకములను ప్రసాదించిన ఆ రూపంలో జగన్మాత 'శాకంబరి'గా లోకాలకు ఆరాధ్య అయింది.

## సందేశం

జగన్మాత ధరించిన శాకంబరీ అవతారం ఎన్నో సందేశాల్ని మనకు అందిస్తుంది. ఈ అవతార ఆవిర్భావంలోని ప్రతి ఘట్టం మనకొక దిశానిర్దేశం చేస్తుంది.

మొదటి సందేశం– వేదపరిరక్షణ. ఎప్పుడైతే వేదాలు రాక్షసుల చేతికి చిక్కాయో అప్పుడు లోకమంతా వేదానికి దూరమైంది. ఎప్పుడు వేదాలు లోకానికి దూరమయ్యాయో ఆ క్షణం నుంచి లోకమంతా దుర్భిక్షపరిస్థితులకు లోనైంది. ఇక్కడే మనం గ్రహించాల్సిన రహస్యం ఉంది. వేదం అంటే కేవలం మంత్రం మాత్రమే కాదు. వ్యక్తి జీవనవిధానం కూడా. నిద్ర లేచింది మొదలు తిరిగి నిద్రకు ఉపక్రమించే వరకు మనిషి చెయ్యాల్సిన కర్తవ్యాన్ని వేదం బోధిస్తుంది. అజ్ఞానిగా ఉన్న మనిషికి వైజ్ఞానికమార్గాన్ని చూపిస్తుంది. అజ్ఞానిగా ఉన్న మనిషి జ్ఞానాన్ని, జ్ఞానస్వరూపుడైన దైవాన్ని తెలుసుకోవటమే వేదం. ఎప్పుడైతే మనిషి దైవాన్ని తెలుసుకోలేడో అప్పుడు అతడికి మిగిలేది దుర్భిక్షమే అనేది దుర్గముడు వరం పొందిన ఘట్టం మనకు తెలియజేస్తుంది. వేదాన్ని దూరం చేసుకుంటేపోయేది మంత్రం మాత్రమేకాదు. ఆ మంత్రాల వెనుక దాగున్న మంత్రశక్తి. ఆ అక్షరాల వెనుక అంతర్లీనంగా దాగి ఉండి మనకు అస్తిత్వాన్ని కలిగించే సంస్కృతి. ఎప్పుడైతే సమాజం సంస్కృతికి దూరమౌతుందో అప్పుడు మిగిలేది క్షామమే. కాబట్టి, వేదపరిరక్షణ, వేదసంస్కృతీ పరిరక్షణ ప్రతి ఒక్కరి ప్రాథమిక కర్తవ్యాలు కావాలని శాకంబరీ అవతారం తన తొలిసందేశాన్నిస్తుంది.

రెండో సందేశం– ప్రకృతిసంరక్షణ. దుర్గాదేవి ప్రకృతి స్వరూపిణి అనటం, ఆమెను పూజించటం వెనుక ఉన్న అంతరార్థం మనిషిని ప్రకృతీపరిరక్షణ దిశగా చైతన్యవంతుడిని చెయ్యటమే తప్ప మరొకటి కాదు. మనిషి ప్రకృతిని ఆశ్రయించాలి కానీ ఆక్రమించకూడదు. ఎప్పుడైతే మనిషి హద్దులు మీరి ప్రవర్తించి ప్రకృతిని తన వశం చేసుకోవాలనే విపరీత ఆలోచన చేస్తాడో అప్పుడు మిగిలేది క్షామమే. తిరిగి ఆ ప్రకృతి స్వరూపిణి అయిన జగన్మాత అనుగ్రహిస్తే కానీ ప్రకృతిఫలాల్ని మనం అందుకోలేం. విజ్ఞానం మన పునాదుల్ని మరింతగా దృఢం చేసేదిగా ఉండాలే కానీ మూలాల్ని కదిలించేదిగా ఉండకూడదు. ఇలా చెయ్యటం కూర్చున్న చెట్టుకొమ్మను నరకటమే అవుతుంది. కాబట్టి, ప్రకృతిని సంరక్షించుకోవటం మన ప్రధాన బాధ్యతల్లో ఒకటి కావాలనేది శాకంబరీదేవి మనకు అందిస్తున్న సందేశంగా గ్రహించాలి. ఈ దిశగా తక్షణమే ఆచరణ ప్రారంభించాలి.



# మురిపాలా అరచేతా మొగ్గతొడిగింది!

– కళారత్న
డా॥ జి.వి.పూర్ణచందు,
94401 72642

ప్రకృతిసంపదతో మానవజీవితాన్ని అనుసంధానం చేసింది ఆయుర్వేదం. వ్యాధిని ఎదుర్కోవటానికి ప్రకృతి మానవుడికి చేయగలిగినంత సాయం చేస్తూనే ఉంది. ఆయుర్వేద విధానంలో మందుమొక్కలంటూ విడిగాలేవు. మందుకు పనికి రాని ద్రవ్యమే లేదని ఆయుర్వేద సిద్ధాంతం.

ఆయుర్వేదశాస్త్రవేత్తలు వైద్యరహస్యాల్ని ప్రజాపరం చేశారు. ఆహారపరంగానూ, ఆచారాలపరంగానూ ఎన్నో ఔషధ ప్రయోజనాలను ప్రజలకు నేర్పించారు. ఏఏ ఋతువుల్లో ఎలా జీవించాలో పండుగలు, పబ్బాలపేరుతో తెలియజెప్పారు. తెలుగువారు వాటిని అందిపుచ్చుకున్నారు. భారతదేశంలో ఆయుర్వేద విధానంలో భోజనవిధానాన్ని పాటిస్తున్నది తెలుగువారే!

ఆషాడంలో గోరింటాకు విరగకాస్తుంది. 'గోరింటా పూచిందీ కొమ్మాలేకుండా... మురిపాలా అరచేతా మొగ్గా తొడిగింది' అంటూ తెలుగు ప్రజల గోరింటాకు ప్రీతిని దేవుల పల్లి పాటగా రాశారు.

వేసవి వెళ్లి ఆషాఢం రాకతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడుతుంది. ఆషాఢ, శ్రావణమాసాలలో పూలూ గింజలతో కొమ్మలు కనిపించనంతగా గోరింతచెట్టు పచ్చగా ఉంటుంది. తొలకరిజల్లులతో పొలాలు కళకళలాడుతుంటాయి. ప్రకృతి పులకరించే కాలం. కాలే పెనం మీద ఆ వేడికి నీళ్లు చిందులు వేసినట్టు ఆషాఢంలో వేసవి తాపం మీద వానజల్లులు కురిసి, శరీరంలోంచి ఊష్మం బయటకువస్తుంది. దాన్ని చల్లార్చి శాంతింపచేయటానికి గోరింటాకు పెట్టుకునేవారు. గోరింటాకుని ఇంట్లో రుబ్బి పెట్టుకుంటేనే ఇప్పుడు మనం చెప్పుకోబోయే గుణాలు దక్కుతాయి. బయటదుకాణాల్లో దొరికే రంగు రసాయనాలు కలిసిన మెహిందీలకు ఈ గుణాలుండవు.

మెహింది, మెంధి, మెందిక, తిమిర, మదయంతి, మల్లిక, మోదయంతి ఇలా సంస్కృతంలో గోరింటను పిలుస్తారు. గోరు+అంటు జనవ్యావహారికంలో గోరింట అయ్యింది. 'క్రొమ్మాకు' లేదా 'క్రొమ్మి' అని కూడా తెలుగువాళ్లు పిలుస్తుంటారు.

గోరింటాకును చేతులకు, పాదాలకు పెట్టుకోవటం తెలుగువారికి మంగళప్రదమైన. శుభప్రదమైన ఆచారం.

ప్రబంధ వేంకటేశ్వరవిజయవిలాసంలో గణపవరపు వేంకటకవి మోదుగపూలు, లక్క, కెంపు రంగుల్లో పండిన గోరింటాకుతో గాయాలను మాపటాన్ని గురించి ప్రస్తావించాడు. "మందారంలా పూస్తే మంచిమొగుడొస్తాడు/సిందూరంలా పూస్తే చిట్టీచేయంతా/ అందాలచందమామ అతనే దిగివస్తాడు..." అని గోరింటాకు భవిష్యత్తుని కూడా చెప్తుందని తెలుగువారు భావిస్తారు. గోరింటాకు గోళ్లకు, చర్మానికి, కేశాలకు రంగునిచ్చే రంగు మొక్క మాత్రమే కాదు, అద్భుత ఔషధప్రయోజనాలను కలిగించే మందుమొక్క కూడా! దీని ఆకులు, పూలు, గింజలు, చెట్టు బెరడు, వేళ్లు ఈ పంచాంగాలూ పరమప్రయోజనాల నిచ్చేవే! నిరపాయకరమైనవి కూడా! పెంచుకుంటే పెరట్లో పెరిగేవే! ఉపయోగాలు తెలిస్తే ఈ మొక్కని ఎవరూ వదులుకోలేరు. దీని ఆకులు చేదు(తిక్త), వగరు(కషాయ) రుచులను కలిగి ఉంటాయి. తేలికగా అరిగే స్వభావం (లఘు) చలవచేసే గుణం (శీతవీర్యం), కఫాన్ని, వేడినీ తగ్గించే ప్రభావం దీనికున్నాయి. కడుపులోకి తీసుకుంటే గోరింటాకులు, పూలు, చెట్టుబెరడు, వేళ్లు కూడా సూక్ష్మక్రిములకు వ్యతిరేకంగా పనిచేస్తాయి.

చర్మానికి ఎరుపురంగుని, జుత్తుకు నలుపురంగుని, వెంట్రుకలకుదుళ్లకు బలాన్ని ఇచ్చి, చర్మరోగాలను పోగొట్టి చర్మానికి పోషణ కలిగించే శక్తి గోరింట ఆకుల కుంది. రుబ్బిన గోరింటాకును నీళ్లలో వేసి మరగించి, చిక్కని కషాయం కాచి వడగట్టండి. ఆ కషాయానికి సమానంగా నువ్వులనూనె కలిపి నూనె మాత్రం మిగిలేలా నీరంతా ఆవిరయ్యే వరకూ మరగించండి. ఇది గోరింటాకు తైలం. దీన్ని లేపనం చేస్తే ఎగ్జిమా

త్వరగా తగ్గుతుంది. సోరియాసిస్ పొలుసులు రాలటం ఆగుతుంది. దద్దుర్లు, ఎలర్జీల వల్ల వచ్చే చర్మవ్యాధులు, ఫంగస్ లాంటి సూక్ష్మజీవుల వల్ల వచ్చే వ్యాధులను ఇది తగ్గిస్తుంది. గజ్జి కురుపులక్కూడా ఇది చక్కని లేపన ఔషధం.

దీని పూలు, గింజలు, వేళ్లు, చెట్టుబెరడులలోని పలు రసాయనాలు మెదడుకు, మనసుకు, చర్మానికి, కేశాలకు, జీర్ణాశయానికి మేలు చేసేవి ఉన్నాయి. మూర్ఛలజబ్బులోనూ, లివర్‌వ్యాధుల్లోనూ వీటి ప్రయోగం ఉంది. కేన్సర్ వ్రణాలలో గోరింట పంచాంగాలనూ ఔషధంగా ప్రయోగించవచ్చు. దీని వేళ్లకు సుఖవ్యాధులను తగ్గించే గుణం ఉంది. గనేరియా, సిఫిలిస్ లాంటి వ్యాధుల మీద ఇది బాగా పనిచేస్తుంది. వేళ్లను నూరి, నీళ్లలో వేసి టీ లాగా మరగించి ఒక కప్పు చొప్పున ఉదయం, సాయంత్రం తీసుకుంటే బాగా పనిచేస్తుంది. దురదలలో కూడా తప్పక ఫలితం కనిపిస్తుంది. హిస్టీరియా, మూర్ఛలజబ్బు, మానసిక వ్యాధుల్లో గోరింట వ్రేళ్ల టీ రోజూ త్రాగుతుంటే ఉపయోగం కనిపిస్తుంది.

మూత్రం అయ్యేలా చేసే గుణం గోరింటాకులకుంది. మైగ్రేన్ తలనొప్పిలో ఆకులను రుబ్బి కణతలకు కడితే తలనొప్పి తగ్గుంది. గాయాలు, కాలినపుళ్ల మీద కడితే త్వరగా మానేలా చేస్తుంది (Wound Healing Activity). విష దోషాలను హరించే గుణం (Antioxidant Activity) ఈ ఆకులకుంది.

గింజలను నేతితో నూరి పావు చెంచా నుండి అరచెంచా వరకూ తినిపిస్తే, విరేచనాలు తగ్గుతాయి. చంటిపిల్లల్లో విరేచనాలైనప్పుడు మల ద్వారం చుట్టూ ఎర్రగా అయ్యే పరిస్థితిని ఇది నివారిస్తుంది.

ఆకుల కషాయం తాగితే మందుతో సమానంగా రక్తంలో షుగరు స్థాయిని తగ్గిస్తుంది (Anti Diabetic Activity). మేధస్సుని, మనోబలాన్ని, నరాల బలాన్ని పెంపుచేసే గుణం దీని ఆకుల కషాయానికి ఉంది. నొప్పివాపులను తగ్గించే గుణం కూడా ఈ ఆకులకుంది. క్షయవ్యాధి మీద కూడా దీనికి ఔషధ ప్రయోజనం ఉందని ఇటీవల కనుగొన్నారు. రక్తస్రావాన్ని అరికడుతుంది. మానసిక ఒత్తిడిని తగ్గించి, రక్తపోటును అదుపులో పెడుతుంది. గుండె పైన వత్తిడుల్ని తగ్గిస్తుంది.

anthraquinones అనే రసాయనాలు గోరింటాకులోనూ, దాని పూలు, గింజలు, బెరడు వేళ్లలోనూ ఉంటాయి. Staphylococcus epidermidis లాంటి చర్మవ్యాధుల్లో సూక్ష్మ జీవులను సంహరించే (antimicrobial) ఔషధంగా పనిచేస్తాయి.

గోరింటలో Trypsin inhibitory effect అనే మాంస కృత్తుల నిరోధకగుణం ఉండటం చేత ఇది స్థూలకాయం, షుగరువ్యాధి కొవ్వుకు సంబంధించిన వ్యాధులను, కేన్సరుని అరికట్టటంలో బాగా ఉపయోగపడుతుంది. రక్తవృద్ధిని కలిగిస్తుంది. కాలేయాన్ని ఊపిరితిత్తుల్ని బలసంపన్నం చేసి కఫం పేరకుండా నివారిస్తుంది. కరోనాలాంటి వ్యాధులపైన దీన్ని వాడితే ప్రయోజనం ఉంటుంది. గోరింటాకు, కొద్దిగా మిరియాలు కలిపి రుబ్బి బఠాణీగింజలంత ఉండలు చేసుకుని ఆరబెట్టి, రోజూ రెండుమూడుమాత్రలు తీసుకుంటే అన్ని వ్యాధుల్లోనూ మేలు చేస్తుంది.



## శ్రీవేంకటేశ్వరలీలలు




# స్వామిపాదాలు విడువను..

- శ్రీమతి జె.అపర్ణ

మా చిన్నతనంలో తిరుపతి ఏటా క్రమం తప్పకుండా వెళ్లే వాళ్లం. అమ్మానాన్న మమ్మల్ని వెంటపెట్టుకుని ఎంత కష్టమైనా భరించి వేంకటేశ్వరుడి దర్శనం చేయించేవారు. అయితే, చిన్నతనం కావటంవల్ల నాకైతే అంతగా అవగాహనలేకపోయింది. వయసు పెరుగుతున్నకొద్దీ అమ్మానాన్న ఎందుకంత కష్టపడి దర్శనానికి వెళ్ళాలి అనే భావన నాలో క్రమంగా బలపడసాగింది. అలాగని, దైవమంటే ద్వేషం ఉండేది కాదు. కానీ, సుఖంగా జరిగితే దర్శనం చేసుకోవాలి గానీ అందుకోసం కష్టపడటం ఎందుకనే భావజాలం నాది. వయసు పెరుగుతున్న కొద్దీక్రమంగా అదో రకం హేతువాదపద్ధతికి మారాను. చిన్నపాటిరేకుల ఇంటి నుంచి కాస్తంత ఖరీదు చేసే అపార్ట్‌మెంట్ కొనుక్కునే స్థాయికి ఎదిగాను. ఉన్నంతలో గొప్ప ఉద్యోగమే దొరికింది. వివాహమైంది. ఇద్దరు పిల్లలు. నాకు మాత్రం వయసు పెరుగుతున్న కొద్దీ ప్రతిదాన్నీ ప్రశ్నించే లక్షణం విపరీతంగా పెరిగిపోతోంది. దైవం కూడా ఇందుకు మినహాయింపు కాని పరిస్థితి వచ్చింది. ఏ పూర్వ పుణ్యమో జీవితం సుఖంగానే గడుస్తోంది.

పెద్దవాళ్లు చెప్పినట్టు కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. నా పూర్వపుణ్యం పూర్తిగా కరిగిపోయే పరిస్థితి వచ్చిందను కుంటా.... కష్టాలు ఒక్కొక్కటిగా వరుసకట్టి మరీ నా వెంటపడ సాగాయి. ఎదుగుతున్న పిల్లలు పెడధోరణి పట్టారు. వాళ్లు కూడా నాలాగే ప్రశ్నించటం మొదలుపెట్టారు. ఉద్యోగంలో చికాకులు ఎదురయ్యాయి. నాకు సంబంధంలేని అంశాలకు సైతం మాటపడాల్సి వస్తోంది. ఆరోగ్యసమస్యలు కూడా తరచుగా పలకరిస్తున్నాయి. ఏదీ కలిసిరావటం లేదు. కష్టాల్లో తోడు ఉండాల్సిన భర్త కూడా నీ కష్టం నీది, నా కష్టం నాది అన్నట్టు ప్రవర్తిస్తున్నాడు. ఇంకెవరితో చెప్పు కోవాలి నా గోడు. ఆ రోజు నాకు బాగా గుర్తు... శనివారం. ఆఫీసులో సహోద్యోగి తిరుపతి ప్రసాదం తీసుకువచ్చి అందరికీ పంచాడు. ఆ రోజెందుకో ఆఫీసులో పెద్దహడావిడి లేదు. మధ్యాహ్నం భోజనవిరామం. భోజనంచేసి, అలా రోడ్డు మీదకు రాగానే కోయదొర కనిపించాడు. అతడూ నన్ను చూడగానే దగ్గరకు వచ్చి మాట్లాడటం మొదలుపెట్టాడు. నా తత్త్వానికి విరుద్ధమైనప్పటికీ అప్పుడెందుకో కోయదొరమాటలకు అడ్డుచెప్ప లేక పోయాను. ఆయన నా కష్టాలన్నీ ఒక్కొక్కటిగా చెబుతూ... "ఇంటిదైవాన్ని మించిన దైవం లేదు దొర. తిరుమలస్వామిని మర్చిపోయావు. నీ ఆలోచనే మేటిదంటావు. దైవం కన్నెర్ర జేసింది దొర. పున్నేల పంట కరిగిపోయింది. మూడునామాల దొర పాదాలు పట్టుకో. అంతా శుభం జయం..." అంటూ నా గురించి మరోక్షణం పట్టించుకోకుండా వెళ్లిపోయాడు.

కంటిముందు గతం కదలాడింది. చదువుకున్నాననే గర్వం, నా ఆలోచనే గొప్పదన్న అహంభావం నన్ను దైవానికి దూరం చేశాయని అర్థమైంది. ఆ క్షణమే తిరుమల శ్రీవేంకటే శ్వరుడి పాదాలకు నమస్కరించాను. ఇంటికి రాగానే కుటుంబ సభ్యులతో తిరుపతి వెళ్దామని చెప్పి, ఏర్పాట్లలో మునిగి పోయాను. ఏడుకొండలు ఎక్కి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నాను. స్వామి కరుణించాడు. బాధలన్నీ ఒక్కొక్కటిగా గట్టెక్కడం మొదలుపెట్టాయి. అవును... నిజం. వెంకన్నస్వామి మా ఇంటిదైవం. మా గోడు విన్నాడు. నన్ను కరుణించాడు. ఇంకెప్పుడూ ఆ స్వామిపాదాలు విడిచిపెట్టను.



# జీవితచక్రంలో..!



-శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు,9989679681

శ్రీమన్మహావిష్ణువునకు పంచాయుధాలు ఉంటాయి. అవి: సుదర్శనచక్రం, పాంచజన్యశంఖం, కౌమోదకీగద, నందకఖడ్గం, శార్ఙ్గ ధనువు. సౌర మానం– కర్కాటకంలో– చిత్తానక్షత్రాన సుదర్శనచక్రరాజం అవతరించింది. భగవానుని ఆయుధాలన్నింటిలోను చక్రత్తాళ్వార్ శక్తివంతమైంది. పంచా యుధాలు నిత్యసూరివర్గానికి చెందినవి.


పూర్వపుదినాల్లో విష్ణుసహస్రనామంతోపాటు పంచాయుధస్తోత్రం కూడ పారాయణం చేసేవారు. పంచాయుధ స్తోత్రాన్ని ఎవరైతే పఠిస్తారో వారు పాప భయవిముక్తులౌతారని ఫలశ్రుతిలో చెప్పబడింది. అరణ్యంలో, యుద్ధంలో, అపాయంలో ఉన్న సమయాన పంచాయుధస్తోత్రం జపిస్తేవారికి భగవానుడు పూర్తి రక్షణ కలిగిస్తాడని నమ్మకం.

సుదర్శన షడక్షరమంత్రం, సుదర్శనాష్టాక్షరీ మహామంత్రం, సుదర్శన నారసింహమంత్రం, సుదర్శననృసింహమంత్రం (మరోపద్ధతి) జ్వాలా సుదర్శనం, ఆత్మరక్షాకర సుదర్శనం, పరవిద్యాభేదన సుదర్శనం, అస్త్రమంత్ర సుదర్శనం, వశీకరణసుదర్శనం, సమ్మోహన సుదర్శనం, సుదర్శన హృన్మంత్రం, ఆకర్షణసుదర్శనం, సుదర్శనమాలామంత్రం మొదలైనవి మంత్ర శాస్త్ర సంబంధితాలు. సాధకులు నియమ, నిష్ఠలతో ఆయామంత్రాలను అనుష్ఠిస్తే ఆయా ఫలితాలు ఉంటాయని పరంపరవిశ్వాసం. ఇక సుదర్శన యంత్రాన్ని బహువిధాలుగా వినియోగిస్తుంటారు.

## ఈ నెల 29వ తేదీ శ్రీచక్రత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం

జ్యోతిశ్శాస్త్రరీత్యా గ్రహపీడకలిగినవారు ఆయా గ్రహాలను పూజించి నవగ్రహాది జపాలను చేస్తుండటం అద్వైతాదిమతాలలో కనిపిస్తుంది. అయితే విశిష్టాద్వైతులు మాత్రం ఆయాబాధల నివారణార్థం సౌలభ్య చూడామణిస్తోత్రం, సుదర్శనకవచం, సుదర్శనశతకం, సుదర్శననారసింహం, సుదర్శనాష్టోత్తర శతనామస్తోత్రాలను జపించటం, పారాయణం చేయటం సంప్రదాయంగా వస్తోంది. వైష్ణవసంప్రదాయ పూర్వవర్తమాన పంచాంగా లను పరిశీలిస్తేకూడా ఈ విషయం స్పష్టమౌతుంది. అందుకే కేవల విశిష్టా ద్వైతసంప్రదాయ దేవాలయపరిధులలో నవగ్రహాదిప్రతిష్ఠలు కన్పించవు. సుదర్శనప్రతిష్ఠలు దర్శన మిస్తాయి. సుదర్శనవిగ్రహాలకు ముందువైపు సుదర్శనుడు దర్శనమివ్వగా, వెనుకవైపు నారసింహదర్శనం ఉంటుంది.

దుర్మాంత్రికుల బెడదను నివారించేందుకు శ్రీరంగక్షేత్రంలో శ్రీసుద ర్శన నారసింహమూర్తి ప్రతిష్ఠించారు. నేడు కూడా శత్రుభయనివారణార్థం సుదర్శన నారసింహమంత్రాన్ని పారాయణం చేయటం ఉంది. పరవిద్యా భేదనం, వశీకరణం, ఆకర్షణం, సంమోహనంఅనే పేరుతో లభిస్తున్న వివిధ సుదర్శన మంత్రాలప్రయోజనం వాటి పేర్లే సూచిస్తున్నాయని వేరుగా చెప్ప నవసరంలేదు. చక్రాంకనం కానివాడు వైష్ణవుడే కాదు అని విశిష్టాద్వైత సంప్రదాయ గ్రంథాలు తెలుపు తున్నాయి. సర్వపీడా నివారణకూ, సర్వఫలప్రదా లకూ సుదర్శనచక్రరాజ మహామంత్రం మహోన్నత మైంది. మంత్రశాస్త్రంలో చక్రషట్కం (ఆరుచక్రాలు) చెప్పబడింది. అవి కాలచక్రం, పురుషచక్రం, ప్రకృతి చక్రం, మహచ్చక్రం, అహంకారచక్రం, జగచ్చక్రం. ఏదైనా బాగా జరుగుబాటు ఉంటే చక్రంబాగా తిరు గుతూ ఉంది. అంటుంటాం. జరుగుబాటు లేకుంటే చక్రం ఆగిపోయిందని అంటుంటాం. అంటే మనకు తెలియకనే మన జీవితచక్రంలో చక్రం చోటు చేసు కుంది. బీజాక్షరసంపుటితమైన మహాసుదర్శన మంత్రాన్ని నియమనిష్ఠలతో గురుముఖతః అభ్యసించి జపిద్దాం! సుదర్శనయంత్రాన్ని పూజిద్దాం!



జూలై, 2022

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం**–దూరప్రయాణాలు కలసివస్తాయి. గృహ వాతావరణం అనుకూలం. ఆరోగ్యం, పుత్రసౌఖ్యం, దేహంలో సమస్యలు తొలగి ఆరోగ్యం కల్గును. ముఖ్యమైన పనులు ప్రారంభించడానికి ముందు కుటుంబ సభ్యులతో ఆలోచన చేయడం మంచిది.



**వృషభం**– ధైర్యం, చాకచక్యం ప్రణాళికలతో వ్యవస్థను సరిదిద్దే ప్రయత్నంలో మీ కృషి ఫలిస్తుంది. వాగ్ధాటి ప్రదర్శించి కార్య జయం సాధిస్తారు. గృహోపకరణ వస్తువులు కొనుగోలు. దూర ప్రాంతాలలో భూముల కొనుగోలు అమ్మకం కలసివస్తుంది.



**మిథునం**– జన్మరాశిలో రవిసంచారంవల్ల తరచూ కోపోద్రిక్తతలకు గురి అవుతారు. మధుమేహం, రక్తపోటువంటి దీర్ఘకాలిక సమస్యలు వేధిస్తాయి. యత్న కార్యసిద్ధి, కుటుంబసౌఖ్యం కల్గును. వ్యాపారాలు స్తంభించే అవకాశం ఉంది.



**కర్కాటకం**–విద్యార్థులకు ఉన్నతవిద్యలకై అవకాశాలు వస్తాయి. ఈ రాశివారికి అధికారవృద్ధి, ఉద్యోగంలో ఉన్నతి, వృత్తివ్యాపారాలు అనుకూలం. అందరిలోనూ మెరుపులా మెరుస్తారు. శిరోవేదన తరచు వేధిస్తుంది.



**సింహం**– సాంఘికకార్యక్రమాలలో పాల్గొని తగు సలహాలు సూచనలు ఇవ్వడం వల్ల గౌరవం పెరుగుతుంది. వ్యవహారజయం, గ్రహస్థితి అనుకూలం. భూగృహస్థిరాస్తుల వృద్ధి కలుగుతుంది.



**కన్య**–సోదరసోదరీవర్గంతో మాటపట్టింపులు, ధన వ్యయం, మిత్రులమధ్య ఉపకార ప్రత్యుపకారాలు, అపరిష్కృత సమస్యలకు ఈనెలలో పరిష్కారం కనుగొంటారు. విదేశీప్రయాణాలు కలసివస్తాయి. క్యాంపస్ సంబంధ ఎంపికలలో విజయం సాధిస్తారు.



**తుల**– దుఃఖంనశించి ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. ద్రవ్యలాభం. ఇతరులతో సంభాషించేటపుడు గొప్ప చాకచక్యం ప్రదర్శించి సుహృద్భావ వాతావరణాన్ని నెలకొల్పుతారు.



**వృశ్చికం**–విద్యావిషయాలలో ఉత్తమశ్రేణిలో రాణిస్తారు. కోరికలను అదుపులో ఉంచుకుని ముందుకుసాగడం చాలా అవసరం. మీ పై నీలాపనిందలు పడే అవకాశం గలదు. గ్రహస్థితి అనుకూలం కాదు.



**ధనుస్సు**– కలసివచ్చేకాలం. నిర్మాణాలు కలసివస్తాయి. ఆరోగ్యంపై దృష్టి అవసరం. వృత్తివ్యాపారాలు కలసివస్తాయి. గృహస్థిరాస్థివృద్ధి చేస్తారు. విద్యార్థులు పతకాలు గెలుచుకుంటారు.



**మకరం**–గృహాలంకరణ వస్తువులుకొంటారు. నూతన వస్త్రలాభం. ఆధ్యాత్మికచింతన పెరుగుతుంది. ఆదాయమార్గాలు మెరుగౌతాయి. ఋణాలు తీరి ఉపశమనం కలుగుతుంది. వ్యవహారప్రతిబంధకాలు తొలగుతాయి. స్థిరాస్తిని కొనుగోలు చేస్తారు.



**కుంభం** – స్థానచలనసూచనలు. అనుకున్న ప్రతి పని భారంగా సాగుతుంది. అయితే ఇంట్లో ఆనందకరమైన వాతావరణం ఉంటుంది. ఉద్యోగ లబ్ధి చేకూరుతుంది. వృత్తివ్యాపారాలు అనుకూలమౌతాయి. చేసే ప్రతీపనిలో దైవబలం ఉంటుంది. ఆకస్మిక ధనలాభం వరిస్తుంది.



**మీనం**–ఆత్మబలం, ముఖవర్చస్సు పెరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఊహించినదానికన్నా అధికధనవ్యయమవుతుంది. శుభకార్యం కలసి రావడం వల్ల ఆనందకరమైన సమయం. వ్యయప్రయాసలు ఉన్నా కార్యజయం కలుగుతుంది. గృహనిర్మాణాలు ఆలస్యమౌతాయి. దైవధ్యానం ధర్మనిష్ఠ కలుగుతాయి.



సౌమిత్రిసహోదర! దశరథరామా!


# తాళ్ళపాకసంకీర్తనలు

## పరిశోధనలో కొత్తగా వెలుగు చూస్తున్న తాళ్ళపాక కవుల పదసాహిత్యం

పరిష్కర్తలు- డా॥ వేటూరి ఆనందమూర్తి, గంధం బసవ శంకర రావు, పద్మభూషణ్ డా॥ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి, సైజు- ఎ4, ఎల్×1-369; ప్రతులకు- తి.తి.దే. పుస్తకవిక్రయశాల తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కపిలతీర్థంరోడ్డు, తి.తి.దే., తిరుపతి-517 502. మూల్యం- 120/- (పోస్టేజి అదనం)

అన్నమయ్య సంకీర్తనలలో లభ్యమైనవాటికంటే అలభ్యమయినవే ఎక్కువ అని అనుకోవడమే గాని వాటిని పట్టుబట్టి పరిశోధించినవారు ఒకరిద్దరే. ఈ నేపథ్యంలో అభిరుచితో, సాహిత్యపిపాసతో నిర్మాణాత్మకమైన ప్రణాళికతో కృషి చేసినవారు పద్మభూషణ్ డా॥ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డిగారు. తన సంస్థలోని శ్రీగంధం బసవశంకరరావును ప్రోత్సహిస్తూ, ప్రత్యేకసెలవులు మంజూరు చేస్తూ, తాళ్ళపాకసంకీర్తనల సేకరణార్థం శ్రీరంగం, మధుర, తంజావూరు పట్టణాలలోని గ్రంథాలయాలకు పంపి ఇంతవరకు వెలికిరాని కీర్తనలను సేకరింపజేసి సాహిత్యలోకానికి పరిచయం చేసినవారు శ్రీవరప్రసాద్‌రెడ్డిగారే. ఇంతటితో ఆగక ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారి చేత పరిష్కరింపచేయడం భగీరథ ప్రయత్నంలాంటిది. తొంభై ఏళ్ల వయసులో ఇంతటికృషి ఊహాతీతం.

ఈ సంపుటంలో తాళ్ళపాక సంకీర్తనలు వ్రాతప్రతిని శ్రీవేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనసంస్థకు సమర్పించిన తాళ్ళపాక వేంకటశేషాచార్యులు. వారి ధర్మపత్ని ఫోటోలను, అలాగే అన్నమాచార్యచరిత్ర వ్రాతప్రతిని సంస్థకు చేర్చిన తాళ్ళపాక సూర్యనారాయణయ్య, వారి ధర్మపత్ని ఫోటోలను జతచేయడం ఈ సంపుటానికి నిండుదనం చేకూర్చిన అంశాలు. ఇవే గాక డా॥ కె.ఇ.వరప్రసాద్‌రెడ్డిగారి 'మరుగు నుంచి వెలుగులోకి వచ్చిన మరకతాలు, మాణిక్యాలు 'కొన్ని అన్నమయ్యసంకీర్తనలు' అనే వ్యాసం. 'అముద్రితములైన తాళ్ళపాకసంకీర్తనలు. ఒక పరిశోధనాత్మకపరిశీలన'(మొదటి పీఠిక-2005) 'తాళ్ళపాక సంకీర్తనలు' (రెండవపీఠిక-2022) అనే ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారి వ్యాసాలు, డా॥తాడేపల్లి పతంజలి గారి 'తాళ్ళపాక పాటల మాటల మూటలు' అనే వ్యాసం 'ఇదొక భగీరథ ప్రయత్నం' వ్యాసం రాసిన గంధం బసవశంకర రావుగారి వ్యాసాలు చతుస్సాగరాలుగా ఉన్నాయనడం వాస్తవం. వీరందరి కృషి, సంకీర్తనాసక్తి, విద్వాంసులకే ఎరుక. తాళ్ళపాకవారి రచనలపై కృషి చేయాలనుకొనేవారికి ఈవ్యాసాలు కరదీపికలు. వీరి కృషిని ఎంత పొగడినా తక్కువే.




ఈ సంపుటం వల్ల పాఠకులకు అవగతమయ్యే అంశాలు- తాళ్ళపాకపదకవులు ముగ్గురేగాక నాలుగవ పదకర్తగానూ, శ్రీకృష్ణపదాలకర్తగాను భావింపబడిన తాళ్లపాక చిన్నన్న? కావచ్చుననడం శ్రీకృష్ణముద్రగల 15, అలాగే తంజావూరు లైబ్రరి కాగితపు ప్రతిలో 21 కీర్తనలు పై వాదానికి బలమనడం. అలాగే శ్రీఆనందమూర్తిగారు 'కంటన్ వత్తి పెట్టుకొని' పాఠనిర్ణయం చేసిన పాటలు, వాటికి తగిన వివరణలు. చివర 284 పాటలకు వ్రాతప్రతిలోని సంకీర్తన సంఖ్య, పల్లవి మొదలు, ముద్ర, రాగం-తాళం. వివరణల పట్టిక ఇవ్వడం అలాగే తాళ్లపాక సంకీర్తనల రాగసూచిక ఇవ్వడం భావి పరిశోధకులకు మార్గదర్శకాలు. 284 పాటల క్రింద ఆచార్య వేటూరి ఆనందమూర్తి, శ్రీగంధం బసవశంకర రావుగార్ల వివరణలు తాళ్లపాకసంకీర్తనల్ని అర్థం చేసుకొనే విధానాన్ని స్పష్టం చేస్తున్నది. ఈ సంపుటంలోని అరుదైన చిత్రాలు, నాగరలిపిలో వ్రాసిన అన్నమయ్య కీర్తన, వ్రాతప్రతిలోని కీర్తనల ఫోటోలు వగైరాలు పరిష్కర్తల శ్రమను, తపనను సూచిస్తున్నాయి.

- ఆచార్య కె.సర్వోత్తమరావు,
*97041 04000*

చిత్ర కథ

# నాన్నా..! పులి...!!


కథ- డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు- శ్రీ తుంబలి శివాజీ





కొడుకు ఆర్తనాదాలు సోమయ్య చెవిన పడ్డాయి..
అయ్యో! ఇదేమిటి? ఇప్పుడే వచ్చానే.. ఇంతలోనే ఇలా..
ఆ... వస్తున్నా
సోమయ్య పరుగు పరుగున మంద వద్దకు చేరాడు..
ఏదిరా... ఏది పులి?
హహ్హహ్హా... హహ్హహ్హా...
పులా... హహహ... పులీ లేదు గిలీ లేదు.. భలే తమాషాగా ఉంది కదూ....
సోమయ్యకు బాగా కోపం వచ్చింది...
వెధవా! నీ అల్లరి బాగా ఎక్కువయ్యింది. ఇంకోసారి ఇలా చేశావంటే తోలుతీస్తాను. జాగ్రత్త...
సోమయ్య వెళ్ళిపోయాడు. కాసేపటికి నిజంగానే పులి వచ్చింది.
రంగడు ప్రాణభయంతో చెట్టెక్కి పోయాడు. పులి, గొర్రెని తీసుకువెళ్ళిపోయింది.
నాన్నా! నాన్న! నిజంగానే పులి నాన్న! రక్షించండి...రక్షించండి...
రంగడి మాటలు విన్న సోమయ్య ఈ సారి నిజంగానే పులి వచ్చినా కూడా నమ్మలేదు. వెనుకకు రాలేదు.
పొలంపని చూసుకుని వచ్చిన సోమయ్య జరిగినదానికి చాలా బాధపడ్డాడు. రంగడికి కూడా బుద్ధివచ్చింది. అబద్ధమాడితే జరిగే అనర్థం తెలిసివచ్చింది.
ఇంకెప్పుడూ అబద్ధం ఆడను నాన్న!
శుభం
2

విశ్వదాభిరామం వేమన పద్యసూక్తి



# ఇల్లాలే స్వర్గము

ఇంటియాలు విడిచి, యిల జారకాంతల
వెంట దిరుగువాడు వెఱ్ఱివాడు;
పంటచేను విడిచి పరిగె యేరినయట్లు;
విశ్వదాభిరామ! వినురవేమ!

**అర్థాలు:** ఇంటియాలు= భార్య; ఇల= భూమి, లోకం; జారకాంత= వెలయాలు; పరిగె= పంటను కోయగా, కోతకు తప్పిన నాసిరకపు వెన్ను.


**భావం:** లోకంలో కట్టుకున్నఇల్లాలిని కాదని వెలయాలు వెంట తిరిగేవాడు వెర్రివాడు. అది పంట చేను విడిచిపెట్టి, పరిగె గింజలను ఏరుకుని, తిన్నట్లు ఉంటుంది.

వరిపొలం కోతకు వచ్చినపుడు ఆ పంట లోనే కొన్ని మొక్కలు నాసిగా ఉంటాయి. అవి కూడా పండినవే. కాని వాటిగింజలు నాసిగా ఉంటాయి. తినడానికి ఉపయోగపడవు. వాటిని పరిగె అంటారు. ఆ పరిగెగింజలు పైరుగింజల వలే శ్రేష్ఠం కావు.

**వివరణ:** పైరు కోసుకొనేటప్పుడు నాసిరకం మొక్కలు (పరిగెలు) కోతకు తప్పిపోతాయి. పైరునుండి వచ్చే శ్రేష్ఠమైనగింజలను వదలి పరిగెలు ఏరు కోవడం ఎంత అవివేకమో, ఇల్లాలిని విడిచి జారకాంతలవెంట తిరగడం అంత అవివేకం.

- కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

# 78 వైకుంఠపాళి



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

1)ధర్మరాజు భార్య (3); 4)దశరథుని పెద్దకుమారుడు (3); 5)వేదం(2); 6)కొడుకు(3); 7)కశ్యపప్రజాపతి, క్రోధలకు జన్మించిన కూతురు(2); 11)ధృతరాష్ట్రుని కుటుంబంలో జన్మించిన ఓ సర్పం(2); 12)గయుని భార్య(3); 15)ఒడ్డు(2); 16)ఉగ్రసేనుని సోదరుడైన దేవకుని కుమారిత(3); 17)భూమి(2); 20)ఒక అప్సరస(4); 21)శ్రీకృష్ణుని రథసారధి(4)

## నిలువు

1)శుకముని కుమారుడు(5); 2)భృగుని పుత్రుడు. శుక్రుని తండ్రి(2); 3)శివుడు(4); 4)అతిరథుడను సూతుని భార్య(2); 8)ధ్రువుని మనుమడు(2); 9)ఆత్మయొక్క మూడుగుణాల్లో ఒకటి(3); 10)ఋషభుని భార్య(3); 13)కంసుని దాసి(3); 14)శకుంతల కొడకు(4); 15)సూర్యుని కుమార్తె(3); 18)పిల్లనిచ్చిన తల్లి(2); 19)దేవశర్మ అనే రుషి భార్య(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు




# ఇంతకు ఇంతే!

- శ్రీ ఎస్.కె. సైదా,
80088 41447

రామాపురంగ్రామంలో నిరుపేదకుటుంబంలో గోపాలకృష్ణ అనే రైతు తన కుటుంబాన్ని ఏ లోటులేకుండా పోషించుకుంటూ ఉండేవాడు. ఇతరులకు తన చేతనైన సహాయం చేస్తూ భక్తికి, భుక్తికి అవసరమైన సంపదను అతని ఇంటిపెరటిలో ఖాళీగా ఉన్న స్థలంలో తులసి, తోటకూరసాగుచేసి ఇంటికి వచ్చే గ్రామస్తులకు హరిపూజకు తులసి, తమ భుక్తికి తోటకూర ఇస్తూండేవాడు. అలా ఆ జన్మంతా గోపాలకృష్ణ తులసి, తోటకూర దానం చేస్తూ ఉన్నాడు.

ఆ శాకాదానఫలం వల్ల మరుజన్మలో అతను కోటీశ్వరుల ఇంట్లో జన్మించి, ధనవంతుడయ్యాడు. పూర్వజన్మ సుకృతం వల్ల, దానం చేసిన ఫలం వల్ల కదా! ఈ జన్మలో ఇంత ధనవంతుడినయ్యానని మనసులో అనుకుని, ఇంకా ఎక్కువ భక్తి, భుక్తికి ఉపయోగపడేవిధంగా తులసి, తోట కూరదానం చేస్తే, వచ్చే జన్మకి ఇంకా ఏ రాజ్యానికైనా రాజు కావచ్చుకదా! అని ఆలోచించి అనుకున్నదే తడవుగా మరలా తులసి, తోటకూర దానం చేయడం మొదలుపెట్టాడు. కొంతకాలం తర్వాత గోపాలకృష్ణ తులసి, తోటకూర దానం తీసుకునేవాళ్లను ఒక ప్రశ్నవేస్తూ ఉండేవాడు. 'అంతకు ఇంత' అయితే "ఇంతకు ఎంతో?" అని ప్రశ్నించాడు. అలా అడుగుతూ ఉంటే, గ్రామస్తులకు ఎవరికి ఏమీ అర్థంకాక సమాధానం చెప్పకుండా చిరునవ్వు నవ్వి వెళ్లిపోయే వారు.

అలా కొంతకాలం గడిచింది. సాక్షాత్తూ భగవంతునికే అతనిపట్ల దయ కలిగింది. దానం ఎలా చేయాలో తెలియని అజ్ఞానం చేత కదా! అలా చేస్తున్నాడనీ అతనికి దానం ఎలా చేయాలో నేర్పదలచి, స్వామి వారే స్వయంగా మారు రూపంలో వచ్చారు. అప్పుడు గోపాలకృష్ణ యధాప్రకారం తులసి, తోటకూర దానం చేస్తూ, తులసి హరిపూజకు, తోటకూర మీ భుక్తికి అని చెప్పి దానం ఇస్తూ "మీరు మా ఊరికి కొత్తగా వచ్చినట్లు ఉన్నారు" అని "అంతకు ఇంత అయితే ఇంతకు ఎంత"? అని తను ప్రశ్నించాడు.

అందుకు గ్రామస్తుని రూపంలో ఉన్న భగవంతుడు "ఇంతకు ఇంతే" అని సమాధానం ఇచ్చాడు. అందుకు గోపాలకృష్ణ నిర్ఘాంతపోయి తన ప్రశ్నకు ఇన్నాళ్లకు సమాధానం వచ్చింది. అని ఆశ్చర్యానికి గురై ఆందోళనతో "ఎందుచేత?" అని ప్రశ్నించాడు.

అప్పుడు భగవంతుడు చిరునవ్వు నవ్వి "అప్పుడు నీ దగ్గర ఇవ్వడానికి ఏమి లేదు. తులసి, తోటకూర తప్ప కానీ ఇప్పుడు నీవు కోటీశ్వరుడవు. నీ దగ్గర అనంతమైన సంపద ఉంది. నీ దగ్గరకు వచ్చేవారు నీ దగ్గర ఎక్కువ సహాయం ఆశించి వస్తున్నారు. నిరుపేదపిల్లలకు విద్యసహాయం, ఆకలితో ఉన్నవారికి అన్నదానం, వివాహాలకు, జబ్బులను నయం చేసుకునేందుకు ధన సహాయం ఆశించి వస్తున్నారు. నువ్వుమాత్రం, తులసి, తోటకూర ఇవ్వడం నీకు భావ్యం కాదు కదా! నీకున్న సంపదకు ఇవన్నీ చేయడం కష్టసాధ్యం కాదు. అంతేకాకుండా విద్యాలయాలు, వైద్యాలయాలు, అన్నదానభవంతులు కడితే ప్రజలకు ఉపయోగదాయంగా ఉంటాయి. ఏవిధమైన సహాయం చేయాలన్న, చేయగల్గిన స్థితిలో నీవున్నావు. అవన్నీ మాని, తులసి, తోటకూర ఇస్తున్నావు. అది కూడా ప్రతిఫలం ఆశించి, అప్పుడు నీవు ప్రతిఫలం ఆశించలేదు. ఫలాపేక్ష లేకుండా నీవేమిచ్చినా అదే ఉత్తమదానం. కానీ ఇప్పుడు నీ తులసి, తోటకూరదానానికి ఏమి ఫలితంలేదు. 'ఇంతకు ఇంతే' ఫలం" అన్నాడు గ్రామస్తుడి రూపంలో ఉన్న భగవంతుడు.

గోపాలకృష్ణకు జ్ఞానం కలిగింది. అప్పుడు తన స్థాయికి తగిన విధంగా విరాళాలు ఇవ్వసాగాడు. విద్యాలయాలు, వైద్యాలయాలు, అన్నదాన భవనాలు స్థాపించి ఉచితవిద్య, వైద్యం, ఆహార సదుపాయాలు గ్రామస్తులకు కల్పించాడు. 'మంచిదానపరుడుగా' కీర్తిపొందాడు. మనం నిత్యం దానధర్మాలు, పూజలు చేస్తూ ఉంటాం అలా చేసే దానాలకు విశేషమైన ఫలం లభిస్తుంది. మనకు షోడశ దానాలు అని ఉన్నాయి. ఏది చేసినా, మన శక్తికి తగినట్లుగా చేయాలి. ఏ దానమైన ఫలం ఆశించి చేయకూడదు. మనకు ఏమి ఇవ్వాలో భగవంతుడే నిర్ణయిస్తాడు.



# బాలవినోదం

పిల్లలూ... మీ మేధకు పదును పెట్టండి....

## కదంబం

### నక్షత్రాలు

01)అశ్విని 02)భరణి 03)కృత్తిక 04)రోహిణి 05)మృగశిర 06)ఆర్ద్ర 07)పునర్వసు 08)పుష్యమి 09)ఆశ్రేష 10)మఖ 11)పుబ్బ 12)ఉత్తర 13)హస్త 14)చిత్త 15)స్వాతి 16)విశాఖ 17)అనూరాధ 18)జ్యేష్ఠ 19)మూల 20)పూర్వాషాఢ 21)ఉత్తరాషాఢ 22)శ్రవణం 23)ధనిష్ఠ 24)శతభిషం 25)పూర్వాభాద్ర 26)ఉత్తరాభాద్ర 27)రేవతి

### ఇందులో ఏ సామెత దాగుంది..?






### క్విజ్

1) అభిమన్యుని మాతృమూర్తి?
2) ఉపపాండవుల మాతృమూర్తి?
3) నకులసహదేవుల మాతృమూర్తి?
4) బలరాముడి మాతృమూర్తి?
5) దుస్సలమాతృమూర్తి?
6) పరీక్షిత్తు మాతృమూర్తి?
7) ఉత్తర మాతృమూర్తి?

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరి చూసుకోండి.

### గజిబిజి!!

*పిల్లలూ.. ఇక్కడున్న అక్షరాలను చదివి సరైన పదాలు రాయండి*

1) మలుషుద్దనుపె ....................
2) రబ్బుడచిల్లలు ....................
3) అలగెరటి ....................
4) తుమరిసోపో ....................
5) మొన్నజొక్కలు ....................

జవాబులు: 1)పెద్దమనుషులు 2)చిల్లరడబ్బులు 3)అరటిగెల 4)సోమరిపోతు 5)మొక్కజొన్నలు

### కనుక్కోండి


ఈ అక్షరాలతో ఒక సూక్తి వస్తుంది...

ఆ మ గ్య రో భా మే హా గ్యం

జవాబు: ఆరోగ్యమే మహాభాగ్యం

### చిత్రలేఖనం

ఈ క్రింది బొమ్మకు రంగులు వేద్దామా...



ఈ పక్కన ఉన్న బొమ్మను క్రింది గడులలో గీయండి...


Printed by **Sri P.Ramaraju,** M.A., and Published by **Dr. K.Radharamana,** M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. **Editor: Dr.V.G.Chokkalingam,** M.A., Ph.D.

ఒడిశారాష్ట్రం భువనేశ్వర్‌లో తి.తి.దే. నిర్మించిన శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో
2022, మే 21 నుండి 26వ తేదీ వరకు జరిగిన ఆలయ విగ్రహప్రతిష్ఠ, మహాసంప్రోక్షణ దృశ్యాలు









25-05-2022న తి.తి.దే. హనుమజ్జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించింది.
ఈ సందర్భంగా ఆకాశగంగలో వెలసిన అంజనాదేవి, బాలఆంజనేయస్వామివార్లకు
తి.తి.దేవస్థానం కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., పట్టువస్త్రాలు సమర్పించారు.







SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-06-2022 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No.TRP/155/2021-2023 "Licenced to post without prepayment No.PMGK/RNP/WPP-04(1)/2021-2023" posting on 5th of Every Month.

## శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవోత్సవం

(శ్రీనివాసమంగాపురం)

2022,
జూలై 03 నుండి
05 వరకు



శా. బాలార్కాంశువిజృంభితామలశరత్పద్మాక్ష పద్మాక్షమా
నీళాజాంబవతీశ యీశ బలభి న్నీ రేరుహోద్భూత ది
క్పాలామూల్యశిరోమణిద్యుతికనత్పాదాబ్జ పాదాబ్జఘా
లాలంకారకచావలీ మకరదీప్యత్కుండలాంచన్ముఖా.